PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 44 | విజయవాడ, బుధవారం 13 సెప్టెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 13 September 2023 | Rs

వడ్డీ పేరుతో రూ.1500 కోట్ల భారం

- నిబంధనల సవరణకు ఎపిఇఆర్‌సికి డిస్కమ్‌ల ప్రతిపాదనలు
- సిపిఎం తరుపున బాబూరావు అభ్యంతరాల సమర్పణ
- నేడు హైదరాబాద్‌లో విచారణ

● లోపలి పేజీలో.. ●

ఆసియాకప్ ఫైనల్‌కు టీమిండియా

- శ్రీలంకపై 41పరుగుల తేడాతో గెలుపు
- 10వేల పరుగుల క్లబ్‌లో రోహిత్

8

ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఆ సంస్థ చీఫ్ వోల్కర్ తుర్క్

భారత్‌లో మానవ హక్కుల పరిస్థితి

ఆందోళనకరం

- మైనారిటీల హక్కుల పరిరక్షణకు రెట్టింపు కృషి చేయాలి
- ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ పిలుపు

న్యూఢిల్లీ / జెనివా : భారతదేశంలో మానవ హక్కుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ తుర్క్ అన్నారు. సోమవారం ప్రారంభమైన ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి 54వ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మైనారిటీల హక్కుల పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం రెట్టింపు కృషి జరపాలని కోరారు. భారత్‌లో వెనుకబాటుకు గురవుతున్న మైనారిటీ కమ్యూనిటీలు హింస, వేధింపులు, వివక్షకు గురవుతున్నట్లు తమ కార్యాలయానికి సమాచారం అందుతోందని చెప్పారు. చాలా సందర్భాల్లో ఇటువంటి దాడులకు గురయ్యేది ముస్లిములేనని తెలిపారు. ఇటీవల ఉత్తర భారతంలో ముఖ్యంగా హర్యానా, గుర్‌గావ్‌ల్లో జరిగిన దాడుల గురించి ఆయన ప్రస్తావించారు. గత నెలలో హర్యానావ్యాప్తంగా చెలరేగిన హింస, ఘర్షణలు దాదాపు వారంపాటు సాగాయి. ఏడుగురు చనిపోగా, 200మందికి పైగా గాయపడ్డారు. గత నాలుగు మాసాలుగా జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో ఇతర కమ్యూనిటీలు కూడా హింసను, అభద్రతను ఎదుర్కొంటున్నాయని అన్నారు. నివేదికల ప్రకారం చూసినట్టైతే 200మందికి పైగా మరణించగా, 70వేల మందికి పైగా నిర్వాసితులయ్యారని తెలిపారు. అసహనం, విద్వేష ప్రసంగాలు, మతపరమైన మతోన్మాదం, వివక్ష వంటి పరిస్థితులను మరింత సూటిగా, స్పష్టమైన రీతిలో భారత ప్రభుత్వం ఎదుర్కొనాలని చెప్పారు. మైనారిటీలందరి హక్కుల పరిరక్షణ కోసం కృషిని రెట్టింపు చేయాలని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌లో పెనాల్టీలను పెంచేందుకు దైవ దూషణ చట్టాలను సవరించే ఆలోచనను అక్కడి ప్రభుత్వం చేస్తోందన్నారు. ఫైసలాబాద్‌లో పెద్ద సంఖ్యలో అల్లరిమూక డజన్ల సంఖ్యలో చర్చిలను ధ్వంసం చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. చైనాలోని జిన్‌జియాంగ్ ప్రావిన్స్‌లో మానవ హక్కుల పరిస్థితిపై కూడా తుర్క్ ఆందోళన వ్యక్తం చేశారు.

వాస్తవాల వక్రీకరణ !

- ఒక కమ్యూనిటీ పట్ల పక్షపాత ధోరణి
- మణిపూర్ మీడియా కథనాలపై ఆర్మీ లేఖ

● లోపలి పేజీలో.. ●

పటిష్టంగా శాంతిభద్రతలు

- ఉన్నతాధికారులకు సిఎం ఆదేశం
- లండన్ పర్యటన అనంతరం తాడేపల్లి చేరుకున్న జగన్మోహన్‌రెడ్డి
- తాజా పరిణామాలపై సమీక్ష

గన్నవరం విమానాశ్రయంలో సిఎం జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. లండన్ పర్యటన అనంతరం మంగళవారం ఉదయం ఆయన తాడేపల్లి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి తదితరులు స్వాగతం పలికారు. క్యాంపు కార్యాలయానికి చేరుకున్న అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై సిఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ చీఫ్ రామాంజనేయులు, ఎఎజి పొన్నవోలు సుధాకరరెడ్డి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులతో సిఎం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రాకూడదని తెలిపారు. అన్ని జిల్లాల అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు అరెస్టు అనంతరం రాష్ట్రంలో జరిగిన పరిణామాలను డిజిపి సిఎంకు వివరించారు. కోర్టులో జరిగిన వాదనలు, చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండుపై పొన్నవోలు సిఎంకు వివరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు సంబంధించిన ఫైల్స్ అన్నీ ఎక్కడ ఉన్నాయో పరిశీలించాలని తెలిపారు. వాదనల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, అలాగే పలు ప్రాజెక్టుల పనులు జరుగుతున్న తీరుపైనా సిఎం అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఎన్నికలు లేకుండానే సంఘాల గుర్తింపు

ఆర్టీసిలో ఏకపక్ష నిర్ణయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించకుండానే ఆర్‌టిసిలో గుర్తింపు సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రవాణా శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ జారీ చేసిన ఉత్తర్వులు ఉద్యోగుల్లో చర్చనీయాంశమయ్యాయి. ఎక్కువ మంది సభ్యత్వం ఉన్న ఎన్‌ఎంయుకు, సంస్థ ఏర్పాటైనప్పటినుండి ఉన్న ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపు హోదా ఇస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎపిఎస్ ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం కాకముందు రెగ్యులర్‌గా గుర్తింపు సంఘ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. సంస్థలో 14 కార్మిక ఉద్యోగ సంఘాలు వున్నా ప్రధానంగా ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సంఘాలు మాత్రమే ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై నిరంతరం ఆర్‌టిసి యజమాన్యంతో సంప్రదింపులు జరపుతుంటాయి. ప్రభుత్వంలో విలీనం కాకముందు 2017లో జరిగిన వెరిఫికేషన్ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్, ఎస్‌డబ్ల్యుఎఫ్‌లు కూటమిగా ఏర్పడి ఉమ్మడి అజెండాతో గుర్తింపు ఎన్నికల్లో గెలిచాయి. విలీనం తరువాత ఆర్‌టిసి యజమాన్యం వెరిఫికేషన్ ఎన్నికలను నిర్వహించలేదు. సిసిఎస్ ఎన్నికల్లో ఎన్‌ఎంయు, ఎస్‌డబ్ల్యుఎఫ్ కూటమిగా పోటీ చేసి ఎంప్లాయిస్ యూనియన్‌పై గెలుపొందాయి. ఆర్‌టిసిలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సహకారం లేకుండా ఏ ఒక్క సంఘం సొంతంగా గెలవలేని పరిస్థితి వుంది. ఈ నేపథ్యంలో ఏ సంఘంకు ఎంతమంది మద్దతు వుందో ఎన్నికల ద్వారా తేల్చకుండా ఏకపక్ష నిర్ణయాలను ఉద్యోగులు తప్పుపడుతున్నారు. మిగిలిన సంఘాలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

ఏకపక్ష తర్వులను రద్దు చేయాలి- ఎస్‌డబ్ల్యుఎఫ్

వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా ఉద్యోగ సంఘాలకు గుర్తింపు హోదా ఇవ్వడం తగదని ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని భాష, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం అయ్యపరెడ్డిలు పేర్కొన్నారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు ఆర్‌టిసిలో నియంతృత్వ ధోరణిని పెంచుతాయని తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని తక్షణం ఈ ఉత్తర్వులను రద్దు చేసి వెరిఫికేషన్ ఎన్నికలను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

బాబు భద్రతపై భయంగా ఉంది

- ములాఖత్ అనంతరం మీడియాతో భువనేశ్వరి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ములాఖత్ అనంతరం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి బయటకు వస్తున్న చంద్రబాబు కుటుంబ సభ్యులు

జైళ్లో చంద్రబాబు భద్రతపై భయంగా ఉందని ఆయన భార్య భువనేశ్వరి ఆందోళన వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో నిందితుడైన చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ములాఖత్‌లో భాగంగా భువనేశ్వరి, ఆమె కుమారుడు లోకేష్, కోడలు బ్రాహ్మణి ఆయనను మంగళవారం కలిశారు. అనంతరం జైలు నుంచి బయటకు వచ్చిన భువనేశ్వరి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన జీవితాన్ని ప్రజల కోసమే ధారబోశారన్నారు. నిత్యం ప్రజలు, రాష్ట్ర అభివృద్ధి కోసమే ఆలోచించేవారని, తనకు కుటుంబం కంటే ప్రజలే ముఖ్యమని అనేవారని చెప్పారు. జైలులో సరైన వసతులు లేవన్నారు. స్నానానికి చన్నీళ్లే ఇస్తున్నారని తెలిపారు. ఇది తమ కుటుంబానికి క్లిష్ట సమయమన్నారు. పార్టీకి, కేడర్‌కు ఎప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందని చెప్పారు. ఎపిని జాతీయ స్థాయిలో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు రాత్రింబవళ్లుతన భర్త పని చేశారన్నారు. ఇలాంటి వ్యక్తిని వైసిపి ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులో ఇరికించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాడుతున్నారనే జైలులో పెట్టారని విమర్శించారు. ప్రజలు కూడా తమ హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కోసం చంద్రబాబు చేస్తున్న పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. తాము ఏనాడూ ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయానికిగానీ, సచివాలయానికిగానీ వెళ్లలేదని, నేడు ఆయనను చూడడానికి జైలుకు రావడం అత్యంత బాధాకరమైన విషయమని అన్నారు. చంద్రబాబును చూసి బయటకు వస్తుంటే ఏదో కోల్పోయినట్లుగా ఉందని చెప్పారు. తాను బాగానే ఉన్నానని, ధైర్యంగా ఉండాలని చంద్రబాబు చెప్పారని భువనేశ్వరి తెలిపారు.

30 నిమిషాలపాటు ములాఖత్

చంద్రబాబును కలిసేందుకు కుటుంబ సభ్యులకు ములాఖత్‌ను 30 నిమిషాలు మాత్రమే జైలు అధికారులు ఇచ్చారు. మొదట్లో గంట పాటు ములాఖత్ ఉంటుందని భావించారు. చంద్రబాబు కుటుంబ సభ్యులు నారా లోకేష్, భువనేశ్వరి, బ్రాహ్మణి మంగళవారం సాయంత్రం 3.50 గంటలకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వచ్చారు. ఐదు నిమిషాలపాటు సంతకాలు, ఇతర ఫార్మాలిటీస్ పూర్తయిన తర్వాత చంద్రబాబు ఉంటున్న స్నేహ బ్లాకర్‌లోకి జైలు అధికారులు వారిని పంపారు. నాలుగు గంటలకు వారు చంద్రబాబు వద్దకు వెళ్లారు. తరువాత 4.30 గంటలకు ములాఖత్ ముగించారు. అనంతరం 4.40 గంటలకు బయటకు వచ్చారు.

నేను వస్తున్నా....!

- ఉద్యమించండి
- టిడిపి శ్రేణులకు బాలకృష్ణ పిలుపు

2

హౌస్ కస్టడీ పిటిషన్ తిరస్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి హౌస్ కస్టడీ ఇవ్వాలని ఆయన తరుపు న్యాయవాదులు ఎసిబి కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి తిరస్కరించారు. దీనిపై వాదనలు విన్న అనంతరం మంగళవారం తీర్పు ఇచ్చారు. చంద్రబాబుకు జైలులో ప్రాణహాని ఉందని, ఆయనకు హౌస్ కస్టడీ ఇవ్వాలని ఆయన తరుపున న్యాయవాదులు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున వాదించిన ఎఎజి పొన్నవోలు సుధాకరరెడ్డి అసలు చట్టంలో హౌస్ రిమాండు అనేమాట లేదని, జ్యుడీషియల్ కస్టడీ లేదా పోలీసు కస్టడీ అని మాత్రమే ఉందని, అది కూడా తెలియకుండా వాదనలు చేయడం ఏమిటని ప్రశించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి చంద్రబాబు తరుపున దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో ఆయన తరుపు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.

కేరళలో మళ్లీ నిఫా వైరస్

- ఇద్దరు మృతి : కేంద్రం
- కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం

న్యూఢిల్లీ : కేరళలో నిఫా వైరస్ కారణంగా ఇద్దరు మరణించారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంత్రి మన్సుఖ్ మండవీయా మంగళవారం వెల్లడించారు. పుణెలోని వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో శాంపిల్స్‌ను పరిశీలించగా, కోజికోడ్ జిల్లాలో ఇద్దరు మృతుల్లో ప్రాణాంతక వైరస్ ఉన్నట్లు వెల్లడయిందని తెలిపారు. కేరళలో నిఫా వైరస్ వ్యాప్తి పరిస్థితిని సమీక్షించేందుకు, రాష్ట్ర ప్రభుత్వానికి సహాయం చేసేందుకు నిపుణుల బృందాన్ని పంపుతున్నట్లు చెప్పారు. నిఫా వైరస్ అనుమానంతో నలుగురి నమూనాలను పుణేలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపినట్లు తెలిపారు.

రెండు నిఫా మరణాల నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటోందని, కోజికోడ్‌లో ఆరోగ్యశాఖ అప్రమత్తమైందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. మంగళవారం ఉదయం కోజికోడ్ జిల్లా చేరుకున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించి, పరిస్థితిని సమీక్షించారు. వైరస్‌ను సమర్థవంతంగా అడ్డుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. మొదటిగా మరణించిన వ్యక్తికి చెందిన నలుగురు బంధువులు ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్నట్లు చెప్పారు. వారిలో ఒక చిన్నారి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. సోమవారమే మొదటి అనుమానిత మరణం వార్త రావడంతో ఈ వైరస్‌ను ట్రేస్ చేయడానికి, కాంటాక్ట్‌లు గుర్తించడానికి, నమూనాలను పరిశీలించడానికి 16 కోర్ కమిటీలను రాష్ట్ర ఆరోగ్య శాఖ నియమించినట్లు చెప్పారు. కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించామన్నారు. ప్రస్తుతానికి ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని, వైరస్ వ్యాప్తి చెందకుండా మాస్కులు ధరించాలని కోరారు. నాలుగు అనుమానిత నమూనాల పరీక్ష ఫలితాలు రావాల్సి ఉందని మంత్రి తెలిపారు. నిఫా వైరస్ వార్తలతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో రాష్ట్ర మంత్రి పిఎ మహమ్మద్ రియాజ్ కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆగస్టు 30న మొదటి అనుమానిత మరణంతోనే జిల్లాలోని మారుతోంకర పంచాయతీ పరిస్థితిని రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. 90 ఇళ్లను ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించారు. సమీప పంచాయతీల్లో ఇటీవల మరణాలకు గల కారణాలను కూడా పరిశీలిస్తున్నారు. ఐదేళ్ల తరువాత కేరళలో మళ్లీ నిఫా వైరస్ కలకలం రేపుతోంది. 2018లో ఈ వైరస్‌తో పెరంబ్రా సమీపంలోని జానకిక్కడ్ ప్రాంతంలో ఐదుగురు మరణించారు.

అభివాదం చేస్తున్న వక్తలు

సామాజిక న్యాయం కోసం

26న మహాధర్నా

- జయప్రదం చేయండి
- కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాజిక న్యాయ సాధన కోసం ఈ నెల 26న విజయవాడలో మహాధర్నాను నిర్వహించాలని ఎపి వ్యవసాయకార్మిక సంఘం, కెవిపిఎస్‌ల రాష్ట్ర సదస్సు నిర్ణయించింది. ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. రాష్ట్రంలో దళితులు, గిరిజనుల హక్కుల సాధనే లక్ష్యంగా ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపింది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం జరిగిన ఈ సదస్సుకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షత వహించారు. దేశంలో దళితులు, అణగారిన వర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయని సదస్సులో ప్రసంగించిన వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి దారుణంగా హత్యచేసినా ప్రధాని నరేంద్రమోడి పట్టించుకోక పోవడం తగదని అన్నారు. బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చాక ఎస్‌సి, ఎస్‌టిలకు వున్న సబ్‌ప్లాన్ చట్టాన్ని ఎత్తివేసిందని చెప్పారు. రిజర్వేషన్‌లను ఎత్తివేసేందుకు కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో కూడా దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. దళితులకు చెందిన

మిగతా 2లో

సొంత బ్యాంకుకే టోకరా

- ఐసిఐసిఐ బ్యాంకు బ్రాంచి డిప్యూటీ మేనేజర్ చేతివాటం
- రూ.8 కోట్ల నగదు స్వాహా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తాను పనిచేస్తున్న బ్యాంకునే బురిడీ కొట్టించి కోట్ల రూపాయలను కొల్లగొట్టిన ఘనుడి ఉదంతం ఇది. పోలీసుల కథనం ప్రకారం... వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఐసిఐసిఐ బ్యాంకు బ్రాంచి డిప్యూటీ మేనేజర్‌గా బైరిశెట్టి కార్తీక్... 128 మంది ఖాతాదారులు బంగారు రుణాలు పొందినట్లు రికార్డులు సృష్టించి రూ.8,65,78,000 కొట్టేశారు. ఆడిటింగ్ సమయంలో మోసాన్ని గుర్తించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా అతన్ని జడ్జి రిమాండ్‌కు పంపారు. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులూ లేవని పోలీసులు తెలిపారు. సొమ్మును క్రికెట్ బెట్టింగ్‌లో కార్తీక్ పోగొట్టుకున్నట్లు చెప్పారు.

తాతిరెడ్డిపల్లిలో ఆరు ఎకరాల్లో ఎండిపోయిన పత్తి మొక్కలు

బేల్దారి పనులకు వెళ్తున్నాను

నేను మూడు ఎకరాల్లో నూగు వేశాను. వర్షాలు లేక ఎండిపోయింది. దీనిపై మండల అధికారులకు, సచివాలయ వ్యవసాయాధికారికి అనేకసార్లు విన్నవించాను. కనీసం వచ్చి పంటను చూడలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి. పంటలేక బేల్దారి పనులకు వెళ్తున్నాను.

-శ్రీహరి, తాతిరెడ్డిపల్లి

9 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి

నేను ఆరు ఎకరాల్లో పొగాకు, మూడు ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. వర్షాలు లేకపోవడంతో మొత్తం తొమ్మిది ఎకరాల్లోని పంటలు కళ్ల ముందే ఎండిపోయాయి. రూ.6 లక్షలు నష్టం వాటిల్లింది. ఎండిపోయిన మొక్కజొన్న తోటలోకి పశువులకు మేతకు వదిలాను.

-మోహన్, తాతిరెడ్డిపల్లి

రైతన్న కన్నీళ్లు!

వర్షాల్లేక మెట్ట ప్రాంతాల్లో ఎండుతున్న పంటలు

అడుగంటిన భూగర్భ జలాలు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా రైతులు చినుకు కోసం కన్నీళ్లతో కళ్లుకాయలు కాసేలా ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. కళ్ల ఎదుటే పంటలు ఎండిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలో 38 మండలాల్లో అతితక్కువ వర్షపాతం నమోదైంది. 20 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మూడు మండలాల్లో అతి తక్కువ నమోదైంది. జూన్‌లో వర్షాలు పడాల్సి ఉంది. మెట్ట ప్రాంతాల్లో చినుకు జాడ లేకపోవడంతో నిమ్మ, పత్తి, పొగాకు, మొక్కజొన్న, మినుము పంటలు ఎండిపోతున్నాయి. వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. గ్రామ సచివాలయాలకు వెళ్లి సమస్యలు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రజాశక్తి' క్షేత్ర స్థాయి పరిశీలనలో పలు విషయాలు బయటకొచ్చాయి. జిల్లాలోని వింజమూరు, వరికుంటపాడు, వలేటివారిపాళెం, ఆత్మకూరు, ఎఎస్‌పేట, మర్రిపాడు ప్రాంతాల్లో నిమ్మ, పత్తి, మొక్కజొన్న, పొగాకు పంటలు నిలువునా ఎండిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎఎస్‌పేట మండలం తాతిరెడ్డిపల్లి, జువ్వలగుంటపల్లి, హసనాపురం, వింజమూరు మండలం చంద్రపడియాతోపాటు అనేక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. వాటిని రక్షించుకొనే అవకాశం లేక దిక్కుతోచని

మిగతా 2లో

'ఒకే డోర్ నెంబరు ఓట్లు' 24.6 లక్షల పైనే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒకే డోర్ నెంబరుతో 10 మించి ఓట్లు ఉన్నవి, అలాగే ఇంటి నెంబరు లేకుండా ఉన్న ఓట్లు రాష్ట్రంలో మొత్తం 27 లక్షలకు పైగా ఉన్నట్లు ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ) కార్యాలయం తెలిపింది. ఈ మేరకు వివరాలు కోరుతూ నరసాపురం ఎంపి రఘురామకృష్ణమ రాజు రాసిన లేఖకు సిఇఒ ప్రత్యుత్తరం పంపింది. 'జీరో హౌస్, ఒకే డోర్ నెంబర్‌లో 10 ఓట్లు' మించినవి 27,13,443 ఓట్లు నమోదైనట్లు గుర్తించినట్లు పేర్కొంది. ఇంటి నెంబరు పేర్కొననవి 2,51,767 ఓట్లు ఉన్నాయని తెలిపింది. ఒకే డోర్ నెంబర్‌తో 10 ఓట్లకు పైగా ఉన్న ఇళ్లు 1,57,939 ఉన్నట్లు పేర్కొంది. ఈ ఇంటి నెంబర్లతో 24,61,676 ఓట్లు ఉన్నట్లు తేలిందన్నారు. దొంగ ఓట్ల ఏరివేతకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆ లేఖలో బదులిచ్చారు.

మున్సిపల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు, క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు మంగళవారం పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మికి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె ఉమామమేశ్వరరావు, నాయకులు వెంగమ్మ, పూర్ణచంద్రరావు, శివనాగేశ్వరరావు లేఖ రాశారు. సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

చంద్రబాబు అరెస్టు అక్రమం

- జాతీయ నాయకులు మద్దతు
- లోకేష్‌కు పలువురు ఫోన్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టును జాతీయ స్థాయిలో పలువురు నాయకులు ఖండించారు. పరిపాలనకు సంబంధించిన అంశాల్లో ఒక నాయకుడిని అరెస్టు చేసి జైల్లో పెట్టడం మంచి సంప్రదాయం కాదని తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్‌యాదవ్ ఈ మేరకు ట్వీట్ చేశారు. కేంద్రంలో బిజెపి కూడా ఇదే పని చేస్తోందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న నాయకులను గతంలో చేసిన తీర్మానాల ఆధారంగా అరెస్టు చేసుకుంటూ పోతే దేశంలో 90 శాతం మంది జైల్లోనే ఉండాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడుతో ఆయన మాట్లాడారు. త్వరలోనే చంద్రబాబు కుటుంబసభ్యులతో మాట్లాడతానని తెలిపారు. శిరోమణి అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ కూడా చంద్రబాబు అరెస్టును ఖండించారు. ఆయన్ను జైల్లో చూడాల్సి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బూటకపు అభియోగాలతో ఆయన్ను అరెస్టు చేశారని, ప్రజాస్వామ్యంలో కక్షసాధింపు మంచిది కాదని పేర్కొన్నారు. ఆధునిక ఆంధ్రప్రదేశ్ రూపశిల్పి ఆయనని, అరెస్టును అందరూ ఖండించాలని కోరారు. కర్నాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి కూడా స్పందించారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేశారని పేర్కొన్నారు. నారా లోకేష్‌కు ఫోన్‌చేసి మాట్లాడారు. న్యాయం జరుగుతుందని ధైర్యం చెప్పారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా చంద్రబాబు అరెస్టును ఖండించిన సంగతి తెలిసిందే.

ప్రజాస్వామ్య పరిరక్షణకు బలమైన ఉద్యమం

- సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు పతనమవుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు బలమైన ప్రజా ఉద్యమం రావాల్సిన అవసరం ఉందని అందుకు ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి ఉద్యమంలో భాగస్వాములు కావాలని వక్తలు కోరారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతల పట్ల, ప్రజాఉద్యమాల ప్రభుత్వ తీరును నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన విజయవాడలోని దాసరి భవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబును లొంగదీసుకునేందుకు బిజెపి ఎత్తుగడ వేసిందని అన్నారు. తన దారికి తెచ్చుకోవడం కోసం కేంద్రం ఈ వ్యవహారాన్ని నడిపించిందన్నారు. వైసిపి నేతలతో ముడిపడివున్న కేసులు పట్టించుకోకుండా గతంలో ఉన్న కేసును మోడీ, అమిత్‌షా బయటకు తీసి ఇప్పుడు జగన్‌కు మద్దతు ఇచ్చారని తెలిపారు. తెలంగాణలో కవిత, బెంగాల్‌లో మమత ఇలా వివిధ రాష్ట్రాల్లో నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. మోడీ, జగన్ మేధావులను, జర్నలిస్టులను తొక్కేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ ద్వారానే సామాన్యుడికి రక్షణ : శ్రీనివాసరావు

రాజ్యాంగం పరిరక్షణ ద్వారానే సామాన్యుడికి రక్షణ లభిస్తుందన్నారు. జగన్‌కు ధైర్యం మోడీయేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శించారు. మోడీ ఇచ్చిన ధైర్యంతోనే రాష్ట్రంలో జగన్ అరాచక పాలన చేస్తున్నాడని తెలిపారు.

నిరంకుశత్వం ఢిల్లీలో ప్రారంభమైయిందన్నారు. ఒక్కొక్క రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేసుకుంటూ వస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడం ఎవరి తరమూ కాదని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు చేపట్టాలని ఈ సభకు అధ్యక్షత వహించిన రామకృష్ణ తీర్మానం ప్రవేశపెట్టారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య మాట్లాడుతూ సీమెన్స్ అనే ఒక అంతర్జాతీయ కంపెనీ యువతకు నైపుణ్యాభివృద్ధి టెక్నాలజీ ఇచ్చిన స్కీమ్‌లో అవినీతి జరిగిందని ఆధారాలు లేకుండా ఆనాటి ముఖ్యమంత్రిని అరెస్టు చేసిజైలుకు పంపితే రానున్న రోజుల్లో విదేశీ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడతాయా అని సందేహం వ్యక్తం చేశారు. లోకసత్తా నాయకులు భానుప్రసాదు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొరివి వినయ్‌కుమార్, ప్రొఫెషనల్ ఫోరం రాష్ట్ర నాయకులు నేతి ఉమామహేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మారెడ్డి మాట్లాడారు. మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, షబ్లీ, పువ్వాడ సుధాకర్, కొండలరావు, రావుల సుబ్రహ్మణ్యం, అక్కినేని వనజ, పెన్మెత్స దుర్గాభవాని, కనకం శ్రీనివాసరావు, ముప్పాళ్ల నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసకు ప్రధాని బాధ్యత వహించాలి

- రాజకీయ లబ్ధి కోసమే యుసిసి ప్రతిపాదన
- సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు..

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మణిపూర్ హింసకాండలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రధాన దోషి అని, మూడు నెలలపాటు హింస చెలరేగినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు విమర్శించారు. 'మణిపూర్ హింసకాండ – ఏకరూప పౌరస్మృతి' అనే అంశంపై విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కాలేజీలో మంగళవారం సదస్సు జరిగింది. జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో లక్ష్మణరావు మాట్లాడుతూ మణిపూర్ హింసాకాండలో కేంద్ర ప్రభుత్వం దోషిగా మిగిలిపోయిందన్నారు. కుకీలు, మెయితీల మధ్య ఘర్షణ పెరిగేలా చేసి బిజెపి ప్రభుత్వం లబ్ధిపొందడానికి ప్రయత్నించిందని విమర్శించారు. దానివల్ల దాదాపు 300 మంది కుకీలు చనిపోయారని తెలిపారు. వేలాది మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఏర్పాటు చేయాలని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. యుసిసి ఇప్పటికిప్పుడే సాధ్యం కాదని 21వ లా కమిషన్ చెప్పిందని, కేవలం రాబోయో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చిందన్నారు. కేంద్రం ప్రభుత్వం ఒకే దేశం, ఒకే భాషా, ఒకే మతం పేరుతో హిందూ, ముస్లిముల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోందని విమర్శించారు. సిఎఎ, యుసిసి వంటివి తెరపైకి తీసుకొచ్చి ప్రజల మధ్య అనైక్యత సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. చరిత్రను వక్రీకరించి పాఠ్యంశాల్లో ఆర్ఎస్ఎస్ భావజాలన్నీ చొప్పించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు.

బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక నాయకులు రామరాజు, భగత్‌సింగ్ గ్రంథాలయం చైర్మన్, ప్రముఖ న్యాయవాది బి.శంకరయ్య, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, ప్రసాద్, నాయకులు గోపాల్ పాల్గొన్నారు. అనంతరం విజ్ఞాన కేంద్రానికి నంది విజ్ఞాన కేంద్రంగా నామకరణం చేశారు. పోస్టర్‌ను విడుదల చేశారు.

ప్రభుత్వ మెడికల్ సీట్లను అమ్మడం తగదు

- జీఓ నెంబర్ 107, 108లను రద్దు చేయాలి
- ముఖ్యమంత్రికి ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో సెల్ఫ్ ఫైనాన్స్ కింద 50 శాతం సీట్లను కేటాయించడం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమేనని ప్రజారోగ్య వేదిక పేర్కొంది. ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీలకు వున్న రిజర్వేషన్‌ల ప్రక్రియకు విఘాతం కలిగేలా వున్న 107, 108 జీఓలను రద్దు చేయాలని కోరింది. ఈ మేరకు ప్రజారోగ్య వేధిక రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం పంపారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఈ ఏడాది ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను స్థాపించడం అభినందనీయమని అన్నారు. అయితే ఈ మెడికల్ కాలేజీలలో 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్‌గా కేటాయిస్తూ జీఓలు 107, 108 ఇవ్వడంతో రాష్ట్రంలో తీవ్రమైన ఆందోళనలు రేకెత్తాయని పేర్కొన్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన ఈ మెడికల్ సీట్లను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం తగదని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన, పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇది చాలా నష్టం చేకూరుస్తుందని తెలిపారు. ఈ మెడికల్ కాలేజీలను ఈ నెల 14న ప్రారంభిస్తున్న నేపథ్యంలో పేదలకు, అణగారిన తరగతులకు నష్టం చేకూర్చే జీఓలను రద్దు చేయాలని వారు కోరారు.

రిమాండ్ అన్యాయం

- హైకోర్టులో చంద్రబాబు
- నేడు విచారణ

ప్రజాశక్తి - అమరావతి

ఏపీ సిల్క్ డెవలప్‌మెంట్ సంస్థ(ఏపీఎస్ఎస్డీసీ) నిధుల దుర్వినియోగం కేసులో ఎసిబి కోర్టు విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసర పిటిషన్‌గా విచారణ చేపట్టాలని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. దీంతో బుధవారం విచారణ నిర్వహిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు. ప్రతివాదులైన సిఐడి ఇతరులకు నోటీసులు జారీ చేశారు. పిటిషన్‌లో

రాజకీయ కక్షతో తనపై తప్పుడు కేసు బనాయించారని పేర్కొన్నారు. 'అవినీతి నిరోధక చట్టం (సవరణ)లోని సెక్షన్ 17ఏ ప్రకారం పిటిషనర్ చంద్రబాబు పబ్లిక్ సర్వెంట్ కాబట్టి కేసు నమోదు చేయాలంటే గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. కేసు నమోదు, విచారణకు గవర్నర్ అనుమతి తప్పనిసరి. ఆ విధంగా సిఐడి చేయలేదు. నిజానికి ఈ కేసు ఎంపి, ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక కోర్టు పరిధిలోకి వస్తుంది.' అని పేర్కొన్నారు. '2021 డిసెంబర్ 09న నమోదు చేసిన ఈకేసులో 22నెలలు గడిచాక తీరుబడిగా కావాలనే అరెస్టు చేసింది. కేసులో కావాలని ఇరికించింది. రాజకీయ ప్రతీకారంతో కేసులోకి ఇరికించారు. సిఎం ప్రోద్భలంతోనే కేసు పెట్టారు. గతంలో తీవ్రవాదుల దాడి నుంచి బయటపడ్డాను. ప్రాణాలకు హాని ఉందనే కేంద్రం జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చింది. రాజకీయ ప్రత్యర్థులు కూడా అంతమొందించేందుకు కుట్ర చేస్తూనే ఉన్నారు.

ఈ పరిస్థితుల్లో సెక్యూరిటీ లేకుండా జైల్లో ఉంచకూడదు. సెక్యూరిటీకి దూరం చేస్తే ప్రత్యర్థులను టార్గెట్ చేయవచ్చునని అధికారపార్టీ చీఫ్‌కు ఉన్నట్లుగా అనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో రాజమండ్రి సెంట్రల్ జైల్లో కాకుండా హౌస్ అరెస్ట్‌కు అనుమతి ఇవ్వాలన్న వినతిని కూడా ఎసిబి కోర్టు తిరస్కరించడం అన్యాయం. అరెస్టు కూడా ఏకపక్షంగా చట్ట వ్యతిరేకంగా జరిగింది.' అని పిటిషన్‌లో తెలిపారు. 'అనేక విషయాలను కింది కోర్టు విస్మరించింది. ఏసీబీ యాక్ట్‌లోని 13(1)(సి)(డి) ప్రకారం నేరపూరిత దుష్ప్రవర్తను పాల్పడినట్లుగా ఆధారాలు సిఐడి చూపలేదు. సెక్షన్ 17 ప్రకారం గవర్నర్ నుంచి అనుమతి పొందిన తర్వాతే కేసు నమోదు/విచారణ చేయాలన్న నిబంధన ఉల్లంఘన జరిగింది. ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని 2021లో సుప్రీంకోర్టు తీర్పు కూడా చెప్పింది. ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ చేయాల్సిన కేసును ఎసిబి కోర్టు విచారణ చేసేందుకు వీల్లేదు. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, దాని ఆధారంగా ఎసిబి కోర్టు రిమాండ్ విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేయండి. హైకోర్టులో పిటిషన్‌పై విచారణ ముగిసే వరకు ఏసీబీ కోర్టు విచారణను నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వండి' అని చంద్రబాబు పిటిషన్‌లో కోరారు.

'బాబుతో నేను'

- నేటి నుంచి నిరసన దీక్షలు

చంద్రబాబు జైల్లో ఉన్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ 'బాబుతో నేను' అనే పేరుతో లోగోను ఆవిష్కరించింది. బుధవారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల, జిల్లాస్థాయిల్లో రిలే దీక్షలు చేపట్టాలని తెలుగుదేశం పిలుపునిచ్చింది.

నేను వస్తున్నా....!

- ఉద్యమించండి
- టిడిపి శ్రేణులకు బాలకృష్ణ పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'ఇది కేసులను లెక్కచేసే సమయం కాదు. భయపడే ప్రసక్తే లేదు. నేను వస్తున్నా...! ప్రతి ఒక్కరూ ఉద్యమించండి. తెలుగువాడి సత్తా చూపుదాం.' అనిప్రముఖ సినీ నటుడు, హిందుపురం ఎంఎల్‌ఎ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణ తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి 16 నెలలు జైలులో ఉండివచ్చారని, చంద్రబాబును కనీసం 16 రోజులైనా జైలులో పెట్టాలని కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే రాజకీయకక్షలో భాగంగా చంద్రబాబును అరెస్ట్ చేశారన్నారు. ఎన్నికల్లో పరాజయం తప్పదన్న భయంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. జగన్‌కు ఉన్న అవినీతి మచ్చను అందరికీ అంటించాలని చూస్తున్నారని, అయినాచంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. సిఎం కేవలం పాలసీ మేకర్ మాత్రమేనని , అధికారులే అమలు చేస్తారన్నారు. సీనియర్ ఐఎఎస్ అధికారి అజయ్‌కల్లామ్ ప్రతిపాదిస్తే, మరో అధికారి ప్రేమ్‌చంద్రారెడ్డి అమలు చేశారని వివరించారు. ప్రభుత్వం రూ.370కోట్లు ఖర్చు చేసి రూ.2.13లక్షల మందికి శిక్షణ ఇచ్చిందన్నారు. డిజైన్ టెక్ సంస్థకు జగన్ ప్రభుత్వం అభినందన లేఖ కూడా ఇచ్చిందని బాలకృష్ణ తెలిపారు.

చంద్రబాబును అరెస్టు చేసిన తీరు ఏమాత్రం బాగోలేదు

- బి.వి రాఘవులు

ప్రజాశక్తి-హైదరాబాద్

ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడును అరెస్టు చేసిన తీరు ఏమాత్రం బాగోలేదని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి వి రాఘవులు అన్నారు. సాయుధపోరాట వారోత్సవ సభలో పాల్గొనేందుకు సోమవారం సంగారెడ్డి వెళ్లిన ఆయనను చంద్రబాబు అరెస్టుపై వ్యాఖ్యానించమని ఓ టీవి చానెల్‌వారు అడగ్గా పై విధంగా స్పందించారు. ' సరైన సాక్ష్యాధారాలు దొరికతే చంద్రబాబునైనా, సిఎం జగన్మోహన్‌రెడ్డినైనా ఎవరినైనా సరే తప్పకుండా అరెస్టు చేయాల్సిందే. అయితే, చంద్రబాబుని అరెస్టు చేసిన తీరు ఏమాత్రం బాగోలేదు. అర్ధరాత్రి వేలాదిమంది పోలీసులను మోహరించి, ఎఫ్ఐఆర్‌లో పేరు కూడా లేకుండా అరెస్టు చేయాల్సిన అఘాయిత్యం ఏమొచ్చింది. తీరుబడిగా ఎఫ్ఐఆర్‌లో పేరు రాసుకుని సాక్ష్యాధారాలతో సహ ప్రజల ముందుంచి ఆయన్ని అరెస్టు చేయవచ్చు. కానీ అటువంటి పద్ధతులేవీ పాటించకుండా అర్ధరాత్రి, కానీ అటువంటి పద్ధతిలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఏమీ వ్యవహరించలేదు. దీని వెనుక కక్షపూరిత ధోరణి కనబడుతోంది తప్ప నిజాయితీగా విచారణ జరుపుదామనే ధోరణి కనబడడం లేదు. ఈ కేసు ఐదు సంవత్సరాల నుంచి నడుస్తూనే ఉంది. ఈరోజు అకస్మాత్తుగా ఎన్నికలకు ముందు ఇలాంటి చర్యలకు పాల్పడడం నిజాయితీని నిరూపించాలనేదాని కన్నా... రాజకీయంగా లబ్ధిపొందాలనే తపనే దీని వెనుక ఉన్నట్టుగా కనిపిస్తుంది.' అని ఆయన అన్నారు.

అందుకే బంద్‌కు స్పందన కరువు

- మంత్రులు కారుమూరి, మేరుగ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబునాయుడి రాజకీయ జీవితం అంతా అవినీతిమయమైనందునే ఆ పార్టీ ఇచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్ పిలుపునకు ప్రజా స్పందన కరువైందని రాష్ట్ర మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున వ్యాఖ్యానించారు. మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. టిడిపి బంద్‌కు పిలుపిస్తే హెరిటేజ్ కూడా మూయలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబును ప్రధాని నరేంద్రమోడీ కూడా అవినీతి పరుడుగానే పేర్కొన్నారని తెలిపారు. ఎన్‌టిఆర్ కుటుంబం అవినీతిపరుడైన చంద్రబాబు వెంట వుండటం సరైంది కాదన్నారు. అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయిన చంద్రబాబును ఎవరూ రక్షించలేరని వారు పేర్కొన్నారు. ఆయన ఇన్నాళ్లూ వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారని ఇకపై కుదరదని తెలిపారు.

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

'ఉక్కు' అమ్మకాన్ని తిప్పికొడతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి కేంద్రం చేస్తోన్న కుట్రలను పోరాటాలతో తిప్పికొడతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 943వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌బిఎం విభాగాల కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ పరిశ్రమలను తన తాబేదార్లుకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. ఉక్కు ప్రయివేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలు, ప్రజలు వ్యతిరేకిస్తున్నా పరిగణనలోకి తీసుకోకుండా ఆస్తుల మదింపునకు కేంద్రం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఈ ప్రక్రియ ముందుకు సాగకుండా అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని కోరారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు పిట్టారెడ్డి, డి.దేముడు, జి.ఆనంద్, జివి.రమణారావు, డి.రమేష్, ఎంకెవి.రాజేశ్వరరావు, వర్మ, మోహన్ కుమార్, వి.కృష్ణంనాయుడు, బి.హరీష్, కె.ఆనందరావు, జి.రమేష్, జి.అమ్మోరు, వై.ప్రకాష్, కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయంకోసం 26న మహాధర్నా

(మొదటి పేజీ తరువాయి)

భూములకు రక్షణగా వున్న అసైన్డ్ చట్టాలను సవరించి దళితుల చేతుల్లో భూములు లాక్కునేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. అలాగే ఎస్‌సి,ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. దళితులు, గిరిజనులపై దాడుల కేసులను విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జస్టిస్ పున్నయ్య కమీషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి. ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా కాకుండా దళితులు, గిరిజనుల కోసం పనిచేసే సంఘాలన్నింటికి ప్రాతినిథ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్మశాన స్థలాల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. రాయలసీమ జిల్లాలో శ్మశానాల్లో పని చేస్తున్న కార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులకు ఇస్తున్న విద్యుత్ రాయితీని 200 యూనిట్ల నుంచి 300 యూనిట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులు ఎదుర్కొంటున్న ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చర్చా వేదికలు, పాదయాత్రలు, సైకిల్, బైక్, జీపు జాతాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు , కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి డిబియఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, పియంసి రాష్ట్ర కో ఆర్డినేటర్ సత్యబోసు, సమతా సైనిక దళ్ రాష్ట్ర మహిళ అధ్యక్షులు బుడమూరి శ్వేత , రైల్వే ఎస్‌సిఎస్‌టి ఉద్యోగులు సంఘం కార్యదర్శి జి పాపారావు, ఆర్‌టిసి ఎస్‌సిఎస్‌టి ఉద్యోగులు రాష్ట్ర అధ్యక్షులు ఎవి రాజు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్న కుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ. డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రామన్న తదితరులు మాట్లాడారు.

వడ్డీ పేరుతో రూ.1500 కోట్ల భారం

- నిబంధనలన సవరణకు ఎపిఇఆర్‌సికి డిస్కమ్‌ల ప్రతిపాదనలు
- సిపిఎం తరుపున బాబూరావు అభ్యంతరాల సమర్పణ
- నేడు విచారణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వడ్డీ పేరుతో మరో రూ.1500 కోట్లు రాష్ట్ర ప్రజలపై భారం మోపేందుకు విద్యుత్‌శాఖ సిద్ధమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్ నియంత్రణ మండలికి సిపిఎం తరుపున అభ్యంతరాలతో కూడిన లేఖ సమర్పించారు. దీన్ని మీడియాకు విడుదల చేశారు. ప్రభుత్వ తప్పులకు ప్రజలను బాధ్యులను చేసి భారం మోపడం తగదని పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలను తిరస్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ ఎపిఇఆర్‌సి క్లాజ్ 11, 15(4)లో సవరణలు చేయాలని కోరుతూ నియంత్రణ మండలిని కోరిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు సకాలంలో చెల్లించకపోవడం, ప్రభుత్వ సంస్థలు కార్యాలయాలు, విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడం, వివిధ ప్రైవేటు బడా సంస్థలు, వ్యక్తులు బిల్లులు చెల్లించక పోవడంతో పంపిణీ సంస్థలకు నష్టం వస్తోందని, దీన్ని వినియోగదారుల నుండి వసూలు చేయడానికి వీలుగా నిబంధనల్లో సవరణలు చేయాలని కోరారని పేర్కొన్నారు. దీనిపై బుధవారం హైదరాబాద్‌లో విచారణ జరగనుందని వివరించారు.

2022-23 సంవత్సరంలో తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ 625 కోట్లను వడ్డీ కోసం ఖర్చు పెట్టిందని, మూడు పంపిణీ సంస్థలు కలిపి రూ.1500 కోట్లు ఖరు ్చ చేస్తున్నట్లు అంచనాలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఈ అప్పుడు, వడ్డీలు పెరుగుతాయని తెలిపారు. ఈ అప్పులతో, వడ్డీలతో ప్రజలకు సంబంధం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల నుండి విద్యుత్ ఛార్జీల పెంపు, స్లాబులు మార్చి భారాలు మోపడం, విద్యుత్ సుంకం పెంచడం, ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలు మోపుతున్నారని తెలిపారు. అదనపు వసూళ్ల ద్వారా ప్రజలపై వేలకోట్ల రూపాయల భారం వేస్తున్నారని విమర్శించారు. బిల్లులు చెల్లించలేక ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, పరిశ్రమలు మూతపడుతున్నాయని,

ఉపాధి దెబ్బతింటోందని తెలిపారు. ప్రతినెలా జమా ఖర్చులపై విచారణ లేకుండానే యూనిట్‌కు అదనంగా రూ.0.40 పైసలు చొప్పున సర్దుబాటు చార్జీలు వసూలు చేయడం దారుణమని పేర్కొన్నారు. వ్యవసాయం, ఇతర కేటగిరీలకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం సబ్సిడీని చెల్లించాలని, కానీ చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభ్తువం అనుసరిస్తున్నవన్నీ తప్పుడు విధానాలేనని పేర్కొన్నారు. వినియోగదారుల నుండి కనెక్షన్లు తీసుకున్నప్పుడే మూడు నెలల డిపాజిట్లు వసూలు చేస్తున్నారని, బిల్లులు పెంచి, బిల్లులు పెరిగాయనే సాకుతో అదనపు డిపాజిట్లు ఎప్పటికప్పుడు బలవంతంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. అదనపు లోడ్ పేరుతో సెక్యూరిటీ డిపాజిట్లు గుంజుతున్నారని పేర్కొన్నారు. 15 రోజుల్లో బిల్లు చెల్లించకపోతే డిలే పేమెంట్ సర్‌ఛార్జి కూడా వసూలు చేస్తున్నారని వివరించారు. సాధారణ వినియోగదారులు నెలరోజుల్లో విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే వారి కనెక్షన్లు తొలగించి తిరిగి రీ కనెక్షన్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని లేఖలో ప్రస్తావించారు. ఆలస్యమైన బిల్లుకు వడ్డీ కూడా కట్టించుకుంటున్నారని, ఇలా వినియోగదారుల నుండి వసూలు చేసిన కోట్లాది రూపాయలు పంపిణీ సంస్థల వద్ద ఉంటున్నదని వివరించారు. విద్యుత్ నియంత్రణ మండలి ప్రభుత్వం నుండి బకాయిలు వసూలు చేయడానికి ఆదేశాలు ఇవ్వాలని, ఆలస్యం అయితే వడ్డీ కూడా ప్రభుత్వ నుండి వసూలు చేయాలని తెలిపారు. వినియోగదారులపై వడ్డీ భారం వేసే ప్రతిపాదనలను తిరస్కరించాలని కోరారు. పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. బహిరంగ విచారణ హైదరాబాద్‌లో కాకుండా అమరావతిలో జరపాలని కోరారు. అన్ని ప్రాంతాల వారు పాల్గొనేందుకు వీలుగా ఆన్‌లైన్లో జరపాలని కోరారు. ఈ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా సిపిఎం ప్రజలను చైతన్య పరుస్తుందని, ఉద్యమాలు చేపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే విధిస్తున్న సర్దుబాటు చార్జీల భారాలను రద్దు చేయాలని కోరారు. స్మార్ట్ మీటర్ల పేరుతో వేలాది కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతూ బడా కంపెనీలకు మేల చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను తిప్పి కొట్టాలని కోరారు.

రైతన్న కన్నీళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

స్థితిలో రైతులు ఉన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల ఆకలైనా తీరుతుందనే ఉద్దేశంతో కొందరు రైతులు ఎండిన పంట పొలాల్లో వాటిని మేతకు వదులుతున్నారు. ఆత్మకూరు మండలం పమిడిపాడు గ్రామంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నిమ్మకు నీరందకపోవడంతో చెట్లు ఎండిపోయాయి. రైతులు వాటిని అలాగే వదిలేయాల్సి వచ్చింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 1,080 మిల్లీమీటర్లు. జిల్లాలోని 13 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. వరికుంటపాడులో మైనస్ 78.8 శాతం, వింజమూరులో మైనస్ 68 శాతం, వలేటివారిపాళెంలో మైనస్ 66.9 శాతం వర్షపాతం నమోదైనట్లు అధికారుల రికార్డులు తెలియజేస్తున్నాయి. కేవలం కందుకూరు, ఉలవపాడుల్లో మాత్రమే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సాధారణంగా అక్టోబర్, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు కురుస్తాయి. జూన్‌లో వర్షాలు కురిస్తే తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగిపోతుంది. సోమశిల, కండలేరు, ప్రాజెక్టుల పరిధిలో కాలువల పారుదల ఉండడంతో ఆయా ప్రాంతాల్లో మాత్రమే భూగర్భ జలాలు కనిపిస్తున్నాయి. మిగిలిన చోట్ల భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోతున్నాయి. వేలాది రూపాయలు ఖర్చు చేసి వేసిన బోర్లు 150 అడుగులకు నీటిమట్టం పడిపోయింది. జిల్లాలోని ఆత్మకూరు, వింజమూరు, ఎఎస్‌పేట, కనిగిరి, దుత్తలూరు, సీతారామపురం, వలేటివారిపాళెం మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. వర్షాలు కురువకపోతే కరువు పరిస్థితులు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దళిత కుటుంబానికి రెండెకరాల భూమి : కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి రెండెకరాల సాగుభూమితో పాటు మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో కళాకారులు, చర్మకారులకు 45 ఏళ్లకే ఐదువేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేసి రుణ పరిమితిని ఐదు లక్షలకు పెంచాలన్నారు. భూస్వాముల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల తీసుకోని పేదలకు పంచాలన్నారు. అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలన్నారు. రాయలసీమ జిల్లాలో స్మశానాల్లో పని చేస్తున్న కార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్ తిరిగి ప్రారంభించాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అమలు చేయాలని, దళిత, గిరిజనలకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కాటికారులు , స్కావెంజర్స్ సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఒత్తిడి లేకుండా చూడండి

- సిఇఓకు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల కా విధులకు సంబంధించి ఉద్యోగులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయం ఐదో బ్లాక్‌లోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనాను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎలక్టోరల్ రోల్ రివిజన్ జరిగే సమయంలోనే రీ స ర్వే విషయంపై ఎస్‌ఓపి ప్రకారం సమయం ఇవ్వడకుండా రీ సర్వే పనిని పూర్తి చేయాలని భారీ లక్ష్యాలు ఇస్తుండటంతో తహసీ ల్దార్లు, ఎఇఆర్‌ఓలు , క్షేత్రస్థాయి సిబ్బంది తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. రీ సర్వే, అదనపు విధులు, అదనపు లక్ష్యాలు లేకుండా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సూచనలు ఇవ్వాలని సిఇఓను కోరినట్లు ఆయన వెల్లడించారు.

24న సర్వే ట్రైనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూ సబార్డినేట్లకు ఈ నెల 24న సర్వే మెయిన్‌టెన్స్ టెస్ట్ (ఎపిఎస్‌టిఎ) నిర్వహించనున్నట్లు సర్వే, సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు కమిషనర్ సిద్ధార్థజైన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

గగనయాన్ తరహాలో 'సముద్రయాన్'

- వచ్చే ఏడాది ప్రయోగానికి చురుగ్గా ఏర్పాట్లు
- ఆరు వేల మీటర్ల లోతున సముద్ర గర్భ అన్వేషణ
- 'నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్స్' సదస్సులో రవిచంద్రన్

జ్యోతి ప్రజ్వలతో సదస్సును ప్రారంభిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

గగన్‌యాన్ తరహాలో సముద్రయాన్‌కు భారత శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారని, వచ్చే ఏడాది ఈ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశం ఉందని కేంద్ర భూశాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ రవిచంద్రన్ తెలిపారు. డీప్ ఓషన్ టెక్నాలజీ మిషన్‌లో భాగంగా సముద్ర వనరులు, సముద్ర గర్భంలోని జీవ వైవిధ్యంపై అధ్యయనం చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు వివరించారు. 'నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్స్' జాతీయ సదస్సు తిరుపతి ఐఐటిలో మంగళవారం జరిగింది. ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విజ్ఞానభారతి సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి. ముఖ్య అతిథిగా హాజరైన రవిచంద్రన్ మాట్లాడుతూ.. ముగ్గురు ఆక్వానాట్స్‌తో ప్రయాణం చేయడానికి అనువైన జలాంతర్గామిని ఈ పరిశోధనకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సముద్ర జలచరాలను గుర్తించడమే కాకుండా వాటి పరిరక్షణకు డీప్ సీ డ్రైవర్సిటీ పరిశోధన జరుగుతుందని వివరించారు. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్ వంటి సముద్ర ఆర్థిక వనరులను సమగ్రంగా గుర్తించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. భారత ఆర్థిక వృద్ధి రేటులో నాలుగు శాతం బ్లూ ఎకానమీ ద్వారా సమకూరుతున్నట్లు వివరించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన నీతి ఆయోగ్ మెంబర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ కె.సారస్వత్ మాట్లాడుతూ.. సమాజ స్థితిగతులను సైన్స్ మారుస్తుందన్నారు. టెక్నాలజీ ద్వారా సంపదను సృష్టించుకోవాలని సూచించారు. డిఆర్‌డిఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బికె దాస్ మాట్లాడుతూ..డిఆర్‌డిఓ సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భారత రాడార్లు, ఆయుధాల సామర్థ్యాన్ని వివరిస్తూ టెక్నాలజీ వృద్ధి కోసం డిఆర్‌డిఓ చేసిన కృషిని వివరించారు. ఈ సదస్సులో శాంతబయోటెక్ వ్యవస్థాపకులు డాక్టర్ వరప్రసాదరెడ్డి, తిరుపతి ఐఐటి డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, ఐఎస్‌టిఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.నారాయణరావు, విజ్ఞానభారతి ప్రతినిధి త్రిస్టా ఠాకూర్, ఐఎన్‌టిఎఫ్ కార్యదర్శి టి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు పే స్కేల్ ఇవ్వాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలకాశి

సమావేశంలో మాట్లాడుతున్న బాలకాశి

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

విఆర్‌ఎలకు పే స్కేలు ఇవ్వాలని, 2018 జూన్ నుండి డిఎను అమలు చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బాలకాశి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి సిఐటియు కార్యాలయంలో మంగళవారం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017లో విజయవాడ ధర్నా చౌక్‌లో విఆర్‌ఎల ధర్నాలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి హాజరై విఆర్‌ఎల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం వచ్చి నాలుగు సంవత్సరాలు దాటినా విఆర్‌ఎల హామీలు అమలుకు నోచుకోలేదని తెలిపారు. గతేడాది డిఎ ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి రికవరీ చేసి విఆర్‌ఎలకు ప్రభుత్వం అన్యాయం చేసిందని అన్నారు. కేవలం రూ.10,500 వేతనంతో పనిచేస్తున్నారని అన్నారు. విఆర్‌ఎలు అందరూ పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. డిఎ అమలు చేయాలని, ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో కమిటీ అధ్యక్షులు ఎన్ పెద్దన్న, ఉపాధ్యక్షులు భద్రరావు, బి వెంకట రత్నం, అంజి, శ్రీనాథ్, సూర్యనారాయణ, యాకోబు, బి రవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో 25 మంది టిడిపి నేతల అరెస్టు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌ను నిరసిస్తూ మంగళవారం విశాఖ నగరంలో నల్లజెండాలతో టిడిపి నాయకులు చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో పోలీసులకూ, టిడిపి కార్యకర్తలకూ మధ్య తోపులాట జరిగింది. దీంతో 25 మంది టిడిపి ముఖ్య నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ బ్యారెక్ కల్యాణ మండపానికి తరలించారు. అరెస్టయిన వారిలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, జివిఎంసిలో ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి తదితరులు ఉన్నారు. అక్కడ కూర్చునేందుకు సరైన సదుపాయాలు లేవంటూ నాయకులు అభ్యంతరం తెలిపారు. కొద్దిసేపటి తరువాత వారందరినీ వ్యక్తిగత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరసన తెలియజేసే హక్కును కాలరాయడం తగదన్నారు. ప్రజల మద్దతు తమకుందని తెలిపారు. నగరంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందునే పాదయాత్ర చేస్తున్న వారిని అడ్డుకున్నామని పోలీసులు తెలిపారు.

తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును అరెస్టు చేస్తున్న పోలీసులు

జగన్ తన గోతిని తానే తవ్వుకున్నారు : అయ్యన్న

చంద్రబాబును తప్పుడు కేసులో అరెస్ట్ చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన గోతిని తానే తవ్వుకున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాల రూపకల్పన కోసం ఉమ్మడి విశాఖ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి వంటి నీచమైన పాలన చరిత్రలో లేదన్నారు. పోలీసులను గుప్పెట్లో పెట్టుకున్నారని, వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారని విమర్శించారు.

చంద్రబాబుకు ఏమి జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత

- హోంమంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడుకు ఏం జరిగినా బాధ్యత ప్రభుత్వానిదేనని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. విశాఖలో జరుగుతున్న జైళ్ల శాఖ జాతీయ సదస్సుకు మంగళవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ టిడిపి నేతలు చంద్రబాబుకు ప్రాణహాని ఉందని చెప్పడంలో అర్థం లేదన్నారు. జైలులో మావోయిస్టులు, కరుడు గట్టిన నేరస్తులు ఉన్నారని, వారి నుంచి బాబుకు ముప్పు ఉందని చెప్పడం ప్రజల్లో సానుభూతి కోసమే తప్ప మరొకటి కాదని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, టిడిపి నేత, ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రభుత్వంపై అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. చంద్రబాబుకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇంట్లోనే రిమాండు విధించాలనడం అర్థరహితమన్నారు.

కుటుంబం అనుమానాస్పద మృతి

బావిలో తేలియాడుతూ కనిపించిన ముగ్గురి మృతదేహాలు

ప్రజాశక్తి- కొత్తవలస (విజయనగరం జిల్లా)

అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మొహినుద్దీన్, సంషిని షా, జహీదా (ఫైల్)

విజయనగరం జిల్లా కొత్త వలస మండలం చింతలపాలెంలో విశాఖ పట్నం జిల్లా మర్రిపాలెం ఎఫ్‌సిఐ కాలనీకి చెందిన ఓ కుటుంబం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వారిలో ఎండి మొహి నుద్దీన్ (46), ఆయన భార్య సంషిని షా (39), కుమార్తె ఫాతిమా జహీదా (17) ఉన్నారు. ఒక బావిలో వీరి మృతదేహాలు తేలియాడుతూ ఉండడాన్ని స్థానికులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల కథనం ప్రకారం... వీరు ఓ ప్రయివేటు వాహనంలో సోమవారం సాయంత్రం కొత్తవలస సమీపంలోని చింతపాలెంలోగల తమ స్థలాన్ని చూసేందుకు వచ్చారు. వీరు ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక మరేదైనా జరిగిందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని విజయనగరం డిఎస్‌పి జి.గోవిందరావు, కొత్తవలస సిఐ చంద్రశేఖర్ పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. సిఐ మాట్లాడుతూ కుమారుడు మహమ్మద్ అలీతోపాటూ బంధువులను విచారించినట్లు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమలలో ఈ నెల 18 నుంచి 26 వరకు 9 రోజుల పాటు నిర్వహించనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టిటిడి ఆహ్వానించింది. ఈ మేరకు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఓ ఎవి ధర్మారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి ఆలయ పండితులతో కలిసి వెళ్లి జగన్‌కు ఆహ్వాన పత్రిక, శ్రీవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ కూడా పాల్గొన్నారు.

జైళ్ల పాలనను సరిదిద్దే సంస్కరణలు అవసరం

- రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

జాతీయ సదస్సు ముగింపులో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జైళ్లలో ఖైదు కాబడిన ప్రతి వ్యక్తీ వారి గతంతో సంబంధం లేకుండా కోలుకునేలా.. మెరుగైన జీవితాన్ని గడపడానికి అర్హుడనేలా కొత్త జైళ్ల సంస్కరణలు ఎంతో అవసరమని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉద్ఘాటించారు. విశాఖలో జరుగుతున్న జైళ్ల శాఖ ఉన్నతాధికారుల జాతీయ సదస్సు ముంగిపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జైళ్లలో ఖైదీల మానసిక ఆరోగ్య పరిస్థితులు, వారి సంక్షేమం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాల్సి ఉందన్నారు. ఎపి ప్రభుత్వం దేశంలోని ఇతర రాష్ట్రాల జైళ్లకు ఆదర్శంగా నిలుస్తోందని, ఇక్కడి ఖైదీలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రోత్సాహన్నిస్తూ వారి ఉపాధి, పునరావాసానికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. దేశంలోని జైళ్లలో 129 శాతం మేర సామర్థ్యానికి మించి ఖైదీల రద్దీ నమోదు కావడం విచారకరమని పేర్కొన్నారు. ఢిల్లీలోనైతే సామర్థ్యం కంటే రద్దీ 200 నుంచి 300 శాతం ఉందన్నారు. సమాజంలో మహిళలు లింగవివక్షను ఎదుర్కొంటూ సరైన న్యాయం పొందలేకపోతున్నారని అన్నారు. అంతర్జాతీయ సంప్రదాయాలు, ప్రమాణాలకు అనుగుణంగా మోడల్ జైళ్ల చట్టం - 2023 ఉండాల్సి ఉందన్నారు.

సమాజంలో ఏ వ్యవస్థనైనా 'దిద్దుబాటు' ద్వారా సవరించుకోవచ్చని తెలిపారు. జైళ్ల లక్ష్యాలు, నిర్వహణకు సంబంధించి జస్టిస్ అమితవ్‌రాయ్ కమిటీ సుప్రీం కోర్టుకు ఇచ్చిన నివేదికలో జైళ్లలో ఖైదీల మధ్య హింస, అసహజ మరణాలను ప్రస్తావించిన విషయాన్ని మరచిపోకూడదని అన్నారు. ముఖ్యంగా మహిళా ఖైదీలకు జైళ్లలో ప్రత్యేక సదుపాయాలేవీ లేకపోవడాన్ని గవర్నర్ ప్రస్తావించారు. సదస్సులో రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, న్యూఢిల్లీకి చెందిన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డవలప్‌మెంట్ డైరెక్టర్ జనరల్ శ్రీహరీష్ కుమార్ గుప్తా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.7,600కే అంతర్జాతీయ విమానయానం

- స్కూట్ ఎయిర్‌లైన్స్ డిస్కౌంట్
- వైజాగ్ నుంచి రాయితీ

న్యూఢిల్లీ : అతి చౌక ధరలో అంతర్జాతీయ విమానయానం అందిస్తోన్నట్లు సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్‌ఐఎ) అనుబంధ సంస్థ స్కూట్ వెల్లడించింది. ప్రారంభ ధర రూ.7600 నుంచే పలు దేశాలకు ప్రయాణం చేయవచ్చని పేర్కొంది. ఈ టికెట్ల అమ్మకాలు సెప్టెంబర్ 18 నాటితో ముగుస్తాయని తెలిపింది. 38 గమ్యస్థానాలకు డిస్కౌంట్ ప్రయాణాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొంది. హైదరాబాద్, విశాఖపట్నం నుంచి కౌలాలంపూర్, జకార్తా, బాలి, సింగపూర్, హనోయి, సిడ్నీ, మెల్‌బోర్న్, పెర్త్ నగరాలకు రూ.8,990 నుంచి రూ.15,900 ఛార్జ్‌తో ప్రయాణం చేయవచ్చని తెలిపింది. సింగపూర్‌కు రూ.8,900తోనే ప్రయాణం చేయడానికి వీలు కల్పిస్తోన్నట్లు పేర్కొంది. దేశంలోని ఇతర ముఖ్య నగరాల నుంచి కూడా ఆఫర్లను అందిస్తుంది. ఆగస్ట్ 2024లోపు ఎంపిక చేసిన తేదిల్లో మాత్రమే ప్రయాణించడానికి వీలుంటుందని తెలిపింది.

భారత్‌లో తయారైన ఐఫోన్లు వస్తోన్నాయి...

న్యూఢిల్లీ : ఆపిల్ కంపెనీ భారత్‌లో తొలిసారి తయారు చేసిన ఐఫోన్లను విడుదల చేయనుంది. ఐఫోన్ 15ను సెప్టెంబర్ 12 రాత్రి ఆవిష్కరించింది. ఇతర దేశాలతో పాటు భారత్‌లోనూ ఈ ఫోన్ అమ్మకాలను ప్రారంభించనుందని సమాచారం. గత నెలలో దక్షిణ తమిళనాడులోని ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ ఫ్యాక్టరీలో ఐఫోన్ 15 ఉత్పత్తిని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ముంబయిలో తొలిసారి తన అధికారిక రిటైల్ స్టోర్‌ను కూడా ఆపిల్ ప్రారంభించింది. ఐఫోన్ 15 ధర రూ.90వేల లోపు ఉండొచ్చని అంచనా.

6.83 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 6.83 శాతంగా నమోదయ్యింది. ఇంతక్రితం జులైలో ఇది 7.4 శాతంగా చోటు చేసుకుంది. గడిచిన నెలలో అహారో త్పత్తుల ద్రవ్యోల్బణం సూచీ 9.94 శాతానికి తగ్గిందని ప్రభుత్వ గణంకాలు తెలిపాయి. 2023 జులైలో 11.51 శాతంగా చోటు చేసుకుంది. స్థూలంగా గ్రామీణ, పట్టణ ద్రవ్యోల్బణ సూచీలు వరుసగా 7.02 శాతం, 6.59 శాతంగా చోటు చేసుకున్నాయి. క్రితం జులైలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 7.4 శాతానికి ఎగిసి.. 15 మాసాల గరిష్ట స్థాయి వద్ద చోటు చేసుకుంది. ముఖ్యంగా కూరగాయలు, అహారోత్పత్తుల ధరలు ఎగిసి పడ్డాయి. టమాట ధరలకు అడ్డూ, అదుపు లేకుండా పోయిన విషయం తెలిసిందే.

అక్టోబరు నుంచి ధర్మప్రచార ఉత్సవాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అక్టోబరు నుంచి మార్చి వరకు ధర్మప్రచార ఉత్సవాలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం దేవాదాయ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మప్రచారంలో భాగంగా యక్షగానం, ప్రవచనాలు, హరికథలు, భక్తి, సంగీతం, కూచిపూడి నృత్యాలు, భజనలు, కోలాటాలు, పారాయణాలు ఉంటాయన్నారు. వీటితో పాటు సామూహిక ఉచిత కుంకుమపూజలు, అభిషేకాలు, సరస్వతీ హోమాలు వంటి కార్యాక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వారంలో రెండు లేదా మూడు గిరిజన, మత్స్యకార, వెనుకబడిన తరగతులు, తెగలు నివసించే ప్రాంతాల్లో ధర్మ ప్రచార రథం పర్యటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సోషల్‌మీడియాలో మరింత చురుగ్గా.. : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోషల్ మీడియాలో మరింత చురుగ్గా కృషి చేయాల్సిన అవసరముందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆ పార్టీ ఐటి విభాగాన్ని ఆదేశించారు. పార్టీ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేసేలా ఐటి విభాగం బలోపేతం కావాలన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జిల్లా పార్టీ అధ్యక్షులు, జిల్లాల ఇన్‌చార్జీలు, వివిధ మోర్చాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల స్థాయి వరకు పార్టీ విస్తరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నేతలు కార్యకర్తలతో మమేకం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

రాజకీయాలను భ్రష్టు పట్టించింది చంద్రబాబే..

- విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాజకీయాలను భ్రష్టు పట్టించింది చంద్రబాబే అని వైసిపి దక్షిణ జిల్లాల వైసిపి కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఆరోపించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సిమెన్స్ సంస్థ ప్రతినిధులు తామెక్కడా 90 శాతం నిధులు ఇస్తామని చెప్పలేదని అన్నారు. ఈ నేపథ్యంలో రూ.370 కోట్లు షెల్ కంపెనీలకు పోయాయన్నారు. కిలారి రాజేష్ అనే వ్యక్తి పాత్ర కూడా ఇందులో ఉందన్నారు. నిధులు దారిమళ్లినట్లు కేంద్రంలోని ఇడి, సిఐడి తేల్చాయని చెప్పారు. ఔటర్ రింగురోడ్డు, అసెంబ్లీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలోనూ ప్రజాధనం దుర్వినియోగం అయిందని ఆరోపించారు. బిజెపిలో టిడిపి కోవర్టుగా పురందేశ్వరి పనిచేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఎత్తయిన నడకమార్గాల ఏర్పాటుకు ప్రణాళికలు

- యాత్రికుల భద్రత, వన్యప్రాణుల రక్షణా ముఖ్యమే
- ఎపి వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుమల

యాత్రికుల భద్రతతోపాటు వన్యప్రాణుల సంరక్షణా ముఖ్యమేనని, తిరుమలలో ఎత్తయిన నడకమార్గాల ఏర్పాటుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ మధుసూధన్‌రెడ్డి అన్నారు. క్రూరమృగాలు దగ్గరకు రాకుండా ఈ మార్గాలను సురక్షిత జోన్లుగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వం, టిటిడి లక్ష్యమని తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. యాత్రికులకు జంతువులు తారసపడకుండా చేపట్టాల్సిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలపై టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డితో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. చిరుత దాడిలో ఆరేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన తరువాత తిరుమల కాలిబాట మార్గాలు, ఘాట్ రోడ్లలో భద్రతా చర్యలను ముమ్మరం చేశామన్నారు. ఏడో మైలు నుండి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు 20 రియల్ టైమ్ హై-ఫై కెమెరాలు, మరో 300 కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. మరో 500 అధునాతన సిమ్ బేస్డ్ రియల్ టైమ్ కెమెరా ట్రాప్‌లను కొనుగోలు చేసి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆహారపదార్థాలు విక్రయించే దుకాణాలపై ఆంక్షలు విధించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అటవీ సంరక్షణాధికారి నాగేశ్వరరావు, టిటిడి డిప్యూటీ సిఎఫ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూర్తి రిఫండ్‌తో హోటల్ బుకింగ్ రద్దు : క్లియర్‌ట్రిప్

న్యూఢిల్లీ : ముందుగా బుకింగ్ చేసుకున్న హోటల్‌ను కారణం లేకుండా ఎప్పుడైనా రద్దు చేసుకునే సౌలభ్యాన్ని కల్పిస్తోన్నట్లు ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన క్లియర్‌ట్రిప్ తెలిపింది. వినియోగదారులకు ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా చెక్ ఇన్ చేయడానికి ముందు ఎప్పుడైనా వారి బుకింగ్‌లను రద్దు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని పేర్కొంది. ఒక్కో బుకింగ్‌కు రూ.25,000 వరకు పూర్తి రీఫండ్‌లను పొందవచ్చని క్లియర్‌ట్రిప్ సిఇఓ అయ్యప్పన్ ఆర్ పేర్కొన్నారు. ఇది తమ వినియోగదారులకు, 3 లక్షలకు పైగా హోటల్ భాగస్వాములకు బుకింగ్ అనుభవంలో కొత్త శకానికి నాంది పలికనుందని తెలిపారు.

వేడుకగా హైబిజ్ అవార్డ్స్ ప్రదానం

హైదరాబాద్ : 2023 :వివిధ వ్యాపార రంగాల్లో సేవలు అందిస్తున్న ఎంతో మంది వ్యక్తులను, సంస్థలను గుర్తించి హైబిజ్ టివి మొదటి ఎడిషన్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023ను ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని నోవొటెల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత కెఐ వరప్రసాద్ రెడ్డి, శాంతా బయోటెక్ ఛైర్మన్, టిఎస్ఐఐసి వైస్ ఛైర్మన్ నర్సింహా రెడ్డి హాజరయ్యారు. లెజెండ్స్ కేటగిరీలో భారతీ సిమెంట్స్‌కు చెందిన ఎం రవీందర్ రెడ్డి, బ్రాండ్ ఇండియా ఫార్మా యొక్క క్రూసేడర్ అండ్ ప్రపంచ ప్యాకేజింగ్ యొక్క గ్లోబల్ అంబాసిడర్ చక్రవర్తి ఎవిపిఎస్, మానేపల్లి జ్యువెలర్స్ మానేపల్లి రామారావు, ఆర్క్ గ్రూప్ గుమ్మి రామ్ రెడ్డి తదితరులకు అవార్డులు దక్కాయి. "వ్యాపారం అనేది సంపదను పెంచుకోవడం మాత్రమే కాకుండా సమాజ అభివద్ధికి తోడ్పడాలని వరప్రసాద్ రెడ్డి అన్నారు. ఎన్ని అవరోధాలు వచ్చినప్పటికీ, వాటిని ఎదుర్కొని నిలివాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైబిజ్‌టివి ఎండి ఎం రాజ్‌గోపాల్ పాల్గొని.. అవార్డు గ్రహీతలను ప్రశంసించారు.

17న టెడ్‌ఎక్స్ ఇగ్నైట్ సదస్సు

హైదరాబాద్ : టెడ్‌ఎక్స్ హైదరాబాద్ తన 9వ ఎడిషన్‌ను సెప్టెంబర్ 17న నిర్వహించనున్నట్లు తెలిపింది. ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లోని ప్రధాన్ కన్వెన్షన్స్‌లో ఈ ఇగ్నైట్ సదస్సు జరగనుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. నిపుణులైన 12 మంది స్పీకర్లు హాజరు కానున్నారని పేర్కొన్నారు. వివిధ రంగాలలో సానుకూల మార్పును ప్రేరేపించటం తాము లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకర్షణీయమైన చర్చలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, హాజరైనవారు స్పీకర్‌లతో చర్చించటం, అర్థవంతమైన సంబంధాలు, సహకారాన్ని పెంపొందించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

డీజిల్ వాహనాలపై అదనపు జిఎస్‌టి..!

న్యూఢిల్లీ : దేశంలో డీజిల్ ఇంధనం వాహనాలపై కేంద్ర ప్రభుత్వం అదనంగా 10 శాతం జిఎస్‌టి విధించనుందని వార్తలు వచ్చాయి. డీజిల్ వాహనాలను తగ్గించి.. కాలుష్యాన్ని తగ్గించాలనే యోచిస్తోందని ఊహాగానాలు వెల్లువెత్తాయి.

ఈ పరిణామంతో స్టాక్ మార్కెట్‌లో వాహన, చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు ఒత్తిడికి గురైయ్యాయి. కాగా దీనిపై స్పందించిన రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ.. ప్రభుత్వం డీజిల్ వాహనాలపై ఎలాంటి అదనపు పన్ను వేసే యోచనలో లేదని స్పష్టతనిచ్చారు. అలాంటి ప్రతిపాదనేదీ తమవద్ద లేదన్నారు.

పారిశ్రామికోత్పత్తి 5.7 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది ఆగస్టులో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) 5.7 శాతానికి పెరిగిందని కేంద్ర గణంకాల శాఖ వెల్లడించింది. ఇంతక్రితం జూన్‌లో ఇది 3.7 శాతంగా చోటు చేసుకుంది. 2022 జులైలో 2.2 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ఇదే నెలలో గనుల రంగం మైనస్ 3.3 శాతానికి పడిపోగా.. గడిచిన జులైలో ఏకంగా 10.7 శాతం వృద్ధిని కనబర్చింది. తయారీ రంగం 3.1 శాతం నుంచి 4.6 శాతానికి చేరింది.

సంపాదకీయం

ఆర్భాటం.. ఆత్మవంచన...

దేశ రాజధానిని మూసేసి రెండు రోజుల పాటు అత్యంత ఆర్భాటంగా నిర్వహించిన జి-20 సదస్సు ముగిసింది. మోడీ ప్రభుత్వ కపటత్వం బయటపడింది. వర్ధమాన దేశాల ప్రయోజనాలను కాపాడే మొనగాడిగా నిలవాల్సిన భారత్, సంపన్న దేశాల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లే సాధనంగా వ్యవహరించింది. ఉక్రెయిన్ యుద్ధంపై బాలి సదస్సులో రష్యాను దురాక్రమణదారు వంటి పరుష పదజాలాన్ని ప్రయోగించిన జి-20 వేదిక ఈ సారి స్వరాన్ని తగ్గించింది. అదే గొప్ప విజయంగా మోడీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్, చైనా ప్రధాని లీ కియాంగ్ లేవనెత్తిన అభ్యంతరాలను అంగీకరించిన మీదటే డిక్లరేషన్ ఆమోదం పొందింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చేసుకుని అమెరికా విధించిన ఆంక్షలను చాలా దేశాలు లెక్కచేయడం లేదు. భారత్‌తో సహా పలు దేశాలు రష్యా నుంచి చౌకగా చమురు స్థానిక కరెన్సీలో పొందుతున్నాయి. అందుకే రష్యాకు వ్యతిరేకంగా జి-20లోని సభ్య దేశాలను కూడగట్టాలన్న అమెరికా ఎత్తులు ఇక్కడ పారలేదు. 14 వేల పదాలకు పైగా ఉన్న ఈ డిక్లరేషన్ వర్ధమాన, పేద దేశాలను వెంటాడుతున్న సమస్యలపై దృష్టి పెట్టింది లేదు. మోడీని విశ్వగురుగా ప్రపంచం గుర్తించిందనడానికి జి-20 సదస్సు అధ్యక్ష బాధ్యతలు లభించడమేనని బిజెపి ప్రచారం చేసుకోవడం మరో వంచన. జి-20కి అధ్యక్ష బాధ్యతలు గతసారి ఇండోనేషియా నిర్వహించింది. వచ్చే ఏడాది బ్రెజిల్ నిర్వహించబోతున్నది. ఈ అధ్యక్ష బాధ్యతలు రోటీన్‌గా ఒక దేశం తరువాత మరొక దేశానికి అప్పగించబడతాయి. ఇందులో మోడీ ప్రభుత్వ గొప్పతనమేమీ లేకున్నా, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో దీనిని ఉపయోగించుకుని రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి చూస్తున్నది.

విశ్వగురు తన గొప్పతనాన్ని చాటుకోడానికి ఈ శిఖరాగ్ర సదస్సు నిర్వహణకు ముందు ఢిల్లీలో 25కిపైగా మురికివాడలను, దుకాణాలను బుల్డోజర్లతో నేలమట్టం చేసి, రాజధానిలో పేదరికాన్ని ప్రపంచ దేశాలకు కనిపించకుండా దాచిపెట్టారు. ఇదీ మన విశ్వగురు ఘనత! చీటికీ మాటికీ నెహ్రూను ఆడిపోసుకునే మోడీ ప్రభుత్వం చివరికి భారత్, ఆఫ్రికా సంబంధాల మెరుగుదలకు ఆయన చూపిన బాటనే అనుసరించింది. బ్రిక్స్‌లో రెండు ఆఫ్రికన్ దేశాలకు కొత్తగా సభ్యత్వం కల్పించగా, జి-20 యాభై అయిదు దేశాల ఆఫ్రికన్ యూనియన్‌కు జి-20లో భాగస్వామ్యం కల్పించింది. ఆఫ్రికా దేశాల ప్రవేశం గతంలో ఉన్న అసమతుల్యతను సరిచేసింది. అమెరికా ఒత్తిడి మేరకు రైలు, నౌకా మార్గాలను అనుసరిస్తూ భారత్-మధ్య ఆసియా-యూరప్ ఆర్థిక కారిడార్‌ను ప్రధాని మోడీ ప్రకటించారు. ఆర్థిక, వాణిజ్యమే ఈ కారిడార్ లక్ష్యమైతే ఆక్షేపించాల్సిన అవసరం లేదు. కానీ, చైనా వన్ బెల్ట్, వన్ రోడ్‌కు పోటీగా జి-7 దేశాలు గతంలో ప్రకటించిన కారిడార్ల తరహాలోనే అమెరికా ప్రోద్బలంతో దీనిని ముందుకు తెచ్చినట్లుగా అనిపిస్తుంది.

1999లో ఆగ్నేయాసియాలో తలెత్తిన సంక్షోభాన్ని పరిష్కరించడంలో సంపన్న దేశాల కూటమి జి-7 విఫలమైన నేపథ్యంలో ఈ జి-20ని అవి తెరపైకి తీసుకొచ్చాయి. 2008లో ప్రపంచ ఆర్థిక మాంద్యం తలెత్తినప్పుడు ఆ భారాలను వర్ధమాన దేశాలపైకి నెట్టివేసేందుకు ఈ వేదికను ఉపయోగించుకున్నాయి. భారత్‌ను కేంద్రంగా చేసుకుని చైనాను కట్టడి చేసేందుకు ఇండో-పసిఫిక్ వ్యూహాన్ని రచించిన అమెరికా ఇప్పటికే క్వాడ్, ఆకస్ వంటి కూటములను ఏర్పాటు చేసి ఆ దిశగా పావులు కదుపుతోంది. బైడెన్ భారత్‌లో అడుగు పెట్టడానికి ముందే అమెరికా నుంచి దిగుమతి చేసుకునే యాపిల్స్, పౌల్ట్రీ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాన్ని 20 శాతం మేర తగ్గించేసింది. దీంతో కాశ్మీర్‌లో యాపిల్ రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. అమెరికా నౌకాదళం, కేంద్రప్రభుత్వరంగ సంస్థ మసాగోవ్ డాక్‌షిప్ బిల్డర్స్ లిమిటెడ్ మధ్య జరిగిన ఒప్పందం మన దేశ సార్వభౌమత్వానికి గొడ్డలిపెట్టు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ, పర్యావరణ సంబంధమైన అసమానతలు, జీవ వైవిధ్యానికి ఎదురవుతున్న ముప్పు వంటి అంశాలపై డిక్లరేషన్‌లో ప్రస్తావించినా వాటి అమలుకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట ప్రణాళికలు కానీ, యంత్రాంగాన్ని కానీ ఏర్పాటు చేయలేదు.

నెలల తరబడి మణిపూర్‌లో జాతులు, మతాల మధ్య మారణహోమం సాగుతున్నా నోరు మెదపని విశ్వగురు అంతర్జాతీయ వేదికలపై ఒక భూమి, ఒక భవిష్యత్తు, వసుధైక కుటుంబం గురించి లెక్చర్ దంచడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనం. వైట్ హౌస్ నుంచి పదేపదే అభ్యర్థనలు ఉన్నప్పటికీ, బైడెన్, మోడీ సంయుక్త మీడియా సమావేశం ఏర్పాటు చేసి, అమెరికా జర్నలిస్టులకు ప్రశ్నలు అడిగే అవకాశం కల్పించేందుకు అనుమతించలేదు. మొత్తంగా జి 20 శిఖరాగ్ర సమావేశం ప్రచార ఆర్భాట వేదికగానే మిగిలిపోయింది.

సందర్భం



మీరు చేసే పని
అద్భుతంగా ఉండాలంటే
దానిని ప్రేమించడం నేర్చుకోండి.
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

Albert Einstein

విశ్లేషణ

గ్యాస్ బండ భారం తగ్గింపు వెనుక...

ధరలు పెంచడమే విధానంగా మార్చుకున్న కేంద్ర ప్రభుత్వం అకస్మాత్తుగా గ్యాస్ ధర తగ్గించడం సామాన్యులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. మహిళల కోసం రూ.వేల కోట్ల భారాన్ని మోడీ తలపైకి ఎత్తుకున్నారని ఆయన భక్తులు యథావిధిగా కీర్తిస్తోత్రాలు ఆలపిస్తున్నారు. రాఖీ పండుగ సందర్భంగా అక్కచెల్లెళ్లకు ఇది మోడీ కానుక అని ప్రభుత్వం ప్రకటించుకుంది. ఎవరు ఏమి చెప్పినా ఇన్నాళ్ళకు గ్యాస్ సిలిండర్ ధర కొంతైనా తగ్గడం ప్రజలకు కొంతమేరకు ఊరట. కలహ భోజన ప్రియుడు ఏ కార్యమైనా ఊరికే చేయడు. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలు, 'ఇండియా' కూటమి సమావేశాలు, ముఖ్యంగా ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ వినియోగదారులు గ్యాస్ వాడకాన్ని పూర్తిగా తగ్గించడం, అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం వంటి ముఖ్యమైన కారణాలు ఈ మాత్రం ధర తగ్గింపు వెనుక వున్నాయి.

వి. రాంభూపాల్

కట్టెలు, బొగ్గుపైన తరతరాలుగా మన దేశ మహిళలు వంట చేస్తున్నారు. అయితే శాస్త్రవిజ్ఞానం పెరిగేకొద్దీ ప్రజా జీవన విధానంలోకి అనేక కొత్త వస్తువులు ప్రవేశిస్తాయి. ప్రపంచంలోని కొన్ని దేశాలు దశాబ్దాల నుండే గ్యాస్‌ను వంట సరుకుగా ఉపయోగిస్తున్నాయి. మన దేశంలో వ్యవసాయం ప్రధానంగా వుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో వంటకు అవసరమైన కట్టెలు విస్తారంగా అందుబాటులో వుండడం, గ్యాస్ లభ్యత దేశంలో తక్కువగా వుండడం, విదేశాల నుండి దిగుమతి చేసుకోవలసి రావడం, గ్యాస్ వాడకం పట్ల అవగాహన లేకపోవడం వంటి కారణాలతో మన వంటింట్లోకి గ్యాస్ సిలిండర్ రావడం చాలా ఆలస్యమైంది. గ్యాస్ సిలిండర్ కావాలని పెళ్ళికి ముందు అర్జీ పెట్టుకుంటే అవ్వ, తాతలు అయిన తర్వాత వచ్చే పరిస్థితి గతంలో వుండేది. అర్జంట్‌గా అంటే అర్జీ చేసుకున్న కనీసం ఆరు నెలల నుండి సంవత్సరంలోపు గ్యాస్ కనెక్షన్ కావాలంటే ఎంపీల సిఫారసు తప్పనిసరిగా అవసరమయ్యేది. దేశంలో ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత ప్రతిదీ సరుకుగా మారిన తర్వాత సరుకుల వినిమయం పెరిగింది. టి.వి, సెల్‌తో పాటు గ్యాస్ సిలిండర్ వాడకం కూడా వేగంగా పెరిగింది. నిత్య జీవితంలో వంటగ్యాస్ కీలక స్థానాన్ని ఆక్రమించింది. గ్యాస్ లేకుంటే వంట ఇల్లు బీడుగా మారే పరిస్థితి ఏర్పడింది. అందుకే ఈ సరుకుపై చమురు కంపెనీల దృష్టి పడింది. ప్రభుత్వాలు కూడా చమురు కంపెనీల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయాలు చేయడం జరిగింది. లాభసాటిగా మారిన గ్యాస్ అమ్మకంలోకి అనేక కంపెనీలు జొరబడ్డాయి. వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నాయి.

> గ్యాస్ వినియోగం పెరిగేకొద్దీ సరఫరా బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుని ప్రైవేటు కంపెనీలకు అప్పగించింది. పెరిగిన గ్యాస్ ధర మొత్తాన్ని సబ్సిడీగా నగదు రూపంలో బ్యాంకులో జమ చేస్తామని గ్యాస్ వినియోగదారులంతా బ్యాంకు ఖాతాలు తెరుచుకోవాలని మోడీ ప్రభుత్వం ప్రకటించి ప్రజలను మభ్యపెట్టింది. క్రమంగా సబ్సిడీ మొత్తాన్ని కుదించి వేసింది. ఆ తరువాత సంవత్సరానికి రూ.పది లక్షల ఆదాయం వుండే గ్యాస్ వినియోగదారులకు సబ్సిడీ వర్తించదని 2015 డిసెంబర్ నెలలో నిర్ణయించింది. దీనివల్ల దేశవ్యాప్తంగా 20 లక్షల మంది సబ్సిడీ గ్యాస్‌కు దూరమయ్యారు.

గ్యాస్ సబ్సిడీ కోతలు

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదిక ప్రకారం దేశంలో వంటగ్యాస్ వినియోగిస్తున్న కుటుంబాలు 2003-04లో 24.7 శాతం, 2015-16 నాటికి 44 శాతం, 2019-21 నాటికి 59 శాతంగా వున్నాయి. 2016 మే 1న ప్రారంభించిన 'ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన' పథకం పేరుతో దేశంలోని పేద కుటుంబాల మహిళలకు గ్యాస్ కనెక్షన్‌కు ఎలాంటి డిపాజిట్ లేకుండా ఇచ్చే పథకం ప్రవేశపెట్టిన తర్వాత కూడా పరిస్థితి ఇది. అంటే ఇప్పటికీ 41 శాతం కుటుంబాలు వంట కోసం గ్యాస్ కాకుండా కట్టెలు, బొగ్గులు లేదా ఇతరత్రా వాటిని వాడుతున్నారు. దేశంలో 2019-20లో తలసరి గ్యాస్ వినియోగం 3.01 కిలోలు ఉండగా 2022-23 నాటికి 3.71 కిలోలకు పెరిగింది. ప్రపంచంలో వంట గ్యాస్ వినియోగంలో చైనా అగ్ర భాగాన ఉంది. ఈ మాత్రమైనా గ్యాస్ వినియోగం పెంచింది మహిళల బాగుకోసమో, మహిళల కన్నీళ్ళు తుడవాడినికో అనుకుంటే పొరపాటు. గ్యాస్ వినియోగం పెరిగేకొద్దీ సరఫరా బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుని ప్రైవేటు కంపెనీలకు అప్పగించింది. పెరిగిన గ్యాస్ ధర మొత్తాన్ని సబ్సిడీగా నగదు రూపంలో బ్యాంకులో జమ చేస్తామని గ్యాస్ వినియోగదారులంతా బ్యాంకు ఖాతాలు తెరుచుకోవాలని మోడీ ప్రభుత్వం ప్రకటించి ప్రజలను మభ్యపెట్టింది. క్రమంగా సబ్సిడీ మొత్తాన్ని కుదించివేసింది. ఆ తరువాత సంవత్సరానికి రూ.పది లక్షల ఆదాయం వుండే గ్యాస్ వినియోగదారులకు సబ్సిడీ వర్తించదని 2015 డిసెంబర్ నెలలో నిర్ణయించింది. దీనివల్ల దేశవ్యాప్తంగా 20 లక్షల మంది సబ్సిడీ గ్యాస్‌కు దూరమయ్యారు. గడచిన నాలుగు సంవత్సరాల్లో గ్యాస్ సబ్సిడీలో రూ.30 వేల కోట్లు కోత విధించింది. ఈ విషయాన్ని స్వయానా కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖా మంత్రి ఈ సంవత్సరం జులై 23న సిపిఎం రాజ్యసభ సభ్యులు ఎ.ఎ.రహీమ్ అడిగిన ప్రశ్నకు జవాబుగా చెప్పారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వంటగ్యాస్ సబ్సిడీ కోసం రూ.37,209 కోట్లు కేటాయించగా, 2020-21 నాటికి ఈ సబ్సిడీని రూ.11,896 కోట్లకు, 2022-23 నాటికి రూ.6,965 కోట్లకు తగ్గించినట్లు ప్రకటించారు. దీనివల్ల 2014లో రూ.430 వున్న సిలిండర్ ధర 2018 నాటికి రూ.741, 2023 నాటికి రూ.1150కు పెరిగింది. గత తొమ్మిది సంవత్సరాల్లో వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడింది. సబ్సిడీలో కోతలు విధించి గ్యాస్ ధర పెరగడానికి కారణమైన కేంద్రం, అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలు పెరగడంతో ధరలు పెరుగుతున్నాయని, ప్రైవేట్ కంపెనీలు నష్టాలను భరించలేవు కదా అంటూ కపటపు మాటలు చెబుతున్నది.

గ్యాస్ సిలిండర్‌కు దూరమౌతున్న పేదలు

ఉజ్వల్ యోజన పథకం కింద ప్రస్తుతం 9.59 కోట్ల మంది నిరుపేద వినియోగదారులు వున్నారు. సహజంగానే పెరిగిన భారాన్ని వీరు మోయలేక గ్యాస్ వాడకం తగ్గించారు. ఉజ్వల గ్యాస్ వాడకందార్లు 2022-23 సంవత్సరంలో 1.15 కోట్ల మంది ఒక్క సిలిండర్ కూడా కొనలేకపోయారు. మరో 1.51 కోట్ల మంది సంవత్సరంలో కేవలం ఒక్క సిలిండర్ మాత్రమే కొనగలిగారు. ఒకవైపు ధరల భారం ప్రజలపై మోపి మరోవైపు ప్రైవేట్ పెట్రోలియం కంపెనీలకు 2022లో రూ.22 వేల కోట్లు ఇచ్చి తన కార్పొరేట్ అనుకూల విధానాన్ని నగ్నంగా అమలు చేస్తున్నది. మన దేశంలో వినియోగించే గ్యాస్‌లో 60 శాతం పైగా దిగుమతులపై ఆధారపడవలసి వస్తున్నది. ప్రపంచ చమురు ధరల్లో వచ్చే వ్యత్యాసం గ్యాస్ ధర పెరగడానికి కారణమైతే అక్కడ ధరలు తగ్గితే ఇక్కడ తగ్గాలి కదా! ఈ సంవత్సరం మార్చిలో ముడి చమురు టన్నుకు 732 డాలర్లు వుండగా జులై నాటికి 464 డాలర్లకు తగ్గింది. ఈ లెక్కన గ్యాస్ ధర రూ.400కు పైగా తగ్గాలి. కాని ఈ ఆగస్టు చివరి వరకు తగ్గించలేదు? రానున్న 5 రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు కొంత మొత్తాన్ని తగ్గించి అదో ఘనకార్యంగా ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది.

'ఇండియా' పట్ల భయంతోనే....

ఆకస్మిక నిర్ణయాలు చేయడం మోడీకి ఇష్టమైన విధానం. నోట్ల రద్దు, లాక్‌డౌన్, పాకిస్తాన్ పర్యటన, ఇప్పుడు గ్యాస్ ధర తగ్గింపు, పార్లమెంట్ అత్యవసర సమావేశాల నిర్ణయం ఇలా ఏదైనా సరే సంచలనంగా మార్చడం ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్ నేర్పిన విద్య. ఇప్పటి వరకు తనకు ఎదురులేదని ఒకవైపు మతోన్మాదాన్ని, మరోవైపు కార్పొరేటు అనుకూల విధానాలను వేగంగా అమలు చేసిన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లను ప్రతిపక్షాల వేదిక 'ఇండియా' కలవరపెడుతున్నది. మరో ఐదు సంవత్సరాలు తానే ప్రధానమంత్రినని ఆగస్టు 15న అద్దె ఎర్రకోటపై ఎంతో గంభీరంగా ప్రకటించిన మోడీ ఇప్పుడు గాభరా పడుతున్నారు. తొమ్మిది సంవత్సరాల పాటు గుర్తుకురాని ఎన్‌డిఎ పార్టీలతో సమావేశం కావడం, గ్యాస్ ధరను తగ్గించడం, జమిలి ఎన్నికలనడం, ఏకంగా దేశం పేరు ఇండియాను భారత్‌గా మార్చాలని ప్రయత్నించడం ఈ కలవరపాటులో భాగమే. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజల ఓట్లు కొల్లగొట్టేందుకు ఇప్పుడు గ్యాస్ ధర తగ్గించారు. రానున్న కొద్ది మాసాల్లో ఇంకా ఎన్ని జిమ్మిక్కులు చూడాల్సి వస్తుందో.

/ వ్యాసకర్త సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

కవిత్వం

దేశమంటే దేహాలే

కులం పేర అణిచివేత మతం పేర అణిచివేత
కులంలో మతంలో మొత్తం జనంలో
మహిళపై మహా మహా అణిచివేత
తరతరాల అణిచివేతల అహంకారపు ఆధిపత్యం
ఎవడిదంట? ఎందుకంట?
కష్టంచేసే కులాల దిగువ
దొంతర్లలో దించిందెవడు?
సంపద కులాల 'సొంత ఆస్తి'
కొండలపై నిలిపిందెవడు?
ఈ కిరాతకాల పాలన మోసిందెవడు?
సంపద ఎత్తే ఆధిపత్య నిచ్చెన మెట్లెక్కిన
అహంకారమే అణిచివేతల దురహంకారం
మదమెక్కిన పొగరుబోతుల కండకావరం
వివక్షలతో అణగదొక్కిన దౌర్జన్యం.
దేహమంటే కులం కాదు దేహమంటే మతం కాదు
గింజ కోసం గంజి కోసం
చెమట చిందే ప్రాణయంత్రం
పెంచినోడికి దక్కకుండా
హక్కు చెక్కు పొందినోడు
సర్వ సంపద లెగరేయడంపై
ఎగిసి లెగిసిన ప్రశ్నలన్నీ తిరగబడితే
తొక్కివేతకు లెక్కలేసిన అహంకారం కలిసి రాసిన
కుల మత విభజన గూడుల
గడుల సోపానం అది
ఏ గడిపై తిరగబడి ఏ నిచ్చెన ఎక్కినా
కడకు దోచే గడిలో కాచిన
పాము నోటబడటం ఖాయం.
అందుకే ఇప్పుడు ....
ఎవడిపై అణిచివేత వాడిదే కాకూడదు
అణిచివేత పెత్తనం కర్ర ఎవడిపై పడినా
అందరూ ఏకమై దాని నడుము విరవాలి
ఎక్కడది లేచే ఊపు ఊగినా
అక్కడే తొక్కేయాలి
ఎందుకీ దుస్థితి అని
దేశంలో దేహాలొకటై కదలాలి
అణిచివేతల ఆధిపత్యంపై
ఎదురేగి కదం తొక్కాలి
ఇరవైమంది అణిచివేతలకు
ఎనభైమంది సమాధానమైతే
దాని కోరల్లో అసలు విషం
సంపదలో ఈదే నిజం బట్టబయలౌతుంది
అక్కడ దాని నడుము విరిచిన నాడు
కష్టం చేసే మనిషంటే భయపడాలి
మనిషంటే మనిషేననీ దేహమంటే దేహమేననీ
దేహమున్నదే జీవమనీ
దేహాల సమూహమే దేశమనీ
తల వంచి నమస్కరించే సంస్కారం మెరవాలి.

- ఉన్నం వెంకటేశ్వర్లు

సందర్భం

నాజీల సృష్టి: దహావ్ నరకం

జర్మనీ లోని బవేరియా రాష్ట్ర రాజధాని అయిన మ్యూనిక్ నగరం, నాజీ ఉద్యమానికి ఆయువు పట్టు. హిట్లర్, అతని అనుచరులూ ఈ నగరాన్ని కేంద్రంగా చేసుకొని తమ విష రాజకీయాలను జర్మనీ అంతటికీ వ్యాపింపజేశారు. యూదులపై దాడులు, పుస్తకాలను తగులబెట్టడం మొదలైంది ఇక్కడే. మ్యూనిక్ నగరాన్ని నాజీ ఉద్యమానికి 'ఆధ్యాత్మిక' కేంద్రంగా హిట్లర్ అనేక సందర్భాల్లో పేర్కొన్నాడు. నాజీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రతీ సంవత్సరం మ్యూనిక్ వచ్చేవాడు.

1933లో నాజీలు అధికారంలోకి వచ్చి రెండు నెలలు కూడా పూర్తికాకుండానే మ్యూనిక్ సమీపంలోని దహావ్‌లో కాన్సంట్రేషన్ క్యాంపును నిర్మించారు. ఈ క్యాంపుని ప్రారంభిస్తూ, మూడు రాజకీయ గ్రూపులకు చెందిన ప్రమాదకరమైన వ్యక్తులను (కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు, సోషలిస్టులు) నిర్బంధించడమే దీని లక్ష్యమని అప్పటి మ్యూనిక్ పోలీస్ చీఫ్, హెన్రిక్ హిమ్లర్ ప్రకటించాడు. ఈ సమూహాలను అదుపు చేయాల్సి ఉంటుందనీ, లేకుంటే వాళ్లంతా ఆందోళనలు చేస్తూ దేశభద్రతకు ముప్పు తెస్తున్నారనీ హిమ్లర్ తన ప్రకటనలో చెప్పుకొచ్చాడు. వారి తరఫున వకాల్తా పుచ్చుకొనే న్యాయవాదులను కూడా ఇక్కడ నిర్బంధిస్తామని హెచ్చరించాడు. జర్మన్ పార్లమెంటు భవనాన్ని తగులబెట్టేందుకు ప్రయత్నించారనే ఆరోపణతో జర్మన్ కమ్యూనిస్టు పార్టీని అప్పటికే నిషేధించారు. ఊహించని ఆ పరిణామం నుండి పార్టీ కోలుకోలేకపోయింది. రహస్య పార్టీగా కొనసాగేందుకు అప్పటికప్పుడు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నాయకులు, సభ్యులు మొత్తంగా జైళ్ల పాలయ్యారు.

పరిమితంగానైనా నాజీలను ప్రతిఘటించేందుకు ప్రయత్నించిన అత్యంత సంఘటిత రాజకీయ సమూహం జర్మన్ కమ్యూనిస్టు పార్టీయే. ఈ క్రమంలో ఆ పార్టీ సభ్యులు, నాయకులు ఎంతో మంది చిత్రహింసలకు గురయ్యారు. తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఈ వివరాలు కొంతవరకూ మ్యూనిక్‌లో ఉన్న 'నేషనల్ సోషలిస్ట్ పార్టీ డాక్యుమెంటేషన్ మ్యూజియం'లో చూడవచ్చు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. తమ పార్టీ పేరులో 'సోషలిస్ట్' అనే మాట ఉండి తీరాలనీ, అది అప్పటికే బలంగా ఉన్న వామపక్ష సానుభూతిపరులను ఆకర్షిస్తుందనీ నాజీ పార్టీని స్థాపించిన రోజుల్లో హిట్లర్ వాదించాడు. అదే మ్యూజియంలో- అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో, జర్మన్ కమ్యూనిస్టు నాయకుడు యూజీన్ లెవిన్ నాయకత్వంలో నడిచిన తిరుగుబాటు, రెండేళ్లపాటు (1918-19) అధికారంలో కొనసాగిన బవేరియన్ సోవియట్ రిపబ్లిక్ నాటి ఘటనలు కూడా ప్రదర్శనలో ఉన్నాయి.

మలి దశలో 'యూదుల సమస్యకు అంతిమ పరిష్కారం' గానూ, శాంతికాముకులైన 'జెహోవా సాక్ష్యులు' వంటి సమూహాలను అణచివెయ్యడానికీ, ఉదారవాద పార్టీల నాయకుల్ని నిర్బంధించడానికీ దహావ్ క్యాంపు ఉపయోగపడింది. ఆ తరువాత 'అనార్యులైన' జిప్సీలను, స్వలింగ సంపర్కులను అక్కడికి తరలించారు. పన్నెండేళ్ల కాలంలో రెండు లక్షల మంది ఈ క్యాంపులో ఉన్నట్లు, వారిలో యాభై వేల మంది మరణించినట్లు ఒక అంచనా.



1933లో ఆవిష్కరింపబడ్డ ఈ దహావ్, యూరప్ అంతటా నాజీలు నిర్మించిన క్యాంప్‌లలో మొదటిది. 1945లో అమెరికన్ సైన్యాలు మ్యూనిక్ నగరాన్ని విముక్తి చేసేంతవరకూ నడిచిన 'మోడల్' క్యాంపు కూడా ఇదే. ఒక ప్రయోగశాలగా, తర్ఫీదు కేంద్రంగా, కాలక్రమేణా ఆక్రమిత యూరప్ అంతటా నిర్మించిన అనేక క్యాంపులకు ఇది మార్గదర్శకంగా ఉపయోగపడింది. 'పారిశ్రామిక స్థాయి'లో బులెట్ వృధా కాకుండా, శవాలను 'పూడ్చిపెట్టే శ్రమ' లేకుండా, కొద్ది నిముషాలలోనే వందలాది ఖైదీల ప్రాణాలు తీయడానికి గ్యాస్ చాంబర్ల వినియోగం, ఆ పక్కనే దహనం చేసే ఏర్పాట్లు, ఇక్కడే రూపుదిద్దుకున్నవి. వైద్య పరిశోధనల పేరుతో ఖైదీలను-ముఖ్యంగా యూదులు, కమ్యూనిస్టులు, పట్టుబడిన సోవియట్ సైనికులను - అత్యంత క్రూరంగా హింసించి చంపడం ఇక్కడే మొదలైంది. ఐదు వేల మంది కోసం నిర్మించిన ఈ క్యాంపులో ముప్పై వేల మందిని కుక్కి, తిండి లేకుండా మాడ్చి, దుర్భరమైన శారీరక శ్రమ చేయించేవారు. అక్కడ జరిగిన అమానవీయ ఘోరాలన్నింటినీ ఉటంకించడం అసాధ్యం.

ఈనాటి సమైక్య జర్మన్ సమాజం, నాజీ దుర్దినాలను ఏవిధంగా గుర్తుచేసుకుంటున్నది? నిజానికి యుద్ధానంతరం, ఆ రోజుల్ని మర్చిపోవడానికీ, వాటి ప్రస్తావన రాకుండా దాటవెయ్యడానికీ అత్యధిక శాతం జర్మన్ పౌరులు ప్రయత్నించారు. 'మనం ఓడిపోయాం' అనే భావన వారిని వెంటాడింది. పన్నెండేళ్ల హిట్లర్ పాలనలో సైన్యంతో సహా మొత్తం యంత్రాంగం, నాజీల చేతిలో ఉండింది. నాజీ పార్టీ ఎక్కించిన విషం, దేశమంతటా వ్యాపించింది. నాజీ దుష్కృత్యాల వివరాలు యుద్ధం ముగిసిన తరువాతనే బయట పడ్డాయి. ప్రపంచం యావత్తూ దిగ్భ్రాంతి చెందింది.

అప్పటి తరానికి చెందిన జర్మన్లు చాలా కాలం పాటు 'మాకేమీ తెలీదు. నాకు సంబంధం లేదు' అంటూ నైతిక బాధ్యత నుండి తప్పుకొనే ప్రయత్నం చేశారు. 1960-70ల నాటి తిరుగుబాటు దశకంలో యువతరం, 'మీరేం చూశారు? మీరేం చేశారు?' అని తమ ముందు తరాన్ని నిలదీయడం ఆరంభించింది. తమ దేశస్థుల అకృత్యాల పట్ల నేరభావంతో జర్మనీ కుంగిపోయింది. యుద్ధం ముగిసిపోయి 60-70 ఏళ్లు పూర్తయ్యాక, 'మనం ఓడిపోలేదు, నియంతలను ఓడించాం' అనే ఎరుక కలిగింది.

చరిత్ర పునరావృతం కాకుండా చూసుకోవాలనే సంకల్పం ఏర్పడింది. ముఖ్యంగా నియో-నాజీ శక్తులను ఒక కంట కనిపెడుతూ ఉండాలనే స్పృహ కలిగింది. నాజీల దుర్మార్గాలు నేడు జర్మన్ స్కూలు, కాలేజీల సిలబస్‌లలో భాగం అయ్యాయి. విద్యార్థులు, తమ ఉపాధ్యాయులతోబాటు కాన్సంట్రేషన్ క్యాంపులను సందర్శిస్తున్నారు. చరిత్ర నేర్పిన పాఠాలను శ్రద్ధగా నేర్చుకుంటున్నారు.

బలమైన పార్లమెంటరీ వ్యవస్థను కలిగి ఉన్న ఒక దేశం తప్పుదోవ పడితే, ప్రజాస్వామిక సంస్థలన్నీ ధ్వంసం అవుతాయి. తిరిగి సరైన మార్గాన్ని చేరుకోవడానికి సామాన్య ప్రజలు చాలా పెద్ద మూల్యం చెల్లించాల్సి ఉంటుందని జర్మనీ అనుభవం తెలియజేస్తున్నది. అందుకే, రెండే రెండు పదాలలో ఇమిడిన సందేశం ('నెవర్ ఎగైన్') దహావ్‌లో లిఖింపబడింది.

నాజీల చేతిలో బలైన నూరున్నిసా

దహావ్‌ను సందర్శించిన భారతీయులు ఎవరికైనా, ఇదే క్యాంప్‌లో నాజీలచే హత్యగావించబడిన, భారతీయ సంతతికి చెందిన వీరవనిత నూర్ ఇనాయత్ ఖాన్ (1914-1944)ని గుర్తు చేసుకోకుండా, ఆమెకు నివాళి అర్పించకుండా తిరిగి రావడం సరికాదు. నూరున్నిసా (పూర్తి పేరు) నేపథ్యం అసాధారణమైనది. ఆమె టిప్పుసుల్తాన్ వంశీకురాలు. ఆమె తండ్రి ఇనాయత్ ఖాన్ ప్రముఖ సూఫీ గురువు, సంగీతకారుడు. గుజరాత్ లోని బరోడాలో శాస్త్రీయ సంగీత కళాకారుల కుటుంబంలో జన్మించాడు. ఆమె తల్లి, ఇస్లాం మతాన్ని స్వీకరించిన అమెరికన్ మహిళ. తల్లిదండ్రులు రష్యాలో ఉన్నప్పుడు, నూర్ మాస్కోలో పుట్టింది. మొదటి ప్రపంచ యుద్ధపు సూచనలు పొడచూపగానే వారి కుటుంబం, ఇంగ్లాండుకి వలస వెళ్లింది. నూర్ విద్యాభ్యాసం అక్కడే మొదలైంది. మరి కొద్ది కాలంలోనే వారు పారిస్ శివార్లలో స్థిరపడ్డారు. నూర్ సోర్బోన్‌లో సైకాలజీ అభ్యసించింది. సంగీతం నేర్చుకుంది. ఆమె ఇంగ్లీషు, ఫ్రెంచి ధారాళంగా మాట్లాడగలిగేది. గాంధీజీ అహింసావాదం ఆమెను ఆకర్షించింది. ఆమె రచయిత్రి కావాలని అనుకున్నది. పిల్లల కోసం జాతక కథలను తిరగరాసి ప్రచురించింది. నాజీల ప్రాబల్యం పెరుగుతున్నప్పుడు, ఆమె తన సన్నిహితులతో 'మనం ఏదో ఒకటి చెయ్యాలి' అనేది. ఆ దశలోనే ఆమె జీవితం ఊహించని మలుపు తిరిగింది.

1940లో జర్మన్లు ఫ్రాన్సును ఆక్రమిస్తున్నప్పుడు నూర్ కుటుంబం ఇంగ్లాండు వెళ్లిపోయింది. ఆమెకున్న ఉభయ భాషా ప్రావీణ్యత బ్రిటిష్ సైనికాధికారుల దృష్టికి వచ్చింది. గూఢచారిగా ఆమె రాణిస్తుందని వారు భావించారు. స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌లో ఆమెకు తర్ఫీదు ఇచ్చారు. వైర్‌లెస్ టెలిగ్రఫీలో ఆమె ప్రతిభ వెల్లడైంది. మరి కొందరితో బాటు ఆమెను విమానం ద్వారా 1943 జూన్‌లో నాజీ ఆక్రమిత ఫ్రాన్సులో దించారు. నాజీలను ప్రతిఘటిస్తూన్న గెరిల్లాలకు సహాయపడడం, తద్వారా జర్మన్ సైన్యాలను నిర్వీర్యం చెయ్యడం వారి లక్ష్యం. లండన్ లోని ప్రధాన కార్యాలయంతో వైర్‌లెస్ ద్వారా సంబంధాలను కలిగి ఉండడం నూర్ బాధ్యత. ఆమె తన విధులను సక్రమంగా నిర్వహించింది. 1943 అక్టోబర్‌లో నూర్ పట్టుబడింది. కస్టడీలో ఆమెను తీవ్రమైన చిత్రహింసలకు గురిచేశారు. తప్పించుకోవడానికి మూడుసార్లు ప్రయత్నించి, దొరికిపోయింది. ఆమెపై 'అత్యంత ప్రమాదకరమైన ఖైదీ'గా ముద్ర వేశారు. సంకెళ్లు వేసి ఒంటరిగా ఉంచారు. దహావ్ క్యాంపుకి తరలించారు. మరో ఆరు నెలల్లో యుద్ధం ముగుస్తుందనగా, 1944 సెప్టెంబర్ 13న నూర్‌తోబాటు మరో ముగ్గురు మహిళా గూఢచారులను పిస్తోలుతో కాల్చి చంపారు. 1949లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమెకు జార్జ్ క్రాస్‌ని ప్రకటించింది.

/ ఇటీవల దహావ్ కాన్సంట్రేషన్ క్యాంప్‌ను సందర్శించిన సందర్భంగా రాసిన వ్యాసం /

ఉణుదుర్తి సుధాకర్ , సెల్: 9000601068

విద్యా దీవెన జమయ్యేదెప్పుడో..!

- బటన్ నొక్కి15 రోజులు గడిచినా ఖాతాల్లోకి రాని సొమ్ము
- ఫీజులు కట్టేందుకు తల్లిదండ్రులు నానావస్థలు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

విద్యార్థులకు అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విద్యాదీవెన సొమ్ము విద్యార్థులకు సకాలంలో అందడం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాల ఒత్తిడితో ఫీజులు చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నానావస్థలు పడుతున్నారు. విద్యాదీవెన సొమ్ముకు సంబంధించి ఆగస్టు 28వ తేదీన సిఎం చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన సభలో బటన్ నొక్కారు. ఇది జరిగి 15 రోజులు గడిచినా ఇప్పటికీ విద్యా దీవెన సొమ్ము జమ కాకపోవడంతో తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. విద్యాదీవెన పథకానికి విద్యార్థులు ఏలూరు జిల్లాలో 31,859 మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 31,188 మంది మొత్తం 63,867 మంది ఉన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ త్రైమాసికానికి సంబంధించిన విద్యాదీవెన సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. ఏలూరు జిల్లాలో రూ.25.37 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.25.53 కోట్లు మొత్తం రూ.50.90 కోట్లు సొమ్ము జమ కావాల్సి ఉంది. రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ సగం మంది విద్యార్థులకు సొమ్ము జమ కాలేదని తెలుస్తోంది. ఎంతమందికి జమైందో కూడా తెలియని అయోమయం నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము సకాలంలో జమ కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయాలకు వెళ్లి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే జమవుతాయంటూ సచివాలయ ఉద్యోగులు సర్దిచెప్పి పంపిస్తున్న పరిస్థితి ఉంది. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన సొమ్ము ప్రభుత్వం నేరుగా కాలేజీలకు చెల్లించేది. దీంతో ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాల మధ్యే ఈ వ్యవహారం సాగేది. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు సంబంధించి విద్యాదీవెన పథకం తెచ్చింది. విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు సొమ్మును నాలుగు విడతలుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. మొదట్లో సిఎం బటన్ నొక్కిన ఒకటి, రెండు రోజుల్లో విద్యాదీవెన సొమ్ము విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి చేరేవి. తల్లిదండ్రులు వెంటనే కాలేజీలకు చెల్లించేవారు. గడిచిన ఏడాదిగా విద్యాదీవెన సొమ్ముకు సంబంధించి సిఎం బటన్ నొక్కిన రోజులు, నెలలు తరబడి సొమ్ము జమ కావడం లేదు. విద్యాదీవెన సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది కాబట్టి వెంటనే చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. సొమ్ము జమ కాలేదని చెప్పినా విన్పించుకోవడం లేదు. తర్వాత జమవుతుంది, మీరు చెల్లించాలంటూ హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో సామాన్య కుటుంబాల పిల్లల ఫీజు కోసం నానావస్థలు పడుతున్నారు. విద్యాదీవెన ఒక్కటే కాదు, వసతిదీవెన సొమ్ము పరిస్థితి ఇదేవిధంగా మారింది. ఫీజు సొమ్ము సకాలంలో ప్రభుత్వం జమ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అమ్మఒడి సొమ్ము సైతం ఇదేవిధంగా జమ కాకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాదీవెన సొమ్ము ఎప్పటికి జమవుతుందో సరైన సమాధానం చెప్పేవారే లేకపోవడంతో తల్లిదండ్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విద్యాదీవెన సొమ్ము వెంటనే జమ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మహారాష్ట్రలో అన్నదాతల బలవన్మరణాలు

- మరట్వాడాలో 685 మంది ఆత్మహత్య
- వ్యవసాయ మంత్రి సొంత జిల్లాలోనే అత్యధికం

ఔరంగాబాద్ : ప్రభుత్వ గణాంకాల ప్రకారమే.. మహారాష్ట్రలోని మరట్వాడా ప్రాంతంలో ఈ ఏడాది జనవరి 1 నుంచి ఆగస్టు 31 వరకూ 685 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ధనంజయ్ ముండే సొంత జిల్లా అయిన బీడ్‌లో అత్యధికంగా 186 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మధ్య మహారాష్ట్రలో మరట్వాడా అత్యంత దుర్భిక్ష ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఔరంగాబాద్, జల్నా, బీడ్, పర్భాని, నాందేడ్, ఓస్మానాబాద్, హింగోలి, లాతూర్ జిల్లాలు ఉన్నాయి. బీడ్‌లో 186 మంది ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ముండే ఎన్‌సిపి నుంచి తిరుబాటు చేసి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలో చేరి, మంత్రి పదవి పొందారు. బీడ్ జిల్లా తరువాత ఓస్మానాబాద్‌లో 113 మంది, నాందేడ్‌లో 110, ఔరంగాబాద్‌లో 95 మంది, పర్భానిలోని 58 మంది, లాతూర్‌లో 51 మంది, జల్నాలో 50 మంది, హింగోలిలో 22 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

బ్రిటీష్ అకాడమీ బుక్ ప్రైజ్‌కు
ఇద్దరు భారత సంతతి రచయితలు

న్యూఢిల్లీ : బ్రిటీష్ అకాడమీ బుక్ ప్రైజ్‌కు భారతీయ సంతతికి చెందిన ఇద్దరు రచయితలు ఎంపికైనట్లు మంగళవారం జ్యూరీ పేర్కొంది. 'ప్రపంచ సాంస్కృతిక అవగాహన' కింద ఇచ్చే ఈ బహుమతి కింద 25,000 జిబిపి (బ్రిటన్ పౌండ్లు) అందించనున్నారు. బ్రిటన్‌కు చెందిన నందినీదాస్ రచించిన 'కోర్టింగ్ ఇండియా : ఇంగ్లాండ్, మొఘల్ ఇండియా అండ్ ది ఆరిజన్స్ ఆఫ్ ఎంపైర్' అమెరికాకు చెందిన క్రిస్ మంజప్రా రచించిన 'బ్లాక్ ఘోస్ట్ ఆఫ్ ఎంపైర్ : ది లాంగ్ డెత్ ఆఫ్ స్లేవరీ అండ్ ది ఫెయిల్యూర్ ఆఫ్ ఎమాన్సిపేషన్' రచనలను ఈ బహుమతి కోసం ఎంపిక చేశారు.

నందినీదాస్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో ఇంగ్లీష్ ఫ్యాకల్టీలో ఎర్లీ మోడరన్ లిటరేచర్ ఆఫ్ కల్చర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్శిటీలో చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లారు.

మంజప్రా మసాచుసెట్స్‌లోని యూనివర్శిటీలో హిస్టరీ అండ్ గ్లోబల్ స్టడీస్ స్టెర్న్స్ ట్రస్టీ ప్రొఫెసర్‌గా ఉన్నారు. అసాధారణ రచనా శైలి మరియు చరిత్రలోని పలు అంశాలపై కొత్త దృక్కోణాలను వెలికితీసిన రచయితల సామర్థ్యం తనని బాగా ఆకట్టుకున్నాయని 2023 జ్యూరీ అధ్యక్షులు, బ్రిటీష్ అకాడమీ సభ్యులు, ప్రొఫెసర్ చార్లెస్ ట్రిప్ పేర్కొన్నారు.

ముంబయిలో కదం తొక్కిన మహిళలు

ముంబయి: ఆహార భద్రత, రేషన్ వ్యవస్థకు చెందిన వివిధ డిమాండ్ల సాధన కోసం ముంబయిలో వేలాది మంది మహిళలు ఐద్వా నేతృత్వంలో కదం తొక్కారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పికె శ్రీమతి, మరియం ధవాలే ప్రసంగించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి ప్రాచి హతివేలార్ కూడా పాల్గొన్నారు. అలాగే ఈ సమావేశంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందకరత్, ఐద్వా ఉపాధ్యక్షురాలు, పొలిట్ బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ కూడా ప్రసంగించారు. ఈ సమావేశం అనంతరం మహారాష్ట్ర పౌర సరఫరాల మంత్రి చౌగన్ బుజ్‌బాల్‌కు తమ డిమాండ్లపై వినతి పత్రాన్ని ఐద్వా ప్రతినిధులు అందచేశారు.

IN THE COURT OF THE HON'BLE XXVI ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD

M.V.O.P. NO. 968 OF 2021

BETWEEN:

Smt. K.Chandrakala and others .... Petitioner

And

Shaik Mahammed and others ....Respondents

RESPONDENT NO. 1 and 3

1 Shaik Mahammad W/o. Mastan Vali, aged Major, Occ: Driver of lorry AP.16TE.5075, R/o.H.No.4-36,Andra Bank Road, Edupugallu, Kankipadu, Krishna-Dist - 521151. AP **R-1**

2.T.Nagaraju,S/o.Shankara Rao, Aged about 40 years Occ: Driver, R/o. H.No. 8-12-135,8th Line, Nehru Nagar,Guntur - 522001. AP. **R-3**

.... **Respondent No. 1 and 3**

COURT NOTICE

Please take notice that the Petitioners above named has filed the M.V.OP. **No.** 968 of 2021 for claim petition for compensation under M.V Act, against the Respondents herein , the petitioner sent the notice to respondent no 1 and 3 several occasion but not yet received the notice,because this Hon'ble court directed the petitioner to public in the news paper. The above case is posted on 10-10-2023 for your appearance in person or through advocate at 10:30 A.M. before the Hon'ble Court XXVI Additional Chief Judge, city civil court at Hyderabad on 06-09-2023 failing which the matter will be decided in your absence as per law.

(By order of the Hon'ble Court)

N.PANDAIAH

ADVOCATE

H.No.1-8-732/16,1st Foor,Bhagyanagar Jr.College Building, Vegetable Market Road,Nallakunta, Hyderabad

ఆలయంలో ఆయుధ శిక్షణ వద్దు

కేరళ హైకోర్టు తీర్పు

తిరువనంతపురం : తిరువనంతపురంలోని సర్కారా దేవి ఆలయంలో ఆయుధ శిక్షణకు అనుమతి లేదని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. తన ఆదేశాల అమలులో ఆలయ బాధ్యతలు చూస్తున్న ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు అవసరమైన సాయం అందించాలని పోలీసులను ఆదేశించింది. ఆలయంలో ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విన్యాసాలు, ఆయుధ శిక్షణ జరుగుతున్నాయంటూ ఇద్దరు భక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు అనిల్ కె నరేంద్రన్, పీజీ అజిత్ కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కేరళలో తన యాజమాన్యంలో నడుస్తున్న దేవాలయాలలో ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ ఆయుధ శిక్షణ ఇవ్వడాన్ని నిషేధిస్తూ 2016 లోనే ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సర్క్యులర్ జారీ చేసింది. దేవాలయం ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పొగాకు ఉత్పత్తులను వినియోగించడంతో వెలువడే దుర్వాసనతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. విన్యాసాలలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పెద్ద శబ్దంతో నినాదాలు చేయడం వల్ల ప్రశాంతతకు భంగం వాటిల్లుతోందని కూడా తెలిపారు.

యుసిసికి వ్యతిరేకంగా తీర్మానించనున్న నాగాలాండ్

కోహిమా : ఏక రూప పౌరస్మృతి (యుసిసి)ని నాగాలాండ్‌లోని అన్ని పార్టీలూ వ్యతిరేకించాయి. దీనిపై శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించాలని నిర్ణయించాయి. నాగా పీపుల్స్ ఫ్రంట్‌కు చెందిన కుజోలిజో నైనూ శాసనసభలో సోమవారం దీనిపై చర్చను ప్రారంభించారు. భిన్న సంప్రదాయాలు, సంస్కృతులకు నెలవైన భారతదేశంలో ఇలాంటి చట్టాన్ని తీసుకురావడం నిష్ప్రయోజనమని, పైగా అది ప్రతికూల ఫలితాన్ని ఇస్తుందని తెలిపారు. ఒకవేళ పార్లమెంటు యుసిసిని ఆమోదిస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 (ఎ) కింద నాగాలాండ్‌కు మినహాయింపు లభిస్తుందని ఆయన గుర్తు చేశారు.

పిరమాల్ క్యాపిటల్ మరియు హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

(గతంలో దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది)

జాతీయ కార్యాలయం: పిసిహెచ్‌ఎఫ్‌ఎల్, హెచ్‌డిఐఎల్ టవర్స్, బి-వింగ్ 6వ అంతస్తు అనంత్ కనెకర్ మార్గ్, బాంద్ర (తూర్పు), ముంబాయి-400051
శాఖా కార్యాలయం : డో.నం.4-18-29, 1వ అంతస్తు, పి.నం.1 మరియు 2, చంద్రమౌళీనగర్, కొరిటెపాడు గ్రామం, రింగ్ రోడ్డు వద్ద, గుంటూరు, మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు-522007, ఆంధ్రప్రదేశ్.

అనుబంధం IV - రూల్ 8(1) స్వాధీనతా నోటీసు

ఏదైతే, పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గతంలో దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడినది., దీని నమోదిత కార్యాలయం : "యూనిట్ సం.601, 6వ అంతస్తు, అమితి భవనం, అగస్య కార్పొరేట్ పార్క్, కామిని అధికారపరిధి, ఫైర్ స్టేషన్ ఎదురు, ఎల్‌బిఎస్ మార్గ్, కుర్లా (పశ్చిమం), ముంబై-400070, ఇతర ప్రదేశాలలో ఉన్న దీని శాఖా కార్యాలయం: డో.నం.4-18-29, 1వ అంతస్తు, పి.నం.1 మరియు 2, చంద్రమౌళీనగర్, కొరిటెపాడు గ్రామం, రింగ్ రోడ్డు వద్ద, గుంటూరు, మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు-522007, ఆంధ్రప్రదేశ్, యొక్క ఆధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2022 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద తేది 28.07.2021న డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది. శ్రీరామచంద్ర ఇన్‌ఫ్రాటెక్ పై సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) ప్రకారం పిలువబడిన రుణగ్రహీత/సహ దరఖాస్తుదారు/హామీదారులు/ తనఖాదారులు : శ్రీ.రవిచంద్ర ఇన్‌ఫ్రాటెక్ (రుణగ్రహీత), శ్రీ.శ్రీనివాసరావు మంచికలపూడి, శ్రీమతి. మంచికలపూడి రజని, శ్రీమతి. నందిపాటి రమాదేవి, శ్రీ.రవికుమార్ ఆలప్తి, శ్రీ.గోపాల కృష్ణ ఆలప్తి, నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి ఉన్న రూ.7,41,40,683/- (ఏడు కోట్ల నలభై ఒక లక్షల నలభై వేల ఆరు వందల ఎనభై మూడు రూపాయలు మాత్రమే) 16.07.2021 నాటికి పేర్కొన్న నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా మొత్తాన్ని చెల్లించవలెనని కోరడమైనది.

రుణగ్రహీత(లు)/హామీదారులు/తనఖాదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 3 యొక్క రూల్ 8తో చదువుతూ పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ ఆధీకృత అధికారి దిగువ వివరించిన ఆస్తిని 07-సెప్టెంబర్-2023న స్వాధీనపరచుకోవడమైనది.

ప్రత్యేకించి రుణగ్రహీతలు/హామీదారులు/తనఖాదారులకు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరిపే లావాదేవీలు పిసిహెచ్‌ఎఫ్‌ఎల్ కు రూ.7,41,40,683/- (ఏడు కోట్ల నలభై ఒక లక్షల నలభై వేల ఆరు వందల ఎనభై మూడు రూపాయలు మాత్రమే) 16.07.2021 నాటికి తదుపరి వడ్డీ తో కలిపి ఖర్చులు మరియు ఇతర పరిణామాలు, నష్టపరిహారం మొదలైన వాటితో పాటు పేర్కొన్న స్వాధీనం మరియు దాని అమ్మకం కొరకు ఖర్చులు.

సెక్యూర్డ్ ఆస్తులను రక్షించుకొనుటకు అందుబాటులో ఉన్న సమయాన్ని బట్టి, సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నిబంధనలకు రుణగ్రహీత యొక్క దృష్టిని ఆహ్వానించబడుతుంది.

సర్ఫేసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(8) నిబంధనలు క్రింది విధంగా :

సెక్యూర్డ్ అసెట్స్ యొక్క అమ్మకం లేదా అప్పగింత, లీజు మార్గం ద్వారా బదిలీ కొరకు ప్రైవేట్ ఒప్పందం లేదా పబ్లిక్ నుండి టెండర్ లేదా కొటేషన్స్ ఆహ్వానం లేదా పబ్లిక్ వేలం కొరకు ప్రచురణ నోటీసు తేది ముందు ఏ సమయంలోనైనా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు అతని బకాయిల మొత్తంతో పాటు సెక్యూర్డ్ క్రెడిటార్ చేసిన అన్నీ ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులు టెండర్ చేయబడతాయి.

సెక్యూర్డ్ అసెట్స్ సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా లీజు, కేటాయింపు లేదా అమ్మకం ద్వారా బదిలీ చేయబడవు; మరియు 2) ఒకవేళ, ఈ సబ్ సెక్షన్ కింద అటువంటి మొత్తాన్ని టెండర్ చేయడానికి ముందు, లీజు లేదా అసైన్‌మెంట్ లేదా ఆస్తుల విక్రయం ద్వారా బదిలీ చేయడానికి సురక్షిత రుణదాత ఏదైనా చర్య తీసుకున్నట్లయితే, అటువంటి సురక్షిత ఆస్తులను లీజు లేదా అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ చేయడం కోసం అటువంటి సురక్షిత రుణదాత తదుపరి చర్యలు తీసుకోరు.

స్థిరాస్తి వివరణ : గుంటూరు జిల్లా, గుంటూరు గ్రామం మరియు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (జిఎమ్‌సి) పరిధిలోని గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ స్థలం బేరింగ్ సర్వే డో.నం.568/1ఎ, 578/1ఎ, 579 మరియు 567/ఎ, మొత్తం కొలిచే 18103 చ.గ.లు. అనగా.., 15136.414 చ.మీ.లు. తో కలిపి రుణగ్రహీతలు డెవలప్‌మెంట్ హక్కులు మరియు "తిరుమల గార్డెన్స్" ప్రాజెక్టులో అమ్మకం జరగని/బుక్డ్ యూనిట్స్/ఫ్లాట్ల రుణగ్రహీతలు మరియు సహ రుణగ్రహీతల వాటా తో పాటు ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణం మరియు స్థలంలో దీని సంబంధిత అవిభక్త వాటా (అనుబంధం 1 మరియు 2లో మరింత ముఖ్యంగా వివరించబడ్డాయి) మరియు "తిరుమల గార్డెన్స్" ప్రాజెక్టులో దానిపై ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణంతో పాటు జివిఎంసి తో ఆ యూనిట్లు/తనఖా పెట్టబడిన ఫ్లాట్లపై రెండవ ఛార్జ్ (అనుబంధం-3లో మరింత ముఖ్యంగా వివరించబడ్డాయి) తూర్పు: టి.లక్ష్మీనారాయణ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, ఉత్తరం: బి.వెంకట సుబ్బయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, మరలా తూర్పు: 40 అ.లు. రోడ్డు మరియు తోట వెంకటేశ్వర్లుకు చెందిన ఆస్తి, దక్షిణం : తోట సాంబయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, మరలా తూర్పు: తోట సాంబయ్య మరియు ఇతరులకు చెందిన ఆస్తి, మరలా దక్షిణం: తోట వెంకటేశ్వరరావుకు చెందిన ఆస్తి, పడమర: తోలుసూరి సదాశివరావు, తలారి రాముకు చెందిన ఆస్తి మరియు మిగిలినది : మంచికలపూడి శ్రీనివాసరావు ఆస్తి, మరలా ఉత్తరం: గుడి రాంప్రసాద్ మరియు ఇతరులకు చెందిన ఆస్తి, మరలా పడమర: అత్తోట చలపతిరావుకు చెందిన ఆస్తి, మరలా ఉత్తరం: అత్తోట శ్రీదేవికి చెందిన ఆస్తి. పై సరిహద్దులు మరియు సైట్ పరిధిలో 18103 చ.గ.లు. లేదా 15136.414 చ.మీ.లు. మరియు పిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు తనఖా ఉన్న ప్రతిపాదిత ఫ్లింత్ ఏరియా 412830 చ.అ.లు.

అనుబంధం-1
"తిరుమల గార్డెన్స్" ప్రాజెక్ట్‌లో పిసిహెచ్‌ఎఫ్‌ఎల్ తో తనఖా ఉన్న అమ్మబడని యూనిట్ల జాబితా

క్ర. సం	భవనం	ఫ్లాట్ నం	విక్రయించదగిన ఏరియా	బిల్ట్-అప్-ఏరియా (చ.అ.లు.లో)	యుడిఎస్ (చ.అ.లు.లో)
1	వృషభాద్రి	107	1200	923	457
2	వృషభాద్రి	112	1200	923	457
3	వృషభాద్రి	116	1200	923	457
4	వృషభాద్రి	405	1200	923	457
5	వృషభాద్రి	414	1200	923	457
6	వృషభాద్రి	415	1200	923	457
7	వృషభాద్రి	416	1200	923	457
8	వృషభాద్రి	509	1200	923	457
9	వృషభాద్రి	510	1150	885	446
10	వృషభాద్రి	511	1150	885	446
11	వృషభాద్రి	514	1200	923	457
12	వృషభాద్రి	517	1200	923	457
13	వృషభాద్రి	518	1200	923	457
14	వృషభాద్రి	520	1200	923	457
15	అంజనాద్రి	106	1120	862	425
16	అంజనాద్రి	107	1117	859	425
17	అంజనాద్రి	109	1117	859	425
18	అంజనాద్రి	110	1117	859	425
19	అంజనాద్రి	207	1117	859	425
20	అంజనాద్రి	209	1117	859	425
21	అంజనాద్రి	304	1117	859	425
22	అంజనాద్రి	507	1117	859	425
23	అంజనాద్రి	508	1117	859	425
24	అంజనాద్రి	509	1117	859	425
25	అంజనాద్రి	510	1117	859	425
26	నీలాద్రి	408	1290	992	491
27	నీలాద్రి	506	1290	992	491
28	నీలాద్రి	507	1290	992	491
29	గరుడాద్రి	301	1190	915	455
30	గరుడాద్రి	503	1190	915	455
31	శేషాద్రి	104	1045	804	398
32	శేషాద్రి	206	1045	804	398
33	శేషాద్రి	308	1045	804	398
34	శేషాద్రి	405	1045	804	398
35	వెంకటాద్రి	208	1054	811	401
36	వెంకటాద్రి	509	1054	811	401
37	శ్రీ.వెంకటేశ్వర	301	1500	1,154	572
38	వృషభాద్రి	417	1200	923	457
39	వృషభాద్రి	418	1200	923	457
40	వృషభాద్రి	501	1200	923	457
41	వృషభాద్రి	502	1200	923	457
42	వృషభాద్రి	504	1200	923	457
43	వృషభాద్రి	506	1200	923	457
44	వృషభాద్రి	515	1200	923	457
45	వృషభాద్రి	519	1200	923	457
46	అంజనాద్రి	210	1117	859	425
47	అంజనాద్రి	504	1117	859	425
48	అంజనాద్రి	506	1120	862	425
49	గరుడాద్రి	401	1190	915	455
50	గరుడాద్రి	506	1190	915	455
51	శేషాద్రి	503	1045	804	398
52	శేషాద్రి	504	1045	804	398
53	శేషాద్రి	506	1045	804	398
54	శేషాద్రి	507	1045	804	398
55	శేషాద్రి	508	1045	804	398
56	నారాయణాద్రి	504	1564	1,203	594
57	వెంకటాద్రి	504	1054	811	401
58	వెంకటాద్రి	510	1054	811	401
	మొత్తం		67259	51735	25627

అనుబంధం-2
"తిరుమల గార్డెన్స్" (తనఖాకు ఉన్న) ప్రాజెక్ట్‌లో బుక్ చేయబడిన కానీ నమోదు చేయబడని జాబితా

క్ర. సం	భవనం	ఫ్లాట్ నం	విక్రయించదగిన ఏరియా	బిల్ట్-అప్-ఏరియా (చ.అ.లు.లో)	యుడిఎస్ (చ.అ.లు.లో)
1	వృషభాద్రి	108	1200	923	457
2	వృషభాద్రి	401	1200	923	457
3	వృషభాద్రి	411	1150	885	446
4	అంజనాద్రి	101	1117	859	425
5	అంజనాద్రి	103	1117	859	425
6	అంజనాద్రి	105	1120	862	425
7	అంజనాద్రి	201	1117	859	425
8	అంజనాద్రి	208	1117	859	425
9	అంజనాద్రి	305	1120	862	425
10	అంజనాద్రి	308	1117	859	425
11	అంజనాద్రి	309	1117	859	425
12	అంజనాద్రి	310	1117	859	425
13	అంజనాద్రి	404	1117	859	425
14	నీలాద్రి	102	1290	862	491
15	నీలాద్రి	106	1290	862	491
16	నీలాద్రి	203	1290	862	491
17	నీలాద్రి	302	1290	862	491
18	నీలాద్రి	304	1290	992	491
19	నీలాద్రి	306	1290	992	491
20	నీలాద్రి	402	1290	992	491
21	నీలాద్రి	404	1290	992	491
22	గరుడాద్రి	202	1190	915	455
23	గరుడాద్రి	205	1190	915	455
24	గరుడాద్రి	208	1190	915	455
25	గరుడాద్రి	303	1190	915	455
26	గరుడాద్రి	402	1190	915	455
27	గరుడాద్రి	405	1190	915	455
28	గరుడాద్రి	408	1190	915	455
29	శేషాద్రి	108	1045	804	398
30	శేషాద్రి	201	1045	804	298
31	శేషాద్రి	204	1045	804	398
32	శేషాద్రి	302	1045	804	398
33	శేషాద్రి	307	1045	804	398
34	శేషాద్రి	408	1045	804	398
35	నారాయణాద్రి	101	1178	906	450
36	నారాయణాద్రి	102	1178	906	450
37	నారాయణాద్రి	103	1564	1,203	594
38	నారాయణాద్రి	201	1178	906	450
39	నారాయణాద్రి	206	1178	906	450
40	నారాయణాద్రి	301	1178	906	450
41	నారాయణాద్రి	304	1564	1,203	594
42	నారాయణాద్రి	306	1178	906	450
43	నారాయణాద్రి	401	1178	906	450
44	నారాయణాద్రి	403	1564	1,203	594
45	నారాయణాద్రి	404	1564	1,203	594
46	వెంకటాద్రి	104	1054	811	401
47	వెంకటాద్రి	107	1054	811	401
48	వెంకటాద్రి	204	1054	811	401
49	వెంకటాద్రి	308	1054	811	401
50	వెంకటాద్రి	405	1054	811	401
51	వెంకటాద్రి	408	1054	811	401
52	వెంకటాద్రి	507	1054	811	401
53	వెంకటాద్రి	508	1054	811	401
54	వెంకటాద్రి	101	1500	1,154	572
55	వెంకటాద్రి	401	1500	1,154	572
56	వృషభాద్రి	412	1200	923	457
57	అంజనాద్రి	407	1117	859	425
58	గరుడాద్రి	105	1190	915	455
59	గరుడాద్రి	107	1190	915	455
60	గరుడాద్రి	307	1190	915	455
1	మెసెర్స్. కెఎస్‌జె ఇమిటేషన్ జ్యూవెలరీ, దీని ప్రొప్రైటర్ : షేక్ ఖలీల్ ద్వారా ప్రాతినిధ్యం, డో.నం.3/5, పోతెపల్లి, ఎమ్ఐజె పార్క్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521002. 2. షేక్ ఖలీల్, తండ్రి. దావుద్ షేక్, డో.నం.3/90-1, వర్రెగూడెమ్, చెంపచెరువు, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521001. ఇక్కడ కూడా, షేక్ ఖలీల్, తండ్రి. దావుద్ షేక్, డో.నం.14/176/5-3, బైపాస్ రోడ్డు, పంబలగూడెం, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521001. 3. హసీనా షేక్, భర్త. షేక్ ఖలీల్, డో.నం. 3/90-1, వర్రెగూడెమ్, చెంపచెరువు, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521001. ఇక్కడ కూడా: హసీనా షేక్, భర్త. ఖలీల్ షేక్, డో.నం.14/176/5-3, బైపాస్ రోడ్డు, పండలగూడెం, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-521001. 4. షేక్ ఖాజా, తండ్రి. షేక్ ఖలీల్, డో.నం.3/90-1, వర్రెగూడెమ్, చెంపచెరువు, మచిలీపట్నం, కృష్ణా జిల్లా, **ఆంధ్రప్రదేశ్-521001.** **రుణ ఖాతా సంఖ్య: 921060054709427** **డిమాండ్ నోటీసు తేదీ: 18-08-2023** **ఎన్‌పిఎ తేదీ: 01-05-2023**	ఒప్పందం ముగియగానే చెల్లించాల్సిన మొత్తం (ఈ మొత్తం లో వడ్డీతో పాటు 31-07-2023 వరకు జరిమానా చార్జీలు 31-07-2023 నాటికి రూ 37,92,817.50/- (ముప్పై ఏడు లక్షాల తొంబై రేండు వేల మూడు ఎనిమిది వందల పదిహేడు రూపాయల యాభై పైసలు మాత్రమే)	ఆస్తి-1: డాక్.నం.2104/2020 క్రింద కవర్‌చేయబడిన (విస్తీర్ణం 116.40 చ.గ.లు.) : కృష్ణా జిల్లా, మచిలీపట్నం, సబ్-రిజిస్ట్రార్ యొక్క అధికారపరిధి తో పాటు దేశాయిపేట (వర్రెగూడెం) మచిలీపట్నం టౌన్ వద్ద ఉన్న మూల్యాంకనం నం. 1070006051, ప్లాట్ నం. 1, డో.నం. 3/90-1, ఆర్‌సిసి రూఫ్డ్ బిల్డింగ్ ప్లాట్ నం.1 తో కలిసిన సైట్ విస్తీర్ణం 116.40 చ.గ.లు లేదా 97.19 చ.మీ.లు. హద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ఉమ్మడి మార్గం, పడమర: షేక్ ఖాజి ఆస్తి, ఉత్తరం: టి రామ నరసింహారావు ఆస్తి. పై సరిహద్దుల సైట్ విస్తీర్ణం 116.40 చ.గ.లు. లేదా 97.19 చ.మీ.లు.తో పాటు ఆర్‌సిసి భవనంతో నీటి మార్గం మరియు అన్నీ సౌలభ్య హక్కులు. ఆస్తి-2: డాక్యుమెంట్ నం.2105/2020 క్రింద కవర్ చేయబడింది (విస్తీర్ణం 116.25 చ.గ.లు కొరకు): కృష్ణా జిల్లా, మచిలీపట్నం, సబ్-రిజిస్ట్రార్ యొక్క అధికారపరిధి తోపాటు దేశాయిపేట (వర్రెగూడె) మచిలీపట్నం టౌన్ వద్ద ఉన్న మూల్యాంకనం నం. 1070006051, ప్లాట్ నం. 1, డో.నం. 3/90-1, ఆర్‌సిసి రూఫ్డ్ బిల్డింగ్ ప్లాట్ నం.1 తో కలిసిన సైట్ విస్తీర్ణం 116.25 చ.గ.లు లేదా 97.19 చ.మీ.లు. హద్దులు: తూర్పు: షేక్ హసీన ఆస్తి, దక్షిణం: ఉమ్మడి మార్గం, పడమర: టి రామ నరసింహారావు ఆస్తి, ఉత్తరం: టి.రామ నరసింహారావు ఆస్తి. పై సరిహద్దుల సైట్ విస్తీర్ణం 116.25 చ.గ.లు. లేదా 97.00 చ.మీ.లు. తో పాటు ఆర్‌సిసి భవనంతో నీటి మార్గాలు మరియు అన్నీ సౌలభ్య హక్కులు.
2	1. మెసర్స్ సాయి శ్రావణి రైస్ ఇండస్ట్రీస్, దీని ప్రొప్రైటర్, సాని శెట్టి వెంకట సుబ్రమణ్యం ద్వారా ప్రాతినిధ్యం, డో.నం.3-137, మెయిన్ రోడ్డు, తిమ్మయ్య పాలెం, సబ్ స్టేషన్ వద్ద, వినుకొండ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522647, 2. శ్రీ సానిశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం, తండ్రి. సానిశెట్టి లక్ష్మీనారాయణ, డో.నం. 27-36, లాయర్స్ వీధి, కొత్తపేట, వినుకొండ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522647. 3. శ్రీ సాని శెట్టి సాయిలక్ష్మి, భర్త. సాని శెట్టి లక్ష్మీనారాయణ, డో.నం. 27-36, లావ్యర్స్ వీధి, కొత్తపేట, వినుకొండ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522647 **లోన్ ఖాతా నం: 918030048072365 మరియు 920060050014555** **డిమాండ్ నోటీసు తేదీ: 18-08-2023** **ఎన్‌పిఎ తేదీ: 29-06-2023**	ఒప్పందం ముగియగానే చెల్లించాల్సిన మొత్తం (ఈ మొత్తం లో వడ్డీతో పాటు 31-07-2023 వరకు జరిమానా చార్జీలు 31-07-2023 నాటికి రూ 52,86,966.45/- (యాభై రెండు లక్షాల ఎనభై ఆరు వేల మూడు తొమ్మిది వందల అరవై ఆరు రూపాయల నలభై ఐదు పైసలు మాత్రమే)	గుంటూరు జిల్లా, నరసారావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ సబ్ జిల్లా, వినుకొండ మున్సిపాలిటి, వినుకొండ గ్రామం, కొత్తపేట, లావ్యర్స్ వీధి, డో.నం. 376/2, డో.నం. 2-16, కొత్త డో.నం. 27-35, రెసిడెన్షియల్ బిల్డింగ్ యొక్క 1వ అంతస్తు మరియు ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ విస్తీర్ణం 113 చ.గ.లు లో పశ్చిమ వైపు సైట్ కవర్ చేయబడుతుంది. హద్దులు: తూర్పు: పోతూరు రమేష్ బాబు ఆస్తి -65-00 అ.లు, పడమర: కొత్తమాసు పెద్దరాములు ఆస్తి-65-00 అ.లు, ఉత్తరం: మున్సిపల్ సిమెంట్ రోడ్డు-15-8 1/4 అ.లు, దక్షిణం: సాయిబాబు గుడి ఆస్తి కి చెందిన గోడ-15.7 అ.లు. ఈ సరిహద్దుల కవరింగ్ సైట్ పరిధిలో 113 చ.గ.లు. లేదా 94.47 చ.మీ.లు. తో పాటు రెసిడెన్షియల్ భవనం గ్రౌండ్ మరియు ఒకటవ అంతస్తులతో దానిపై ఇప్పటికే ఉన్న నిర్మాణాలు.

పైన పేర్కొన్న వ్యక్తులైన మీరు చట్టం యొక్క విభాగము 13(2) క్రింద ఈ నోటీసులోని నియమాలలో పై పేర్కొన్నట్లుగా తదుపరి వడ్డీ మరియు ఇన్సిడెన్షియల్ ఖర్చులు, ఖర్చులతో పాటు మీరు పైన పేర్కొనిన మొత్తంను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలం చెందినచో, SARFAESI చట్టం యొక్క విభాగము 13(4) క్రింద వివరించిన అన్ని హక్కుల ద్వారా బ్యాంకు తదుపరి చర్యలు తీసుకొనును. SARFAESI చట్టం క్రింద ఏదేని అవసరమైన సదరు ఇతర చర్యలు లేదా చట్టపరమైన ప్రక్రియలు ఇతర చర్యలు ప్రారంభించుటకు బ్యాంకు అధికారులతో ఈ నోటీసు ఇవ్వడమైనది.

తేది.13.09.2023, ప్రదేశం : విజయవాడ — అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

గోగూండా మోనూ మానేసర్ అరెస్ట్ : హర్యానా పోలీసులు

న్యూఢిల్లీ : ఇటీవల నుహ్‌లో మత ఘర్షణలకు పాల్పడిన గోగూండా మోనూ మానేసర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు హర్యానా పోలీసులు తెలిపారు. బజరంగ్ దళ్ కార్యకర్త అయిన మానేసర్ రాజస్తాన్‌లో ఇద్దరు ముస్లిం యువకుల హత్య కేసులో కూడా కీలక నిందితుడిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మానేసర్‌ను సమాచార సాంకేతిక చట్టం (ఐటి యాక్ట్) లోని బెయిలబుల్ సెక్షన్స్ కింద మంగళవారం అరెస్ట్ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సాయంత్రంలోగా అతనికి బెయిల్ లభించే అవకాశం ఉందని, జంటహత్యల కేసులో రాజస్తాన్ పోలీసులు అదుపులోకి తీసుకుంటారని ఆ వర్గాలు తెలిపాయి. మోనూ మానేసర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు హర్యానా పోలీసులు సమాచారమిచ్చారని, వారి చట్టపరమైన ప్రక్రియ పూర్తి కాగానే, తాము నిందితుని అరెస్ట్ చేస్తామని రాజస్తాన్ పోలీసులు తెలిపారు. ఈ ఏడాది జులైలో హర్యానాలోని నుహ్‌లో జరిగిన మత ఘర్షణల్లో సుమారు ఆరుగురు మరణించిన సంగతి తెలిసిందే. జులై 31న నుహ్‌లో విశ్వహిందూ పరిషత్ చేపట్టిన బ్రిజ్ మండల్ జలాభిషేక్ యాత్రపై బజరంగ్ దళ్ రాళ్లు రువ్వడంతో గురుగ్రామ్ సహా పలు ప్రాంతాలకు మత ఘర్షణలు వ్యాపించాయి. రాజస్తాన్‌లోని భరత్‌పూర్ జిల్లాకి చెందిన జునైద్ (35), నాసిర్ (25)లను అక్రమంగా ఆవులను తరలిస్తున్నారంటూ గోగూండాలు ఫిబ్రవరి 15న అడ్డుకున్నారు. మరుసటి రోజు హర్యానాలోని బివానీలో నిప్పంటించిన కారులో వారిద్దరి మృతదేహాలను గుర్తించారు. ఈ రెండు కేసుల్లోనూ మోనూ మానేసర్ ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు.

జి 20 సదస్సు ప్రచార ఆర్భాటమే...

- ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపలేకపోయింది
- ప్రపంచనేతగా చెప్పుకునేందుకు మోడీ తాపత్రయం
- సమస్యల పరిష్కారానికి నిర్థిష్ట కార్యాచరణ కరువు
- భారత్ ద్వారా వర్థమాన దేశాల కట్టడికి అమెరికా కుట్ర
- ఎస్‌వికె వెబినార్‌లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్

ఆర్.అరుణ్‌కుమార్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో రూ.4,100 కోట్లు ఖర్చు చేసి అట్టహాసంగా నిర్వహించిన జి-20 సదస్సు ప్రచారార్భాటం తప్ప ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపలేకపోయిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ స్థాయి నాయకుడిగా ప్రధాని మోడీ తనకు తానుగా చెప్పుకునేలా ఈ సదస్సు ఏర్పాట్లు, నిర్వహణ ఉందని పేర్కొన్నారు. సదస్సుకు ఆతిధ్యం ఇచ్చిన ఢిల్లీలో అడుగడుగునా మోడీ కనిపిస్తున్నారని, కానీ వాస్తవ పరిస్థితులను కనపడకుండా చేశారని విదేశీ మీడియాలో కథనాలు వచ్చాయని గుర్తు చేశారు. 'జి-20 సమావేశం సాధించిందేమిటి?' అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వెబినార్‌లో అరుణ్‌కుమార్ మాట్లాడారు. జి-20 సదస్సు ఉమ్మడి ప్రకటనపై ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సందర్భంలో ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన భారత ప్రధాని మోడీ తొలిరోజే దీన్ని ప్రకటించి సమావేశాన్ని నీరుగార్చారన్నారు. గతేడాది ఇండోనేషియాలో జరిగిన జి-20 సదస్సు డిక్లరేషన్‌కు భిన్నంగా ఈసారి ప్రకటన రావడం వెనక అమెరికా ఒత్తిడి ఉందని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై తీసుకున్న వైఖరిని సౌదీ అరేబియా, కెనడా, నెదర్లాండ్, జపాన్, అనేక దేశాలు తప్పుబట్టాయని గుర్తు చేశారు. ఉక్రెయిన్ బలహీనపడుతోందని తెలిసి ఆ దేశానికి సహాయం చేస్తున్న దేశాల ప్రజల్లో కూడా అసహనం పెరుగుతోందని, అందుకనే ఆయా దేశాల్లో ఎద్ద ఎత్తున ప్రదర్శనలు జరుగుతున్నాయని వివరించారు. ఇప్పటికిప్పుడు ఉక్రెయిన్ ఓటమిని అంగీకరిస్తే అమెరికా సామ్రాజ్యవాదానికి ముప్పు వాటిల్లుతుందని, అందులో నుంచి క్రమంగా బైటపడేందుకు ఆ దేశం అన్వేషిస్తోందని తెలిపారు. ఉక్రెయిన్ విషయంలో పశ్చిమ దేశాల వైఖరిలో కూడా మార్పు వస్తోందన్నారు. రష్యా, చైనా దేశాల మిత్రత్వం బలంగా మారడంతోపాటు ఈ రెండు దేశాలకూ ప్రపంచ దేశాలు మద్దతుగా నిలబడడాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోతోందని తెలిపారు. రష్యా యుద్ధం సాకుగా చూపి ఇతర దేశాలను తమవైపు తిప్పుకోవాలనుకున్న అమెరికా పన్నాగం పారలేదన్నారు. అమెరికాకు మద్దతిచ్చే దేశాల సంఖ్య తగ్గుతోందని తెలిపారు. చైనాను కట్టడి చేసేందుకు తీసుకున్న విధానాల పట్ల అమెరికాపై వ్యతిరేకత తీవ్రంగా పెరుగుతోందని వివరించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు అమెరికా నుంచి వేరుపడి రష్యా, చైనా వైపు వెళితే సామ్రాజ్యవాదానికి పెనుముప్పు వాటిల్లుతుందని భావించి... భారత్‌ను ముందుపెట్టి అభివృద్ధి చెందుతున్న దేశాలను తమ ఆధీనంలో ఉంచుకోవాలని అమెరికా కుట్ర చేస్తోందని విమర్శించారు. అందుకే ఉక్రెయిన్ విషయంలో అమెరికా కాస్త వెనక్కి తగ్గిందన్నారు. రష్యా, చైనా దేశాలు ప్రధాన భాగస్వామిగా ఏర్పడిన బ్రిక్స్... ప్రధాన వాణిజ్య కూటమిగా అవతరించడం అమెరికాకు మింగుడుపడటం లేదని తెలిపారు. దీన్ని కట్టడి చేసేలా ఢిల్లీ డిక్లరేషన్‌లో కొన్ని మార్పులు చేశారన్నారు. జి-20 సదస్సు నిర్ణయాల అమలుకు ప్రత్యేక యంత్రాగం లేదని, కానీ, బ్రిక్స్ నిర్ణయాల అమలుకు ప్రత్యామ్నాయాలను సిద్ధం చేశారని తెలిపారు. లైంగిక అసమానతలు తగ్గించాలి, అవినీతిని అరికట్టాలి, ప్రజారోగ్యం, మత విశ్వాసాలను కాపాడతాం, పర్యావరణ పరిరక్షణ వంటి పలు కీలక అంశాలపై డిక్లరేషన్ చేశారు కానీ... వాటి అమలుకు ఫోరం లేకపోవడం ప్రధాన అవరోధంగా మారిందన్నారు. జి-20 సదస్సులో పౌరసమాజాన్ని భాగస్వామ్యం చేసే సంప్రదాయాన్ని ఈసారి పాటించలేదని, కేవలం ప్రభుత్వాల మధ్య మాత్రమే చర్చలు జరిగాయని తెలిపారు. గతంలో నిర్దేశించిన మిలినియం డెవలప్‌మెంట్ గోల్స్ సాధించలేదు కాబట్టి, దానిపేరు మార్చి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌గా ఈసారి అజెండా రూపొందించారని వివరించారు. ప్రపంచంలో జరిగే వాణిజ్యంలో 75 శాతం వ్యాపారం జి-20 దేశాల్లో జరుగుతున్నందున ఈ సదస్సుకు ప్రాధాన్యత ఉందని తెలిపారు. వెబినార్‌ను ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ సమన్వయం చేశారు.

కాశ్మీర్ యాపిల్ రైతులపై కేంద్రం కక్షసాధింపు

- పంట చేతికొచ్చే సమయంలో అమెరికా యాపిల్స్‌పై సుంకం తగ్గింపు
- మోడీ ప్రభుత్వ నిర్ణయంతో పెట్టుబడులూ దక్కవంటున్న రైతులు

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో యాపిల్ పంట దిగుమతి కాలం సమీపిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అక్కడి రైతులపై పిడుగులా పడింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే యాపిల్స్‌పై టారిఫ్‌ను 20 శాతాన్ని కేంద్రం తగ్గించడం జమ్ముకాశ్మీర్ రైతులకు అశనిపాతంగా మారనుంది. ఇప్పటికే పంట సాగు వ్యయం పెరగడం, ప్రభుత్వం నుంచి సబ్సిడీలు లేకపోవడం, సరైన మద్దతు ధర లేకపోవడం, దళారుల దోపిడీ, అననుకూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల వంటి వాటితో కష్టాలు పడుతున్న రైతులు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉక్కిరిబిక్కిరి కానున్నారు. ప్రీమియమ్ వాషింగ్టన్ యాపిల్స్‌పై 2019 నుంచి అమల్లో ఉన్న 70 శాతం సుంకంలో 20 శాతం తగ్గిస్తున్నట్లు ఈ ఏడాది జూన్‌లో అమెరికా పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. తాజాగా న్యూఢిల్లీలో జరిగిన జి-20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోడీ - బైడెన్ ద్వైపాక్షిక సమావేశానికి ముందు దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఈ నిర్ణయం ఈ నెల 5 నుంచి అమల్లోకి వచ్చింది. యాపిల్స్, వాల్‌నట్స్, లెంటిల్స్, చిక్‌పీస్ వంటి అనేక అమెరికా ఉత్పత్తులపై ఈ నోటిఫికేషన్ పన్ను మినహాయింపులను ప్రకటించింది.

జమ్ముకాశ్మీర్‌కు చెందిన యాపిల్ తోటల పెంపకందార్లు, వ్యాపారుల సమాచారం ప్రకారం రాష్ట్రంలో యాపిల్ పంట చేతికొచ్చే సమయంలోనే వాషింగ్టన్ యాపిల్స్ కూడా మార్కెట్లోకి వస్తాయి. ఇది స్థానిక పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీస్తుంది. జమ్ముకాశ్మీర్ యాపిల్ పరిశ్రమపై ఆధారపడి సుమారు 30 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. వీరిపై కేంద్ర నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపనుంది.

విదేశీ ప్రశంసల కోసం కాశ్మీరీలను ఇబ్బందులకు గురి చేస్తున్న కేంద్రం

'అధిక ద్రవ్యోల్బణం కారణంగా ఇప్పటికే యాపిల్ ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగింది. కొన్నేళ్ల నుంచి దిగుబడి కూడా పడిపోయింది. అమెరికా నుంచి దిగుమతి యాపిల్స్‌పై పన్ను తగ్గింపు జమ్ముకాశ్మీర్ రైతులనే కాకుండా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రైతులను కూడా దెబ్బతీస్తుంది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలి' అని కాశ్మీర్‌లోని యాపిల్ రైతులు, వ్యాపారుల సంఘం ఆల్ వ్యాలీ ఫ్రూట్ గ్రోవర్స్ అండ్ డీలర్స్ అసోసియేషన్ (ఎవిఎఫ్‌జిడిఎ) అధ్యక్షులు బషీర్ అహ్మద్ బషీర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడుతూ ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్రస్తుత జమ్ముకాశ్మీర్ పరిపాలనా యంత్రాంగానికి, జమ్ముకాశ్మీర్ ప్రజలకు మధ్య సత్సంబంధాలు లేవనే విషయాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తుందని చెప్పారు. 'అమెరికా, ఇతర దేశాలను సంతోషపెట్టడానికే కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ ప్రజలపై కష్టాలను మోపుతోంది. వేదనలకు గురిచేస్తోంది' అని అబ్దుల్లా విమర్శించారు.

భారత దేశపు యాపిల్ బుట్టగా జమ్ముకాశ్మీర్

భారత దేశపు యాపిల్ బుట్టగా జమ్ముకాశ్మీర్‌గా పేరుగాంచింది. గత ఏడాది సీజన్‌లో సుమారు 21 లక్షల మెట్రిక్ టన్నుల యాపిల్ పళ్లను జమ్ముకాశ్మీర్ ఉత్పతి చేసింది. ఇది మొత్తం భారత దేశంలో ఉత్పత్తి చేయబడిన యాపిల్స్‌లో 70 శాతానికి కంటే ఎక్కువ. ఈ ఉత్పత్తితో జమ్ముకాశ్మీర్ సుమారు 14 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2019లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హయాంలో ఉక్కు, అల్యూమినియం వంటి వస్తువులపై దిగుమతి సుంకాలను అమెరికా సుమారు 25 శాతం పెంచింది. దీనికి ప్రతిగా భారత్ అమెరికా నుంచి దిగుమతి అయ్యే యాపిల్స్ వంటి వాటిపై సుంకాలను పెంచింది. దీంతో అమెరికా నుంచి యాపిల్స్ దిగుమతులు భారీగా తగ్గాయి. 2018-19లో అమెరికా నుంచి సుమారు 145.2 మిలియన్ డాలర్ల విలువైన యాపిల్స్ దిగుమతి కాగా, 2022-23కు 5.27 మిలియన్ డాలర్లకు తగ్గింది. ప్రస్తుతం భారత్‌కు అతిపెద్ద యాపిల్ ఎగుమతి దారుగా టర్కీ అవతరించింది. దేశానికి దిగుమతయ్యే యాపిల్స్‌లో 84 శాతం టర్కీ నుంచే వస్తున్నాయి. తరువాత స్థానాల్లో ఇటలీ, చిలీ, ఇరాన్ దేశాలు ఉన్నాయి.

ప్రస్తుత సీజన్‌లో జమ్ముకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో అకాల వర్షాలు, వరదల కారణంగా సుమారు 50 శాతం యాపిల్స్ సాగు తగ్గింది. యాపిల్ చెట్లకు బూజు, తెగుళ్ల వంటి వ్యాధులు వ్యాపించాయి. దిగుబడి తగ్గి ఇప్పటికే నష్టపోయిన రైతుకు అమెరికా నుంచి యాపిల్స్ రాక మరింత నష్టాన్ని కలుగజేయనుంది. స్థానిక యాపిల్స్‌కు కిలోకు కనీసం రూ.100 తగ్గుతుందని రైతులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. యాపిల్ సాగులో అధునాతన సాంకేతిక వినియోగం, అక్కడి ప్రభుత్వాలు అందించే రాయితీలతో అమెరికా రైతులు అభివృద్ధి చెందుతున్నారని జమ్ముకాశ్మీర్ రైతులు తెలిపారు. అమెరికా యాపిల్‌తో దేశీయ రకాల యాపిల్స్ పోటీ పడలేవని చెప్పారు. ధరలు తగ్గడంతో తమకు పెట్టుబడి సొమ్ము కూడా తిరిగి రాలేదని తెలిపారు. జపాన్ నుంచి వచ్చే బియ్యం దిగుమతులపై 100 శాతం సెస్ విధిస్తున్న కేంద్రం, అమెరికా యాపిల్స్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించడాన్ని రైతులు తప్పుపడుతున్నారు.

పిఎంఒ జోక్యం చేసుకోవాలి : ముఫ్తీ

అమెరికా యాపిల్స్ దిగుమతి సుంకం తగ్గింపు విషయంలో ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ) జోక్యం చేసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ డిమాండ్ చేశారు. 'కేంద్రం నిర్ణయం జమ్ముకాశ్మీర్‌లోని సాగుదారులపై విధ్వంసకర ప్రభావాన్ని చూపుతుంది. వీరు 2019 నుంచి భారీ నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నిర్ణయాన్ని పిఎంఒ పునఃపరిశీలించాలి' అని ముఫ్తీ ట్వీట్ చేశారు.

సుంకాల తగ్గింపును వెనక్కి తీసుకోవాలి : తరిగామి

అమెరికా యాపిల్స్‌పై దిగుమతి సుంకాలను తగ్గించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని, కేంద్రం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం నాయకులు మహ్మద్ యూసుఫ్ తరిగామి డిమాండ్ చేశారు. జమ్ముకాశ్మీర్ రైతులు కొన్నేళ్ల నుంచి భారీ నష్టాలతో సతమతమవుతున్నారని, ఈ నిర్ణయంతో వారి కష్టాలు మరింతగా పెరుగుతాయని చెప్పారు. భారీగా పెరిగిన ద్రవ్యోల్బణంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి, పెట్టుబడి ఖర్చులు కూడా రాబట్టుకోలేని స్థితిలో రైతులు ఉన్నారని తెలిపారు.

తూర్పు లిబియాలో ఆకస్మిక వరదల బీభత్సం

- 10వేల మంది గల్లంతు?
- విధ్వంసానికి గురైన తీర ప్రాంత నగరం డెర్నా

ఆకస్మిక వరదలతో రెండు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన డెర్నా నగరం

కైరో : తూర్పు లిబియాలో సంభవించిన భయంకరమైన వరదల్లో దాదాపు 10వేల మంది గల్లంతైనట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున విధ్వంసం చోటు చేసుకుంది. తీర ప్రాంత నగరంలోని శిధిలాల గుట్టల్లో నుంచి వందలాది మృత దేహాలను వెలికి తీయడంలో సహాయక బృందాలు నిమగ్నమయ్యాయి. డెర్నా నగరంలోనే దాదాపు రెండు వేల మంది మరణించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మధ్యధరా సముద్రంలో వచ్చిన తుపానుతో తూర్పు లిబియాలోని పలు పట్టణాల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. తీర ప్రాత నగరమైన డెర్నాలో తీవ్ర విధ్వంసం చోటు చేసుకుంది.

భారీగా కురిసిన వర్షాలతో వరదలు తలెత్తాయి. పలుచోట్ల డ్యామ్‌లకు గండి పడ్డాయి. అనేక పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. ఒక్కసారిగా సంభవించిన వరదల్లో 10వేల మంది వరకు ఆచూకీ తెలియకుండా పోయారని అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సమాఖ్య అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం వుందని తెలిపారు. ఎగువున వున్న రెండు డ్యామ్‌లకు గండి పడడంతో ఒక్కసారిగా నీటి ప్రవాహం ముంచెత్తిందని, అప్పుడే చాలామంది కొట్టుకుపోయి వుంటారని భయపడుతున్నట్లు తూర్పు లిబియా ప్రధాని ఒసామా హమద్ తెలిపారు. తమ దేశ సామర్థ్యానికి మించిన స్థాయిలో డెర్నాలో విధ్వంసం చోటు చేసుకుందన్నారు. డెర్నాను డిజాస్టర్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. సముద్రంలోకి పెద్ద ఎత్తున మృతదేహాలు కొట్టుకుపోయి వుంటాయని అనుమానిస్తున్నట్లు ఆరోగ్యమంత్రి తెలిపారు. ఆ నగరంలో చోటు చేసుకున్న విధ్వంసం దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

ప్రత్యేక రైల్లో మాస్కో చేరుకున్న కిమ్

- పుతిన్‌తో భేటీ ?

మాస్కో, ప్యాంగాంగ్ : ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ మంగళవారం రష్యా చేరుకున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో, కిమ్ సమావేశమవుతారని భావిస్తున్నారు. ఎప్పుడు, ఎక్కడ జరిగేది వివరాలు తెలియరాలేదు. కోవిడ్ తర్వాత కిమ్ మొదటి విదేశీ పర్యటన ఇదే. ఆదివారం మధ్యాహ్నం ప్యాంగాంగ్‌లో బయలుదేరిన కిమ్ వ్యక్తిగత రైలు మంగళవారం మధ్యాహ్నం మాస్కో చేరుకుందని ఉత్తర కొరియా అధికార వార్తా సంస్థ కెసిఎన్ఎ తెలిపింది. కిమ్ వెంట ఉత్తర కొరియా పాలక పార్టీ, ప్రభుత్వం, మిలటరీకి చెందిన పలువురు సభ్యులు, అధికారులు ఉన్నారు. దశాబ్దాలుగా ఉత్తరకొరియా, రష్యా మధ్య సంక్లిష్టమైన సంబంధాలు నెలకొన్నప్పటికీ ఉక్రెయిన్ యుద్ధం ఒక రకంగా రెండు దేశాలను దగ్గర చేసిందని చెప్పవచ్చు. ఉత్తర కొరియా నుంచి రష్యాకు ఆయుధ సరఫరాలపై ఒప్పందం కుదిరే అవకాశం వుంది. దీనిపై పుతిన్, కిమ్ చర్చలు జరపనున్నారు. మరోపక్క క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా కిమ్ రాకను ధ్రువీకరించారు.

2,862కు చేరిన మొరాకో మృతులు

రాబట్ : మొరాకోలో సంభవించిన పెను భూకంపంలో మరణించిన వారి సంఖ్య 2,862కు చేరింది. రెండున్నర వేల మందికి పైగా గాయపడ్డారు. రిక్టర్ స్కేలుపై 6.8 తీవ్రతతో శుక్రవారం రాత్రి సంభవించిన భూకంపం ధాటికి మొరాకోలోని పలు నగరాలు ధ్వంసమయ్యాయి. అనేక భవనాలు కుప్పకూలాయి. గత 60 సంవత్సరాలలో ఇంతటి పెనువిషాదం ఎన్నడూ సంభవించలేదని స్థానిక మీడియా తెలిపింది. 1960లో దేశంలోని పశ్చిమ ప్రాంతంలో సంభవించిన భూకంపం కారణంగా కనీసం 12 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. రోడ్లపై పెద్దపెద్ద బండరాళ్లు అడ్డుగా పడడంతో శిథిలాల తొలగింపు కోసం అవసరమైన సామగ్రి ఇప్పటికీ బాధిత ప్రదేశాలకు చేరుకోలేదు.

ఇమ్రాన్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్

ఇస్లామాబాద్ : పంజాబ్ ప్రావిన్స్‌లోని అటాక్ జైల్లో సిఫర్ కేసు విచారించడాన్ని సవాలు చేస్తూ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వేసిన పిటిషన్‌పై తీర్పును పాక్ కోర్టు మంగళవారం రిజర్వ్ చేసుకుంది. తోషఖానా అవినీతి కేసులో దోషిగా నిర్ధారణ అయిన తర్వాత ఆగస్టు 5 నుంచి ఇమ్రాన్ జైల్లోనే వున్నారు. ఆయన జైలుశిక్షను ఇస్లామాబాద్ హైకోర్టు ఆగస్టు 29న నిలుపుచేసింది. సిఫర్ కేసులో ఆయన ఇంకా జైల్లోనే వున్నారు. ఈ కేసులో రిమాండ్‌ను ప్రత్యేక కోర్టు సెప్టెంబరు 13వరకు పొడిగించింది. అధికార రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించారంటూ ఇమ్రాన్‌పై అభియోగాలు నమోదయ్యాయి. సిఫర్ కేసు విచారణ జరుగుతున్న వేదికను మార్చడం వెనుక దురుద్దేశం వుందని ఇమ్రాన్ తరపు న్యాయవాది ఆరోపించారు. ఇమ్రాన్‌ను జైల్లోనే వుంచాలనే తలంపుతోనే ఇలా విచారణా వేదికను మార్చినట్లు కనిపిస్తోందని అన్నారు. అధికార రహస్యాల చట్టం ఉల్లంఘన కింద నమోదైన కేసు విచారణ ప్రత్యేక కోర్టులో జరగాలని ఆయన చెప్పారు. ఏ చట్టం, నిబంధనల కింద ఇలా విచారణా వేదికను జైల్లోకి మార్చారో చెప్పాలని ఆయన కోరారు.

'మేఘా'కు పివి రమేశ్ రాజీనామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేఘా ఇంజినీరింగ్ సంస్థ బాధ్యతల నుంచి విశ్రాంత ఐఎఎస్ అధికారి పివి రమేశ్ తప్పుకొన్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఆ సంస్థ ఎండి కృష్ణారెడ్డికి మంగళవారం పంపారు. వ్యక్తిగత కారణాల రీత్యా బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సిఐడి తీరుపై పివి రమేశ్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మరోవైపు మేఘా సంస్థ తనను రాజీనామా చేయాలని కోరినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తప్పుబట్టారు. తనను రాజీనామా చేయాలని ఎవరూ కోరలేదని స్పష్టం చేశారు. చంద్రబాబునాయుడును స్కిల్ కేసులో అరెస్ట్ అయిన అంశంలో తన పాత్ర వున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆయన మీడియాలో వివరణ ఇచ్చారు. అలాగే చంద్రబాబునాయుడును అరెస్ట్ చేయడాన్ని పివి రమేష్ తప్పు పడుతూ ఈ కేసులో అజేయ్‌కల్లాం, ప్రేమచంద్రారెడ్డిలను కూడా ప్రశ్నించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇలా మీడియాలో మాట్లాడినందుకు రాజీనామాను మేఘా సంస్థ కోరిందని ఒకవైపు, కాదు తాను వ్యక్తిగతంగా తప్పు చేయనని తనను ఎవరూ రాజీనామా చేయమని కోరలేదని వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'ఆ దేవుడే దిగివచ్చి చెప్పినా తప్పు చేయను. ఒత్తిళ్లకు లొంగను. నా జీవితం మొత్తం ప్రజాసేవ కోసమే పనిచేశాను. విస్తృత ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయాలన్నదే నా మనస్సాక్షి. దానికి విరుద్ధంగా ఆ దేవుడు కూడా నన్ను ప్రభావితం చేయలేడు' అని ఈ మేరకు ట్విటర్ (ఎక్స్)లో పివి రమేశ్ పోస్ట్ చేశారు.

The Sangai Express 15 June/ Peoples Chronicle 15 June.

The Sangai Express
At least 9 civilians killed in Kuki militants' attack
ePeople's Chron
Nine killed, 13 injured in gunfight at Aigejang
Sacrifices wouldn't go in vain: COCOMI

వాస్తవాల వక్రీకరణ!

- ఒక కమ్యూనిటీ పట్ల పక్షపాత ధోరణి
- మణిపూర్ మీడియా కథనాలపై ఆర్మీ లేఖ

సిఎం బిరేన్‌సింగ్‌తో లెఫ్టినెంట్ జనరల్ కలిత (ఫైల్)

న్యూఢిల్లీ : భారత సైన్యం ఆహ్వానం మేరకే తాము మణిపూర్‌లో పర్యటించి, నివేదిక రూపొందించామని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. జులై 12న సైన్యం, గిల్డ్ అధ్యక్షురాలు సీమా ముస్తఫాకు రాసిన లేఖను విడుదల చేసింది. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులపై స్థానిక మీడియా ఇచ్చిన వార్తా కథనాలను పరిశీలించాల్సిందిగా ఇజిఐని సైన్యం ఆ లేఖలో కోరింది. వాస్తవాలను పూర్తిగా తప్పుదారి పట్టిస్తూ, జర్నలిస్టుల నైతిక ప్రమాణాలు, విలువలను ఉల్లంఘిస్తూ స్థానిక మీడియా వ్యవహరించిందని, హింసను మరింతగా రెచ్చగొట్టేందుకు దోహదపడిన ప్రధాన కారణాల్లో ఇది కూడా ఒకటి కావచ్చని ఆ లేఖ పేర్కొంది. జనరల్ ఆఫీసర్ కమాండింగ్ తరపున ఇన్ఫర్మేషన్ వార్‌ఫేర్ వింగ్‌కి చెందిన కల్నల్ అనురాగ్ పాండే సంతకంతో ఈ లేఖ వెలువడింది. ఒక కమ్యూనిటీకి అనుకూలంగా మరో కమ్యూనిటీకి వ్యతిరేకంగా మీడియా వ్యవహరించిన తీరు చాలా స్పష్టంగా రోజువారీ కథనాల్లో కనిపిస్తోందని ఆ లేఖ పేర్కొంది. ఎడిటర్స్ గిల్డ్ అక్కడ పరిస్థితులను పరిశీలించి ఇచ్చిన నివేదికలో కూడా ఈ పక్షపాత ధోరణిని ప్రస్తావించింది. మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్న ప్రాంతాల్లో ఇంటర్‌నెట్‌పై నిషేధం వున్నప్పటికీ హింస మరింతగా చెలరేగేందుకు దోహదపడిన ప్రధాన కారణాల్లో స్థానిక మీడియా వాస్తవాల వక్రీకరణ కూడా ఒక కారణం కావచ్చని ఆ లేఖ పేర్కొంది. అందువల్లే జర్నలిస్టులు, మీడియా సంస్థలకు నిర్దేశించిన మార్గదర్శకాలను, నైతిక సూత్రాలను స్థానిక మీడియా సంస్థలు ఉల్లంఘించాయా? లేదా? అని నిర్ధారించడానికి పై వార్తా కథనాలను పరిశీలించాల్సిందిగా కోరుతున్నట్లు ఆ లేఖ పేర్కొంది. మణిపూర్ మీడియా ఏకపక్షంగా కథనాలు ఇచ్చినట్లు కనిపిస్తోందని, వాటిపై సముచితమైన చర్య తీసుకోవాల్సిందిగా ఆ లేఖ కోరింది. ఇందుకు సంబంధించిన వార్తా క్లిప్పింగ్స్‌ను కూడా జత చేసింది. రెండు కమ్యూనిటీల మధ్య ఉద్రిక్తతలు చెలరేగుతున్న సమయంలో కనీసం శాంతి నెలకొనేందుకు అవకాశం ఇచ్చేలా స్థానిక మీడియా వ్యవహరించి వుండాల్సిందని ఆ లేఖ అభిప్రాయపడింది.

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండ : ముగ్గురు మృతి

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. మంగళవారం ఉదయం జరిగిన దాడిలో కుకీ కమ్యూనిటీకి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కాంగ్‌పోక్పీ జిల్లాలో నిషేధిత ఉగ్రవాద గ్రూపు దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంఫాల్ వెస్ట్, కాంగ్‌పోక్పీ జిల్లాల సరిహద్దులోని ఇరెంగ్, కరం ప్రాంతాల మధ్య ఉన్న గ్రామస్తులపై దాడి చేసినట్లు తెలిపారు. వాహనంపై వచ్చిన దుండగులు కాల్పులకు పాల్పడ్డారని అన్నారు. ఈ ఏడాది మే 3 నుంచి మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘర్షణల్లో 160 మంది ప్రాణాలు కోల్పోయారు.

రాజ్యాంగ ధర్మాసనానికి రాజద్రోహ పిటిషన్లు

న్యూఢిల్లీ : దేశద్రోహంపై ఐపిసి నిబంధన రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తున్న పిటిషన్లను ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీంకోర్టు మంగళవారం నివేదించింది. దేశద్రోహ చట్టాన్ని రద్దు చేయాలని ప్రతిపాదించడంతోపాటు బ్రిటీష్ కాలం నాటి చట్టాలైన ఐపిసి, సిఆర్‌పిసి, సాక్ష్యాధారాల చట్టాల స్థానే కేంద్రం గత నెల్లో పార్లమెంట్‌లో బిల్లులను తీసుకువచ్చింది. భారతీయ శిక్షా స్మృతి (ఐపిసి) నిబంధనలను తిరిగి రూపొందించే క్రమంలో పార్లమెంట్ వున్నందున రాజ్యాంగ చెల్లుబాటు సవాలు పిటిషన్లను విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న అంశాన్ని వాయిదా వేయాలని కేంద్రం కోరింది. ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ దాన్ని తిరస్కరించింది. ప్రస్తుతం స్థాయీ సంఘం ముందు ఈ బిల్లు వుంది.

ఐపిసిలోని 124ఎ (దేశద్రోహం) ఇంకా రాజ్యాంగంలో కొనసాగుతోంది. కొత్త బిల్లు గనక చట్టంగా మారినట్లైతే, శిక్షాస్మృతిలోని కొత్త చట్టమేదైనా భవిష్యత్ నుండే అమల్లోకి వస్తుంది గానీ, వెనుకటి కాలం నుండి అమల్లోకి రాదని భావించవచ్చునని బెంచ్ వ్యాఖ్యానించింది. తదనుగుణంగానే, 124ఎ రాజ్యాంగంలో కొనసాగుతున్నంతవరకు ప్రాసిక్యూషన్ చెల్లుబాటు ఆ ప్రాతిపదికనే సమీక్షించబడుతుందని పేర్కొంది. కేదార్‌నాథ్ సింగ్ వర్సెస్ బీహార్ ప్రభుత్వం కేసులో 1962నాటి తీర్పులో రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణకు పూర్తి విరుద్ధంగా వుందన్న ప్రాతిపదికన ఐపిసిలోని 124(ఎ) రాజ్యాంగ చెల్లుబాటును సమీక్షిస్తున్నట్లు కోర్టు పేర్కొంది. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కుకు సంబంధించినది ఈ 19(1)(ఎ) అధికరణ. 1962 నాటి తీర్పు 124ఎ సెక్షన్ రాజ్యాంగ చెల్లుబాటును సమర్థించింది. అధికరణ 19(1)(ఎ)కు అనుగుణంగానే వుందని పేర్కొంది.

40 శాతం ఎంపిలపై క్రిమినల్ కేసులు

- ఎడిఆర్ నివేదిక

న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయ సభల్లోని 40 శాతం మంది సిట్టింగ్ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎడిఆర్ సంస్థ వెల్లడించింది. ఇందులో 25 శాతం మందిపై (194 మంది ఎంపీలు) హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన కేసులు ఉన్నాయని పేర్కొంది. నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థతో కలిపి సిట్టింగ్ ఎంపీల అఫిడవిట్‌లను పరిశీలించి, వివరాలను వెల్లడించింది. ఉభయ సభల్లో 776 మంది ఎంపీలు ఉండగా, 763 మంది ఎంపీల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించింది. 763 మంది ఎంపీల్లో 306 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. ఇరుసభల్లోని ఎంపీల సగటు ఆదాయం రూ.38.33 కోట్లుగా ఉంది. ఇందులో 53 మంది అంటే 7 శాతం మంది బిలియనీర్లు. ఉభయ సభల్లో క్రిమినల్ కేసులు నమోదైన వారిలో రాష్ట్రాలవారీగా చూస్తే కేరళ నుంచి 29 మంది ఎంపీలకు గాను 23 మందిపై (79 శాతం), బీహార్ నుంచి 56 మందికి గాను 41 (73 శాతం), మహారాష్ట్ర నుంచి 65 మందికి 37 (57 శాతం), తెలంగాణ నుంచి 24 మందికి గాను 13 (54 శాతం), ఢిల్లీ నుంచి 10 మందికి గాను 5గురిపై (50 శాతం) క్రిమినల్ కేసులు ఉన్నాయి. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిలో బీహార్ నుంచి 28 మంది, తెలంగాణ నుంచి 9 మంది, కేరళ నుంచి 10 మంది, మహారాష్ట్ర నుంచి 22 మంది, ఉత్తర ప్రదేశ్ నుంచి 37 మంది ఉన్నారు. బిజెపి నుంచి 139 మంది, కాంగ్రెస్ నుంచి 43 మంది, టిఎంసి నుంచి 14 మంది, ఆర్‌జెడి నుంచి ఐదుగురు, వైసిపి నుంచి 13 మంది క్రిమినల్ కేసులు కలిగి ఉన్నారు. పార్టీల వారీగా చూస్తే బిజెపి నుంచి 98 మంది (25 శాతం), కాంగ్రెస్ నుంచి 26 మంది (32 శాతం), టిఎంసి నుంచి ఏడుగురు (19 శాతం), ఆర్‌జెడి నుంచి ముగ్గురు (50 శాతం), ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఒకరు (9 శాతం), వైసీపీ నుంచి 11 మంది (35 శాతం), ఎన్‌సిపి నుంచి 2 (25 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులు కలిగి ఉన్నారు.

ఇక ఎంపీల ఆస్తుల విషయానికి వస్తే తెలంగాణ 24 మందితో మొదటి స్థానంలో ఉంది. సగటు ఆస్తి రూ.262.26 కోట్లుగా ఉంది.

ఆ తర్వాత మధ్యప్రదేశ్ నుంచి 36 మంది (సగటున రూ.150.76 కోట్లు), పంజాబ్ 20 మంది (సగటున 88.94 కోట్లు) ఉన్నారు. అందరి కంటే తక్కువగా లక్షద్వీప్ ఎంపీ రూ.9.38 లక్షలతో చివరి స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత త్రిపుర ముగ్గురు ఎంపీల సగటు ఆస్తి రూ.1.09 కోట్లు, మణిపూర్ నుంచి ముగ్గురి సగటు ఆస్తి రూ.1.12 కోట్లుగా ఉంది. బిజెపి ఎంపీల సగటు ఆస్తి రూ.18.31 కోట్లు, కాంగ్రెస్ ఎంపీల సగటు ఆస్తి రూ.39.12 కోట్లు, టిఎంసి ఎంపీల సగటు ఆస్తి రూ.8.72 కోట్లు, వైసిపి ఎంపీల సగటు ఆస్తి రూ.153.76 కోట్లు, టిఆర్ఎస్ ఎంపీల సగటు ఆస్తి రూ.383.51 కోట్లు, ఎన్‌సిపి ఎంపీల సగటు ఆస్తి రూ.30.11 కోట్లు, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సగటు ఆస్తి రూ.119.84 కోట్లుగా ఉంది. 53 మంది బిలియనీర్ ఎంపీలలో తెలంగాణ నుంచి ఏడుగురు, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది, ఢిల్లీ నుంచి ఇద్దరు, పంజాబ్ నుంచి నలుగురు, ఉత్తరాఖండ్ నుంచి ఒకరు, మహారాష్ట్ర నుంచి ఆరుగురు, కర్ణాటక నుంచి ముగ్గురు ఉన్నారు. వీరంతా రూ.100 కోట్లకు పైగా ఆస్తిని కలిగి ఉన్నారు. రూ.100 కోట్ల ఆస్తిని కలిగి ఉన్న ఎంపీలలో బిజెపి నుంచి 14 మంది, కాంగ్రెస్ నుంచి ఆరుగురు, బిఆర్ఎస్, వైసిపి నుంచి ఏడుగురు చొప్పున ఉన్నారు.

మీకోసం

కుండీల్లోని మొక్కలకు పురుగు పడితే ఇంగువ కలిపిన నీరు పోయాలి.

జీవన సౌరభం

ప్రశ్నించనిదే సమాధానం దొరకదు.. ప్రయత్నించనిదే విజయమూ లభించదు.

JEEVANA జీవన the family

మా పల్లె

మా పల్లె అందాలు
చూడగా రారండి
ఒక్కసారి చూస్తే
వదిలిపోలేరండి!

పచ్చని పంటలు
మెండుగా తోటలు
పారుతూ ఏరులు
మా పల్లె సీమలు!

గోవులు, మేకలు
పాలిచ్చు నేస్తాలు
మా పల్లె రైతులకు
చేదోడు వాదోడు!

కొక్కోరొక్కో అంటూ
కోడిపుంజుల కూత
కుహు కుహు అంటూ
కోయిలమ్మల పాట
అంబా అంబా అంటూ
తువ్వాయి గెంతాట
అదిచూస్తే చాలును
మనసంత పులకింత!

పండగలు పబ్బాలు
జాతరలు తిరునాళ్ళు
ఘన సంప్రదాయాలు
పల్లెకు పెట్టింధి పేరు!

వారం వారం సంత
మా పల్లెలో నంట
దొరకనిది లేదంట
కూడేరు ప్రజలంతా!

చల్ల చల్లని గాలి
రొదలు లేని హాయి
కాలుష్యమన్నది
కానరాదట నోయి.

స్నేహానికే ప్రాణ
మిచ్చే మా పల్లెవారు
కల్లలే ఎరుగని ప్రేమ
పంచే తీరు

పల్లె మనకు తల్లి
ప్రగతికి మరుమల్లి
ప్రతిన పూని మనం
రక్షించుకోవాలి!

- కూచిమంచి నాగేంద్ర,
9182127880.



కనిపెట్టండి చూద్దాం

పిల్లలూ, ఇక్కడ వృత్తాల్లో వేసిన అంకెలతో ఒక తమాషా లెక్క ఇచ్చాం. దాన్ని బాగా పరిశీలించి ప్రశ్నార్థకం ఉన్న వృత్తంలో సరైన అంకె వేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

- ఎదుల్ల అభిషేక్
పదవ తరగతి
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఓజోన్‌కు విఘాతం కల్గిస్తే ఉపద్రవమే...

పచ్చని చెట్లు... పక్షుల కిలకిలారావాలు... ప్రకృతి సోయగాలతో అనంత జీవకోటితో అలరారుతున్న గ్రహం ఈ మహావిశ్వంలో భూగోళం ఒక్కటే. సౌరకుటుంబంలో ఏ గ్రహానికీ లేని ప్రత్యేకత భూగోళానికి మాత్రమే ఉంది. భూమి చుట్టూ ఓజోన్ వాయువు మేఘాల్లా ఆవరించి సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత (యువి రేస్) కిరణాలను అడ్డగించడం వల్లే ఈ భూమిపై ప్రాణకోటి ఆవిర్భవించింది. మనుగడ సాధించగలుగుతుంది. మానవుల విపరీత చర్యలతో ఓజోన్ పొర దెబ్బతింటే భూమి నివాస యోగ్యం కాకుండా పోతే మనం పారిపోవటానికి మరో గ్రహమేదీలేదు. అందుకే ఓజోన్ పొరను కాపాడుకోవాలి.

-ప్రొఫెసర్ పి.బ్రహ్మాజీరావు,
పర్యావరణ విజ్ఞాన విభాగం అధిపతి,
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం

సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాల నుంచి భూమిని కాపాడే కవచం ఓజోన్ పొర. మూడు పరమాణువులతో కూడిన ఆక్సిజన్ అణువైన ఓజోన్ (ఒ3) వాయు రూపంలో, లేత నీలం రంగులో ఉంటుంది. జీవ మనుగడ ప్రారంభమైనప్పటి నుంచి భూమికి రక్షణ కల్పిస్తూ వస్తున్న ఈ పొరకు ఇప్పుడు మనమే తూట్లు పొడుస్తున్నాం. ఏటేటా అడవులను నరికేయడం, కాలుష్యం పెరగడం వల్ల ఓజోన్ వాయువు రోజు రోజుకూ తగ్గిపోతోంది. దీని వల్లనే భూతాపం పెరగడం, వానలు కురవకపోవడం వంటి అనర్థాలు తరచూ ఎదుర్కొనాల్సివస్తోంది.

ఏకమైన ప్రపంచదేశాలు

ఓజోన్ పొర క్షీణిస్తోందని 1982లో పర్యావరణ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇలాంటి పరిస్థితులే కొనసాగిస్తే భవిష్యత్తులో జీవకోటికి పెద్ద ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని గమనించిన ఐక్యరాజ్యసమితి, ఓజోన్ సంరక్షణ కోసం ప్రపంచ దేశాలను ఏకం చేసింది. ఆ తరువాత 1987, సెప్టెంబర్ 16న ఓజోన్ సంరక్షణ రోజు రోజుగా ఖరారు చేసింది. ఆపై ప్రతి సంవత్సరం ఇదే రోజున ఒక్కో నినాదంతో ప్రచారం చేస్తూ ఓజోన్ పొరపై అవగాహనా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. 2018లో ఓ సంస్థ చేసిన సర్వేలో 2000 సంవత్సరం నుంచి కొన్ని ప్రాంతాల్లో ఓజోన్ 1 నుంచి 3 శాతం మేర తిరిగి పుంజుకుంటోందని తేలింది. కొన్ని చర్యలు తీసుకుంటే 2030లో ఉత్తర ధ్రువంలో, 2050కు దక్షిణ ధ్రువంలో, 2060కు పోలార్ ప్రాంతాల్లో పూర్తిగా ఓజోన్‌ను రక్షించుకునే అవకాశం ఉందని ఆ నివేదిక తెలిపింది. అమెరికన్ మెటీరోలాజికల్ సొసైటీ తన 103వ వార్షిక సమావేశంలో కూడా కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఓజోన్ పొర నాలుగు దశాబ్దాల్లో కోలుకునే మార్గంలో ఉందనీ, ఓజోన్-క్షీణించే రసాయనాలను ప్రపంచవ్యాప్తంగా దశలవారీ తగ్గిస్తే వాతావరణ మార్పులను తగ్గించే ప్రయత్నాలకు ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొంది. ఓజోన్ క్షీణత పదార్థాలపై 'మాంట్రియల్ ప్రోటోకాల్' ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్థాయిలో చర్చించి కొన్ని సూచనలు చేస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు వారి మాంట్రియల్ ప్రోటోకాల్ కట్టుబాట్లను నెరవేర్చడంలో సహాయపడటానికి 1991లో బహుళ పక్ష నిధి ఏర్పాటైంది. వీటి ద్వారా పారిశ్రామిక మార్పిడి, సాంకేతిక సహాయం, శిక్షణ, సామర్థ్య నిర్మాణంతో సహా కార్యకలాపాలను ఆమోదించి ఆయా దేశాల్లో అమలు చేస్తున్నారు. యునైటెడ్ స్టేట్స్ క్లైమేట్ అండ్ క్లీన్ ఎయిర్ కోయలిషన్ వ్యవస్థాపక భాగస్వామి. ప్రపంచవ్యాప్తంగా స్వల్పకాలిక వాతావరణ కాలుష్య కారకాలను తగ్గించడంపై దృష్టి సారించే ప్రయత్నం చేస్తోంది.



జీవులన్నింటికీ ప్రమాదమే

ఓజోన్ పొర పాడవ్వటం మనుషులతోపాటుగా భూమిపై నివసిస్తున్న జంతువులు, పక్షులు, చెట్లు అన్నింటికి ప్రమాదమే. ఆ పొర లేకపోతే సూర్యుడి నుంచి వెలువడే తీవ్రమైన అతినీల లోహిత కిరణాలు మనుషులపై పడి కేన్సర్ రావొచ్చు. సూర్యుడి నుంచి పడే కిరణాలను తట్టుకునే శక్తి మనుషులకు ఉండదు. పలు రకాల రోగాల భారిన పడే అవకాశం ఉంది. వర్షాలు వచ్చే అవకాశాలు తగ్గిపోతాయి.

భూగోళం అగ్నిగోళంగా ...

గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసిపోయిందనీ, ఇక గ్లోబల్ బాయిలింగ్ శకం వచ్చేసిందని ఐక్యరాజ్య సమితి సైతం ఇటీవల ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భూగోళం మండే అగ్నిగోళంగా మారుతోందనీ, శీతల దేశాల్లో సూర్యుడు సెగలు పుట్టిస్తున్నాడని పేర్కొంది. ఎండల ధాటికి ఓ వైపు అడవులు దగ్ధమైపోతుండగా.. మరోవైపు మంచు కరిగిపోయి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇందుకు తగ్గట్లుగానే ఈ ఏడాది జులైలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని యూరోపియన్ కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్, ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించాయి. సాధారణంగా జులైలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యేదని.. కానీ, ఈ ఏడాది దాదాపు 17 డిగ్రీలకు పెరిగిందని వెల్లడించాయి. 1.20 లక్షల సంవత్సరాల్లో భూమి ఇంత వేడెక్కడం ఎప్పుడూ లేదని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. విపరీత వేడి కారణంగా మంచు కరిగి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. చైనా, దక్షిణ కొరియా, బ్రెజిల్, అమెరికా ఈశాన్య ప్రాంతాలు, జపాన్, భారత్, పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సంభవిస్తాయని హెచ్చరించిన విషయం తెలిసిందే. సాధారణంగా ఎడారి ప్రాంతాల్లో పగటిపూటతో పోలిస్తే రాత్రి సమయాల్లో వాతావరణం కాస్త చల్లబడుతుంది. కానీ, కాలిఫోర్నియాలోని 'డెత్ వ్యాలీ'లో రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. వీటి ఫలితంగా 1950తో పోలిస్తే ప్రపంచ భూభాగంలో దాదాపు మూడో వంతు ఏటా కరువు సంభవిస్తుందని.. ఇది 10 లక్షల మందిని తీవ్ర ఆకలిలోకి నెడుతుందని శాస్త్రవేత్తల నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ ఏడాది చివరితో పాటు 2024లో ఎల్‌నినో ప్రభావం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఫలితంగా బ్రిటన్, ఐర్లాండ్, బాల్టిక్ సముద్రం, జపాన్ సముద్రం, పసిఫిక్, పశ్చిమ హిందూ సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. కాగా, ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ మేర కట్టడి చేసేందుకు ప్రపంచ దేశాలతో కలిసి ఐక్యరాజ్య సమితి చర్యలు చేపడుతోంది.



రక్షణకు చెట్లను పెంచాలి

ఓజోన్‌ను రక్షించుకోవాలంటే చెట్లను పెంచాలి. అడవుల నరికివేతను అడ్డుకోవాలి. క్లోరో ఫ్లోరో కార్బన్ల వాడకాన్ని నిషేధించాలి. సంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచాలి. కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. పంటల్లో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి.

ఇంటర్వ్యూ : యడవల్లి శ్రీనివాసరావు

మహేష్‌బాబుతో సినిమా తీస్తా

'దర్శకుడిగా తమిళ్‌లో అజిత్‌కు సూపర్ హిట్ సినిమా ఇచ్చాను. విజయ్‌కు కూడా బ్లాక్ బస్టర్ ఇచ్చాను. ఇక తెలుగులో పవన్ కళ్యాణ్‌కి 'ఖుషి'లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చాను. కానీ మహేష్ బాబుకు మాత్రం హిట్ ఇవ్వలేకపోయాను. ఆయనకు నేను బాకీ పడ్డాను. త్వరలోనే ఆయనతో ఓ సినిమా చేసి బ్లాక్ బస్టర్ హిట్ ఇస్తాను' అని దర్శకుడు, నటుడు ఎస్ జె సూర్య తెలిపారు. మహేష్ బాబుతో సూర్య, 'నాని' చిత్రాన్ని తెరకెక్కించారు. మ్యూజికల్ హిట్‌గా నిలిచిన ఆ చిత్రానికి ఆశించిన ఫలితాలు రాలేదు. కోలీవుడ్‌లో స్టార్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఎస్‌జే సూర్య ప్రస్తుతం 'మార్క్ ఆంటోని' అనే సినిమాలో నటించారు. తాజాగా ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూర్య పైవిధంగా మాట్లాడారు.

దసరాకే 'టైగర్ నాగేశ్వరరావు'

రవితేజ హీరోగా వస్తున్న తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. వంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ మూవీ రిలీజ్ విషయంలో సందిగ్ధం నెలకొంది. దీనిపై రవితేజ స్పష్టత ఇచ్చారు. ఇటీవల జరిగిన 'చాంగురే బంగారు రాజా' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకలో ఆయన ఈ విషయంపై మాట్లాడారు. ఫస్ట్ ఫిక్స్ అయిన అక్టోబర్ 20కే 'టైగర్ నాగేశ్వరరావు' థియేటర్లకి రానుందనే విషయాన్ని వెల్లడించారు. 1970 కాలంలో స్టూవర్ట్‌పురంలో పాపులర్ దొంగగా పేరుపొందిన టైగర్ నాగేశ్వరరావు జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. నుపుర్ సనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, మురళీశర్మ, రేణు దేశాయ్, గాయత్రీ భార్గవి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జీవీ ప్రకాష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు శ్రీకాంత్ వీస్సా డైలాగులు అందిస్తున్నారు.

రాకుమారి సంయుక్త

నిఖిల్ సిద్దార్థ నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభు'. నిఖిల్ 20వ చిత్రంగా వస్తున్న ఈ సినిమాలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా విషెస్ తెలియజేస్తూ ఈ చిత్రం నుండి తాజాగా ఆమె ప్రిన్సెస్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. మనోజ్ పరమహంస సినిమాటోగ్రాఫర్‌గా, రవి బస్రూర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో యుద్ధ వీరుడిగా నటిస్తున్న నిఖిల్ ఇటీవల తన పాత్ర కోసం మార్షల్ ఆర్ట్స్, హార్స్ రైడింగ్‌లో ట్రైనింగ్ తీసుకోడానికి వియాత్నం వెళ్లారు. త్వరలోనే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం.

కొత్త డేట్‌కి 'రూల్స్ రంజన్'

కిరణ్ అబ్బవరం నటించిన తాజా చిత్రం 'రూల్స్ రంజన్' కొత్త రిలీజ్ డేట్‌లో వస్తోంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం సెప్టెంబర్ 28న ఈ చిత్రం విడుదల చేయాలి. కానీ ఆ తేదీని వాయిదా వేస్తూ అక్టోబర్ 6న ఈ సినిమా రిలీజ్ చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా హీరోహీరోయిన్ల లుక్ కూడా విడుదల చేశారు. 'కొత్త తేదీ.. కానీ అపరిమిత వినోదం పక్కా..' అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన తాజా లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీని ఏఎం రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దివ్యాంగ్ లావణ్య, మురళీకృష్ణ వేమూరి తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో మెహర్ చాహల్, వెన్నెల కిశోర్, సుబ్బరాజు, హైపర్ ఆది, వైవా హర్ష, తదితరులు నటిస్తున్నారు.



మమ్ముట్టి సోదరి మృతి

మలయాళ హీరో మమ్ముట్టి ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆయన సోదరి అమీనా (70) కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుకూ తుదిశ్వాస విడిచారు. ఆమెకు జిబిన్ సలీం, జూలీ, జూబీ పిల్లలు కూడా ఉన్నారు. బుధవారం ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఇటీవలే మమ్ముట్టి తన 72వ పుట్టినరోజు జరుపుకున్న సంగతి తెలిసిందే. మమ్ముట్టి తల్లి ఫాతిమా ఇస్మాయిల్ ఏప్రిల్ 21న మరణించారు. అమీనా మృతి పట్ల మలయాళ చిత్ర పరిశ్రమ, మమ్ముట్టి అభిమానులు సంతాపం ప్రకటించారు.

22న 'ఎక్స్‌పెండబుల్స్-4'

సిల్వెస్టర్ స్టాలోన్ ప్రధాన పాత్ర పోషించిన ఎక్స్‌పెండబుల్స్-4 విడుదలకు సిద్ధమైంది. ఎక్స్‌పెండబుల్ సిరీస్ డేవిడ్ కల్లాహం సృష్టించిన పాత్రల ఆధారంగా రూపొందించబడింది. స్పెన్సర్ కోహెన్, విమ్మర్, డాగర్‌హార్ట్ కథ ఆధారంగా కర్ట్ విమ్మర్, టాడ్ డాగర్‌హార్ట్, మాక్స్ ఆడమ్స్ స్క్రీన్ ప్లే నుండి స్కాట్ వా దర్శకత్వం వహించిన అమెరికన్ చిత్రం. ఇది ది ఎక్స్‌పెండబుల్స్ 3కి సీక్వెల్. మల్టీవిజన్ మల్టీమీడియా ఇండియా ప్రై. లిమిటెడ్ సమర్పిస్తోంది. ఈ సినిమా ఇంగ్లీష్, తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఈనెల 22న విడుదల కానుందని పివిఆర్ పిక్చర్స్ ప్రతినిధులు తెలిపారు. ది ఎక్స్‌పెండబుల్స్ మొదటి సిరీస్ (2010)లో ఎక్స్‌పెండబుల్స్ 2 (2012), 3 (2014)లో విడుదలయ్యాయి.

ఫైనల్‌కు టీమిండియా

శ్రీలంకపై 41పరుగులతో గెలుపు
10వేల పరుగుల క్లబ్‌లో రోహిత్
కుల్దీప్‌కు నాలుగు వికెట్లు

కొలంబో: ఆసియా కప్ ఫైనల్లోకి టీమిండియా దూసుకెళ్లింది. శ్రీలంకతో మంగళవారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో భారతజట్టు 41పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా రెండు విజయాలతో భారతజట్టు 4పాయింట్ల (+2.69 రన్‌రేట్)తో ఫైనల్‌కు చేరింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు 49.1 ఓవర్లలో 213పరుగులకే ఆలౌటైంది. ఛేదనలో డిఫెండింగ్ చాంపియన్ శ్రీలంక జట్టు 41.3ఓవర్లలో 172పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్లకు అనుకూలించిన ఈ పిచ్‌పై కుల్దీప్(4/43) మరోసారి మెరిసాడు. జడేజా(2/33), బుమ్రా (2/30) టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించారు.

టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను కెప్టెన్ రోహిత్ శర్మ(53) శుభ్‌మన్ గిల్(19) శుభారంభం ఇచ్చారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 80 పరుగులు జోడించారు. కేఎల్ రాహుల్(39), ఇషాన్ కిషన్(33) ఫర్వాలేదనిపించారు. శ్రీలంక యువ స్పిన్నర్ దునిత్ వెల్లలగే(5/40), చరిత అసలంక(4/18) మెలికలు తిరిగే స్పిన్‌కు భారత బ్యాటర్స్ పెవీలియన్‌కు క్యూ కట్టారు. ఒకానొక దశలో టీమిండియా స్కోర్ 200 పరుగులైనా దాటుతుందా? అనే సందేహం కలిగింది. చివర్లో అక్షర్ పటేల్(26) మహమ్మద్ సిరాజ్(5 నాటౌట్)తో కలిసి చివరి వికెట్‌కు విలువైన 26 పరుగులు జోడించడంతో భారత్ గౌరవప్రద స్కోర్‌కు చేరింది. 49వ ఓవర్ తొలి బంతిని భారీ షాట్ ఆడిన అక్షర్ పటేల్ బౌండరీ వద్ద సమరవిక్రమ చేతికి చిక్కాడు. దాంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత వెల్లలాగే రాకతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది.

ఛేదనలో శ్రీలంక ప్రారంభం నుంచే వికెట్లను కోల్పోయింది. 99 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో నిలిచింది. ఆ దశలో ధనుంజయ(41), వెల్లలగే(42నాటౌట్) క్రీజ్‌లో ఉండగా శ్రీలంక సునాయాసంగా మ్యాచ్‌ను గెలిచే కనిపించింది. ఈ క్రమంలో ధనుంజయ వికెట్‌ను 162పరుగుల వద్ద కోల్పోయిన శ్రీలంక మరో 10 పరుగుల వ్యత్యాసంలో మిగిలిన వికెట్లను కోల్పోయింది. చివరి రెండు వికెట్లను కూల్చి కుల్దీప్ టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్దీప్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ (బి)వెల్లలగె 53, శుభ్‌మన్ (బి)వెల్లలగె 19, కోహ్లి (సి)శనక (బి)వెల్లలగె 3, ఇషాన్ (సి) వెల్లలగె (బి)అసలంక 33, కేఎల్ రాహుల్ (సి అండ్ బి) వెల్లలగె 39, హార్దిక్ (సి)కుశాల్ (బి)వెల్లలగె 5, జడేజా (సి)కుశాల్ (బి)అసలంక 4, అక్షర్ (సి)సమరవిక్రమ (బి)తీక్షణ 26, బుమ్రా (బి)అసలంక 5, కుల్దీప్ (సి)ధనుంజయ (బి)అసలంక 0, సిరాజ్ (నాటౌట్) 5, అదనం 19. (49.1ఓవర్లలో ఆలౌట్) 213పరుగులు. **వికెట్ల పతనం:** 1/80, 2/90, 3/91, 4/151, 5/170, 6/172, 7/178, 8/186, 9/186, 10/213 **బౌలింగ్:** రజిత 4-0-30-0, తీక్షణ 8-0-29-0, శనక 3-0-24-0, పథిరన 3-0-27-0, వెల్లలగె 10-1-40-5, ధనుంజయ 10-0-28-0, అసలంక 9-1-18-4.

శ్రీలంక ఇన్నింగ్స్: నిస్సంక (సి)రాహుల్ (బి)బుమ్రా 6, కరుణరత్నే (సి)శుభ్‌మన్ (బి)సిరాజ్ 2, కుశాల్ మెండిస్ (సి)సూర్యకుమార్ (బి)బుమ్రా 15, సమరవిక్రమ (స్టంప్)రాహుల్ (బి)కుల్దీప్ 17, అసలంక (సి)రాహుల్ (బి)కుల్దీప్ 22, ధనుంజయ (సి)శుభ్‌మన్ (బి)జడేజా 41, శనక (సి)రోహిత్ (బి)జడేజా 9, వెల్లలగె (నాటౌట్) 42, తీక్షణ (సి)సూర్యకుమార్ (బి)హార్దిక్ 2, రజిత (బి)కుల్దీప్ 1, పథీరణ (బి)కుల్దీప్ 0, అదనం 15. **వికెట్ల పతనం:** 1/7, 2/25, 3/25, 4/68, 5/73, 6/99, 7/162, 8/171, 9/172, 10/172 **బౌలింగ్:** బుమ్రా 7-1-30-2, సిరాజ్ 5-2-17-1, హార్దిక్ 5-0-14-1, కుల్దీప్ 9.3-0-43-4, జడేజా 10-0-33-2, అక్షర్ 5-0-29-0

టాప్‌లో జకోవిచ్, సబలెంకా

ఎటిపి ర్యాంకింగ్స్ విడుదల



న్యూయార్క్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య(ఎటిపి) ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్, మహిళల విభాగంలో యుఎస్ ఓపెన్ రన్నరప్ అర్యానా సబలెంకా అగ్రస్థానంలో నిలిచారు. తాజా ర్యాంకింగ్స్‌లో యుఎస్ ఓపెన్ సింగిల్స్ ఛాంపియన్ జకోవిచ్ 11,795పాయింట్లతో నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. ఇక వింబుల్డన్ ఛాంపియన్, స్పెయిన్ యువ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ (8535పాయింట్లు) 2వ స్థానంలో, రష్యాకు చెందిన మెద్వదెవ్ 7280పాయింట్లు మూడోస్థానంలో నిలిచారు. ఇక మహిళల ఎటిపి ర్యాంకింగ్స్‌లో బెలరాస్‌కు చెందిన ఆర్యానా సబలెంక సత్తా చాటింది. తాజా ఎటిపి ర్యాంకింగ్స్‌లో సబలెంకా 9265పాయింట్లతో అగ్రస్థానానికి ఇగా స్వైటెక్(పోలండ్) 8195 పాయింట్లతో 2వ, యుఎస్ ఓపెన్ ఛాంప్ కోకా గాఫ్(అమెరికా) 6165 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు.

కౌంటీల్లో మెరిసిన చాహల్

లండన్: కౌంటీ క్రికెట్‌లో భారత లెగ్‌స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ మెరిసాడు. డివిజన్-1 మ్యాచ్‌లో భాగంగా మంగళవారం నాటింగ్‌హామ్‌షైర్‌పై మూడు వికెట్లతో సత్తా చాటాడు. 33ఏళ్ల 20 ఓవర్లలో 52పరుగులిచ్చి మూడు వికెట్లను కూల్చాడు. కెంట్ తరపున తొలి మ్యాచ్ ఆడుతున్న చాహల్.. నాటింగ్‌హామ్‌షైర్‌పై అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. ఇక కౌంటీల్లో ఆడుతున్న అర్ష్‌దీప్ సింగ్ మొత్తం 13 వికెట్లతో సత్తా చాటుతున్నాడు. ఈ ఏడాది జనవరి నుంచి భారతజట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న చాహల్.. ఆసియాకప్, ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో చోటు దక్కించుకోలేకపోతున్నాడు.

డేవిస్‌కప్ జట్టులో బొప్పన్నకు చోటు

లక్నో: మొరాకోతో శనివారం జరిగే డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్-2 ప్లే-ఆఫ్‌లో తలపడే భారత టెన్నిస్ ఆటగాళ్ల జాబితాను భారత టెన్నిస్ సమాఖ్య మంగళవారం ప్రకటించింది. లక్నో వేదికగా వైజయంత్ ఖాండి మినీ స్టేడియంలో జరిగే డేవిస్ కప్ పోటీలు జరగనున్నాయి. యుఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ రన్నరప్ 43ఏళ్ల రోహన్ బొప్పన్నకు డబుల్స్ విభాగంలో చోటు దక్కింది. ప్రపంచ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో బొప్పన్న 17వ స్థానంలో ఉన్నాడు. మొత్తం ఆరుగురు ఆటగాళ్లతో కూడిన భారత డేవిస్ కప్ జట్టును భారత టెన్నిస్ సమాఖ్య వెల్లడించింది. సింగిల్స్‌లో టాప్ ర్యాంకర్ సుమిత్ నాగల్‌తోపాటు శశికుమార్ ముకుంద్, దిగ్విజయ్ ప్రతాప్ సింగ్, యుకీ బాంబ్రీ మరియు రామ్‌కుమార్ రామనాథన్ మిగిలిన ఆటగాళ్లు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68